www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 250
శుక్రవారం 02-03-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ గత మూడేళ్ళుగా ఐక్యతతో అలుపెరగని పోరాటం చేయడం వల్లే తొలి ఫలితం సాధించగలిగాం. ఈ పోరాట ఫలితం తనకేగాక యావత్ అగ్రిగోల్డ్ బాధిత లోకానికి పూర్తి సంతృప్తినిచ్చింది. ఇన్ని లక్షల మందిని ఐక్యంగా నిలబెట్టడమే కాకుండా, ప్రభుత్వాన్ని ఆలోచనలో పెట్టి, బాధితులకు నష్టపరిహారం చెల్లించడం తప్ప మరో మార్గం లేదనే స్థితికి తీసుకురావడం ఈ ఉద్యమ గొప్ప విజయం.

– ముప్పాళ్ల నాగేశ్వరరావు
అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు

ఇది పోరాట విజయం

ఐక్యఉద్యమాలతో లక్ష్య సాధన

అగ్రిగోల్డ్ సంస్థ మోసాలకు దారుణంగా బలైన బాధితులకు తొలి ఫలితం దక్కింది. విరామం లేకుండా ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశ్వనాథరెడ్డి, తిరుపతిరావు నేతృత్వంలో ఆందోళనలు, ఉద్యమాలు, ధర్నాలు, నిరాహార దీక్షలు, బస్సు యాత్రలు వంటి పోరాటాలతో లక్ష్య సాధన దిశగా సాగింది. ఈ ఐక్య ఉద్యమాలకు తలొగ్గిన ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేసింది.

11లో



చెక్కు అందిస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన యనమల తదితరులు

వార్త 3లో



అభివాదం తెలుపుతున్న రామకృష్ణ, కేఎస్ లక్ష్మణరావు, రఘువీరారెడ్డి, మధు, చలసాని శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, శివాజీ, వెంకట రామారావు, గౌతంరెడ్డి తదితరులు



హాజరైన వివిధ పార్టీల నేతలు

న్యాయం కోసం సమరమే

మోడీ హఠావో.. ఏపీ బచావో నినాదంతో ముందుకు

- సుదీర్ఘ పోరాటానికి తెలుగుజాతి సిద్ధం కావాలి
- గుంటూరులో విజయవంతమైన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి సదస్సు

ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశాయని పలువురు వక్తలు విమర్శించారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి సదస్సు విజయవంతమైంది. పార్లమెంట్ సమావేశాల్లో ఏపీకి న్యాయం జరగకపోతే ప్రధాని మోడీ హఠావో ఏపీ బచావో నినాదంతో ముందుకు వెళదామని, విద్యార్థులు, యావత్తు తెలుగు జాతి సుదీర్ఘ పోరాటాలకు సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు.

12లో

పుష్టి బ్రాండ్ వరి



- బలవర్ధకమైన వంగడం
- జన్యుమార్పిడితో విత్తనం తయారీ
- ఏపీ ప్రభుత్వ ఏర్పాట్లు

విశాలాంధ్ర–నెల్లూరు:
అధిక పోషక విలువలు కలిగిన కొత్త వరివంగడాన్ని రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. జన్యుమార్పిడి ద్వారా బలమైన వరివంగడాన్ని రూపొందించేందుకు ఫిలిప్పీన్స్ వరి వంగడం పరిశోధనా సంస్థ భాగస్వామ్యంతో కొత్త వరి వంగడాన్ని తయారుచేసేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఫిలిప్పీన్స్ సంస్థతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ వరివంగడం రైతులకు అందుబాటులోకి వస్తున్నట్లయితే దక్షిణ భారతదేశంలోని రైతులు, వినియోగదారులు ప్రయోజనం పొందగలరని భావిస్తున్నారు. దాదాపు 250కిపైగా వరివంగడాలను సమ్మిళితం చేసి కొత్త వంగడాన్ని సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. వర్షాభావ సీజన్లలోనూ

- మిగతా 2 లో

నేటి నుంచి దక్షిణాదిలో సినిమా థియేటర్లు

బంద్



విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్:
డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల వైఖరికి నిరసనగా శుక్రవారం నుంచి థియేటర్లను మూసివేస్తున్నట్లు దక్షిణ భారత నిర్మాతల మండలి తీర్మానించింది. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడులో బంద్‌కు

- మిగతా 2 లో

ప్రముఖ రచయిత నాయని కన్నుమూత

మాబడి, పాఠశాల మ్యాగజైన్లు నిర్వహణ



విశాలాంధ్ర బ్యూరో–తిరుపతి :
ప్రముఖ రచయిత నాయని కృష్ణమూర్తి గురువారం ఉదయం కన్నుమూశారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో కుటుంబ సభ్యులు బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అంత్యక్రియలు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో శుక్రవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు. కాగా, పలు నవలలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలను రచించిన

- మిగతా 2 లో

మండే ఎండలు..!

- ఈ ఏడాది ఒక డిగ్రీ సెల్సియస్ అధికం
- మార్చి నుంచి మే వరకు ముచ్చెమటలే..
- రుతుపవనాలు సానుకూలమే..

న్యూఢిల్లీ :
వసంత కాలం వీడి రానున్న వేసవిని తట్టుకునేందుకు సన్నద్ధమవ్వండి. దేశంలో సగభాగంలో మార్చి నెల నుంచి మే వరకు ఎండలు మండుతాయట. సగటు ఉష్ణోగ్రత సాధారణంకన్నా ఒక డిగ్రీ సెల్సియస్ అధికంగా ఉండే అవకాశాలున్నాయని వాతావరణ పరిశోధన విభాగం తెలిపింది. ఈ నెలల్లో ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో వేసవి తీవ్రత ఎక్కువగా

- మిగతా 2 లో




ఇదీ లోకం!



'ఆధార్' కష్టాలు

- తప్పులు పోవు, మార్పులు జరగవు
- ఎక్కడకెళ్లినా వారం ఆగాలంటారు
- సక్రమంగా ఉంటేనే సంక్షేమ పథకాలు
- మీ సేవా, ఏపీ ఆన్‌లైన్ సేవలు అంతంతే
- ఇతర సేవలకే ప్రాధాన్యం
- కేంద్రాలపై పర్యవేక్షణా లోపం

విశాలాంధ్రబ్యూరో – అమరావతి
సిమ్ కార్డు తీసుకోవాలన్నా, బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలన్నా, చివరకు ఏదైనా ప్రభుత్వ పథకం కింద లబ్ధి పొందేందుకైనా ప్రత్యేక గుర్తింపు కార్డు ఆధార్ తప్పనిసరి. పుట్టిన పసిబిడ్డ నుంచి ముదుసలి వరకు ఆధార్ కార్డు ఉండాల్సిందే. దేశంలోనే ఆధార్ రిజిస్ట్రేషన్ నూరుశాతం పూర్తి చేసుకున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మొదటి వరుసలో ఉంది. అయితే ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, తప్పులను సరి చేసుకోవటం ఇపుడు ప్రజలకు పరీక్ష పెడుతోంది. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ సర్వీసెస్ డెలివరీ (ఈఎస్‌డీ) గుర్తింపు పొందిన సంస్థల బ్రాంచ్‌లలో మాత్రమే ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆధార్ సమాచారం బహిర్గతం అవుతుందనే ఉద్దేశంతో



ప్రభుత్వం ప్రైవేటు కేంద్రాలపై వేటు వేసింది. దీంతో ఆధార్ సేవల కోసం ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఈఎస్‌డీలో

- మిగతా 11 లో

రాజధానికి రక్షణ కవచం...

- రూ.667 కోట్లతో మూడు రిజర్వాయర్లు..
- 237 కోట్లతో ఉండవల్లి వద్ద ఎత్తిపోతల పథకం..

విశాలాంధ్ర – అమరావతి :
రాజధాని అమరావతికి అతిపెద్ద వరదముంపు శాపంగా ఉందని చరిత్ర చెబుతోంది. దీన్నే ఓ వరంగా మార్చుకునేలా ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. వరద నియంత్రణ, పుష్కలమైన తాగునీటి వసతి, నావిగేషన్ ప్రధాన లక్ష్యాలతో కూడిన ఓ బృహత్తరమైన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టనుంది. అమరావతిలో మూడు రిజర్వాయర్ల నిర్మాణాన్ని సీఆర్డీఏ చేపట్టింది. కొండవీటివాగు. ఉపవాగులతో పాటు మిగిలిన వాగులను లోతుచేసి విస్తరించనున్నారు. నీరుకొండ, కృష్ణాయపాలెం, శాఖమూరుల్లో వీటిని నిర్మిస్తారు. అత్యంత ప్రధానమైన నీరుకొండ రిజర్వాయరును 455ఎకరాల విస్తీర్ణంలో రూ.453.45కోట్ల

- మిగతా 2 లో



ఊగిసలాట

బడ్జెట్ సమావేశాలపై వైసీపీ

రేపు ముఖ్యనేతలతో జగన్ సమావేశం



విశాలాంధ్ర బ్యూరో– అమరావతి :
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 5నుండి ప్రారంభం కానున్న నేపధ్యంలో ఈసారైనా ప్రతిపక్షపార్టీకి చెందిన వైసీపీ సభ్యులు హాజరవుతారా ? లేదా ? అనేది ప్రస్తుతం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెల్చి తెలుగుదేశం పార్టీలో చేరిన 22 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తున్న విషయం తెల్సిందే. ఇందుకోసం గత శీతాకాల సమావేశాల సందర్భంగా స్పీకర్‌కు డెడ్‌లైన్ విధించి, వారిపై చర్య తీసుకోని పక్షంలో అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తామని కూడా స్పష్టం చేసింది. ఆమేరకు సభ్యులు బహిష్కరించారు కూడా. దీంతో టీడీపీయే శీతాకాల సమావేశాల్లో అధికార, ప్రతిపక్షపార్టీ పాత్రలను రెండూ తనే పోషించింది. అయితే దీనిపై వైసీపీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడం సరైన విధానం కాదని, దీనివల్ల అధికారపార్టీ వైఫల్యాలను నిలదీసే అవకాశాన్ని కోల్పోవడం తప్ప ప్రతిపక్షపార్టీకి ఒరిగేదేమీ లేదన్న అభిప్రాయం కొందరిలో వుంది. ఈవిషయాన్ని వైసీపీ అధినేత

- మిగతా 2 లో

ఈజిప్టు రైలు ప్రమాదంలో మృతులు 15



కైరో : ఈజిప్టు ఉత్తరప్రాంతంలోని బెహిరా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో మృతులసంఖ్య 15కు చేరినట్టుగా స్థానిక వార్తా ఏజెన్సీ తెలిపింది. బుధవారం ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో 15మంది చనిపోగా 40మంది గాయపడినట్టు రవాణా మంత్రిత్వశాఖ ప్రతినిధి తెలియజేశారు. ప్రమాదం జరిగిన వెంటనే రవాణాశాఖ మంత్రి అరాఫత్ హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. నడుస్తున్న రైలు నుంచి రెండు బోగీలు విడివడి గూడ్సు రైలును ఢీకొనగా ఈ ప్రమాదం జరిగినట్టు భద్రతా నిర్వహణ అధికారులు తెలిపారు. గాయపడిన వారిని 30 అంబులెన్సులలో ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదానికిగల కారణాలపై దర్యాప్తు చేసేందుకు ఇంజనీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

కేంబ్రిడ్జి వర్సిటీ అధ్యాపకుల సమ్మె

లండన్ : కేంబ్రిడ్జి యూనివర్శిటీ విద్యార్థులు, అధ్యాపకులు సమ్మె చేస్తున్నారు. వర్సిటీ ఆవరణ వెలుపలకు చేరి నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఈనేపథ్యంలో వర్సిటీ యాజమాన్యం చర్చలకు అంగీకరించింది. చర్చలు సోమవారం జరుగుతాయి. అదేరోజు దేశంలోని 64 యూనివర్శిటీల ఉపాధ్యాయులు పెన్షన్లు కోరుతూ పికెటింగులు జరపనున్నారు. వీరంతా గురువారం లండన్‌లో భారీ ప్రదర్శన జరిపారు. బోధనా సిబ్బందికి పెన్షన్లలో కోత విధించనున్నట్లు వారంక్రితమే ప్రకటించారని యూనివర్శిటీల అధ్యాపకుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సల్లీహంట్ తెలిపారు. ఈ అంశంపై చర్చలకు అంగీకరించారని ఆయన అన్నారు. తమ సమ్మెకు విద్యార్థులు మద్దతు పలి కారని వారు కూడా తరగతులను బహిష్కరించారని సల్లీ చెప్పారు. పెన్షన్లను తగ్గించినట్లయితే పదవీ విరమణ అనంతరం ఒక్కొక్కరికి ఇచ్చే పెన్షన్‌లో 10వేల పౌండ్లు తగ్గిపోతుందని యూనియన్ తెలిపింది. గురువారం జరిగిన ప్రదర్శనలనుద్దేశించి లేబర్ పార్టీనేత, షాడో ఛాన్సలర్ జాన్‌మెక్‌డొనెల్ మాట్లాడుతూ వృత్తి స్వభావాన్ని పూర్తిగా మార్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

టర్కీ, గ్రీసు మధ్య 20 లక్షల మంది మార్పిడి



ఏథెన్స్ : టర్కీ గ్రీసు మధ్య 20 లక్షల మంది ప్రజలు ఒక దేశంనుంచి మరోదేశానికి మారనున్నారు. 1923లో కుదిరిన లాసన్నీ ఒప్పందంలో భాగంగా అత్యంత భారీగా ప్రజలు ఒకచోట నుంచి మరోచోటకి తరలివెళ్ళవలసి వచ్చింది. రెండు దేశాలు కూడా ఇందుకు సిద్ధం కావలసివుంది. పరస్పర మార్పిడిలో అనేకమంది కాలినడకన, రైళ్లమీద, సముద్రమార్గంలోను ప్రయాణించవలసి వస్తుంది. ఎంతో కష్టభూయిష్టమైన ఈ మార్పిడి ప్రయాణంలో పెద్దలు, చిన్నపిల్లలు తీవ్రమైన కష్టాలను ఎదుర్కోనున్నారు. ఈ మార్పిడిపై హుస్నేనిసెల్వి మాట్లాడుతూ ఐదేళ్ల నా చెల్లెలని సముద్రంలో పడవేయవలసిందే అని మా తల్లి ఎంతో విసుగుతో చెప్పారని అన్నారు. తాను 1997లో ఐదేళ్ల వయసులోనే గ్రీసు వదలివెళ్లానని సెల్వి అన్నారు. టర్కీలో తాను జన్మించిన గ్రామానికే తిరిగి చేరుకున్నట్టు చెప్పాడు. 1990 నుంచే వివిధ కుటుంబాలు తమ పూర్వీకులున్న గ్రామాలను సందర్శించేందుకు అటునుంచి ఇటు, ఇటునుంచి అటు ప్రయాణం చేస్తూనే ఉన్నారు. కొంతమంది శాశ్వతంగా వెళ్లిపోతూ తమ ఇళ్లను అలా వదిలివేశారు. గతంలో ఇలా ఒకచోట నుంచి మరోచోటకి పూర్వీకుల ఇళ్లను చూసేందుకు వెళ్లినవారు తిరిగి తాము నివసిస్తున్న గ్రామాలకు చేరుకుంటామనే ధైర్యంతో ఇళ్లకు తాళాలు వేసి తాళంచెవిలను కూడా తమ దగ్గరే ఉంచుకున్నారు. అలాంటివారు ఇప్పుడు తిరిగి తమ నివాస ప్రాంతాలకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. రెండవతరానికి చెందిన నుమన్‌టోకర్ మాట్లాడుతూ టర్కీనుంచి గ్రీసులో తమ తల్లి నివసించిన ప్రాంతానికి చేరుకునేందుకు వచ్చానని ఆ గ్రామం చూసి రావాలని తన తల్లి కోర్కెను ఆ విధంగా నెరవేర్చానని తిరిగి ఇప్పుడు అదే గ్రామానికి వెళ్లి నీరు తీసుకుని తన తల్లి సమాధివద్ద పోసి రావాలనుకుంటున్నానని చెప్పారు. అక్కడనుంచి కొంత మట్టిని కూడా తెచ్చుకుంటానన్నారు. తిరిగి తన తల్లిగారి గ్రామాన్ని చూడాలన్న కోర్కె చాలాకాలంగా ఉందని న్యూమన్ అన్నారు. తమ పూర్వీకులు గ్రీసులో 400-500 ఏళ్లక్రితమే ఉన్నారని న్యూమన్ అన్నారు. గతంలో ఒకసారి 20వ శతాబ్దం ప్రారంభంలో భారీగా జనాభా మార్పిడి జరిగింది. ప్రాచీనకాలంనాటి రాచరిక ప్రభుత్వాలు అంతరించాయి. కొత్త రాజ్యాలు ఏర్పడ్డాయి. గ్రీసునుంచి తిరిగి టర్కీవైపు వెళ్లవలసిందేనని చెప్తున్నారు. అయితే 500 గొర్రెలను, వ్యవసాయ భూమిని వదలి వెళ్లిపోవలసివస్తుందని న్యూమన్ ఎంతో దుఃఖంతో చెప్పారు. తమకు చెందిన ప్రతి వస్తువును వదిలి వెళ్లిపోవలసిందేనని న్యూమన్ అన్నారు. మొదటి ప్రపంచయుద్ధంలో ఒట్టోమన్ రాచరిక ప్రభుత్వం ఓడిపోవడంతో గెలుపొందిన రాజ్యాలు ఒట్టోమన్ రాజ్యాన్ని రెండుగా విడగొట్టాయి. ఆనాడు కుదిరిన ఒప్పందం మేరకు ఈ భారీ జనాభా మార్పిడి జరుగుతున్నది.

FORM IV

Statement about ownership and other particulars about newspaper VISALAANDHRA

1. Place of publication	:	Vijayawada
2. Periodicity of its publication	:	Daily
3. Printer's Name	:	Edupuganti Nageswara Rao
Nationality	:	Indian
Address	:	33-22-2, VISALAANDHRAROAD, CHUTTUGUNTA, VIJAYAWADA-520004, A.P.
4. Publisher's Name	:	Edupuganti Nageswara Rao
Nationality	:	Indian
Address	:	33-22-2, VISALAANDHRA ROAD, CHUTTUGUNTA, VIJAYAWADA-520004, A.P.
5. Editor's Name	:	Mutyala Prasad
Nationality	:	Indian
Address	:	33-22-2, VISALAANDHRA ROAD, CHUTTUGUNTA, VIJAYAWADA-520004, A.P.
6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital.	:	VISALAANDHRA VIGNANA SAMITHI

Members of the Governing Body

President:	Muppalla Nageswara rao	Kothapeta-Guntur
Secretary:	Ravula venkaiah	Hanumanpet, Vijayawada
Treasurer:	JV Satyanarayana Murthy	Allipuram, Visakhapatnam
Members:	K.Ramakrishna	Hanumanpet, Vijayawada
	M.Anjaneyulu	Visalakshinagar-Visakhapatnam
	P.J.Chandra Sekhar Rao	Miyapur-Hyderabad
	Jalli Wilson	Mogalrajapuram, VJA
	G.Obulesu	Guntupalli-Vijayawada
	P. Harinatha Reddy	Chandram Buildings-Vijayawada
	Chalasani Ajay Kumar	Suryaraopet-Vijayawada
	Akkineni Chandra Rao	Chandram Buildings, VJA
	P. Durga Bhavani	Ramakrishnapuram, VJA

I, Edupuganti Nageswara Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
Edupuganti Nageswara Rao
Signature of Publisher

Date : 02-03-2018

మదురొ నామినేషనుకు వేలాదిమంది మద్దతు

కారకాస్ : వెనిజులా అధ్యక్ష పదవికి తిరిగి పోటీచేసేందుకుగాను ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురొ వేలాదిమంది మద్దతుదారులతో ప్రదర్శనగావెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. మాజీ అధ్యక్షుడు హుగొఛావెజ్ సమాధిని ముందుగా సందర్శించి అనంతరం జాతీయ ఎన్నికల మండలి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. ఛావెజ్‌కు నివాళి అర్పించేందుకు ఆయన సమాధి వద్దకు చేరుకున్నామని ఆయన చూపిన బాటను అనుసరిస్తామని మదురొ అన్నారు. తన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలను ఉద్దేశించి వారు అమెరికాపై ఆధారపడటం నిలిపివేయాలని అందుకు వారు సిద్ధంగా ఉన్నారా.. అని సవాల్ చేశారు. ప్రతిపక్ష పార్టీ డెమొక్రటిక్ యూనిటీ రౌండ్ టేబుల్ తాము ఏప్రిల్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనబోమని ప్రకటించింది. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరుగుతున్నాయని పలుమార్లు అంతర్జాతీయ పరిశీలకులు నిర్ధారించినప్పటికీ అమెరికా మద్దతు కలిగిన ప్రతిపక్షాలు ఆందోళన చేస్తూనే ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీకార్టర్ వెనిజులాలో ఎన్నికల క్రమం ప్రపంచంలోనే అత్యంత ఉత్తమమైనదిగా అభివర్ణించారు. మదురొపైన పోటీ చేసేందుకు మాజీ గవర్నర్ హెన్రీఫాల్కన్ నామినేషన్ వేయనున్నట్టు ప్రకటించారు. అంతర్జాతీయ పరిశీలకులను అనుమతిస్తున్నట్టుగా ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే తాను పోటీ చేస్తున్నట్టు ఫాల్కన్ వెల్లడించారు. ఫాల్కన్ పోటీ చేస్తున్నట్టు ప్రకటించడంపై మదురొ హర్షం తెలిపారు. మదురొకు మద్దతు ఇవ్వడానికి కమ్యూనిస్టు పార్టీ కూడా అంగీకరించింది.

నేడు బ్రెగ్జిట్‌పై చర్చలు

లండన్ : యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి వైదొలగేందుకు (బ్రెగ్జిట్) బ్రిటన్ ప్రధాని థెరి సామె, ఈయూ నేతలతో శుక్రవారం చర్చలు జరపనున్నారు. అయితే థెరిసా ఒకరోజు ముందుగానే యూరో పియన్ యూనియన్‌నేత డొనాల్డ్ టస్క్‌తో గురువారమే సమావేశమయ్యారు. వీరిరువురు బ్రెగ్జిట్‌పై ఈయూ రూపొందించిన ముసాయిదా ఒప్పందంపైన సంప్రదింపులు జరిపారు. ఉత్తర ఐర్లాండ్‌పైన ఈయూ ప్రతిపాదనలు బ్రిటన్ రాజ్యాంగ సమగ్రతను దెబ్బతీసేవిగా ఉన్నాయని థెరిసా అన్నారు. ఈయూ నేతలు మాట్లాడుతూ థెరిసా ఆచరణాత్మకమైన ప్రత్యామ్నాయంతో ముందుకురావాలన్నారు. బ్రెగ్జిట్ ఒప్పందం ముసాయిదాను యదా తథంగా అంగీకరించవలసిన అవసరంలేదని బ్రిటన్ తన ప్రతిపాదనలను చేయవచ్చునని డొనాల్డ్ టస్క్ అన్నారు.

రక్షణ కవచం...

(మొదటిపేజీ తరువాయి)

వ్యయంతో 0.43టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండేలా అభివృద్ధి చేస్తారు. కృష్ణాయపాలెం వద్ద 190ఎకరాల విస్తీర్ణంలో రూ.159.44కోట్లతో 0.1టీఎంసీల సామర్థ్యం గల చెరువును నిర్మిస్తారు. శాఖమూరు వద్ద ప్రస్తుతం ఉన్న చెరువును రూ.54కోట్లతో 50ఎకరాల విస్తీర్ణంలో 0.03టీఎంసీల నిల్వ సామర్థ్యంతో కూడిన రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తారు. నీరుకొండ రిజర్వాయరు నుంచి కొండవీటి వాగులో పడవల్లో ప్రయాణం ఉంటుంది. ఈ కారణంగా ఈ రిజర్వాయర్‌ను బోర్డింగ్ పాయింట్‌గా నిర్ణయించారు. దక్షిణాభిముఖంగా షిప్‌లాక్‌ను ఏర్పాటు చేస్తారు. ఎక్కువ ప్రవాహగతి మార్గంలో ఓగి స్పిల్‌వేను, తక్కువ ప్రవాహగతి మార్గంలో స్టాప్‌లాగ్స్, గేట్లు ఏర్పాటు చేస్తారు. రెండు దశలతో అమలుచేసే ఈ పథకం తొలిదశను ప్రపంచ బ్యాంకు నిధులతో చేపడతారు. దీనికోసం ప్రభుత్వం గత వందేళ్ల నుంచి వర్షపాతం, వరదల పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసింది. నీరుకొండ నుంచి వయా కృష్ణాయపాలెం మీదుగా ఉండవల్లి వరకు 11కి.మీ. పొడవున కొండవీటివాగు విస్తరణకు రూ.193.47కోట్లు, దొండపాడు, కొండమరాజుపాలెం మధ్య 7.4 కి.మీ. పొడవున పాలవాగు అభివృద్ధికి 55.96 కోట్లు, కొండమరాజుపాలెం-కృష్ణాయపాలెం మధ్య 9.3 కి.మీ. పొడవున పాలవాగు అభివృద్ధికి రూ.87.27 కోట్లు, నెక్కల్లు-పిచ్చుకాలపాలెం మధ్య 7.84 కి.మీ. పొడవున సహజ ప్రవాహ కాలువ నిర్మాణానికి రూ.153.16కోట్లు కావాలని అంచనా వేశారు. ఉండవల్లి వద్ద చేపట్టిన ఎత్తిపోతల పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేయనున్నారు.

కొండవీటివాగు దిగువ పరీవాహక ప్రాంతంలో వరదనీటి మొత్తాన్ని సుమారు 16వేల క్యూసెక్కులుగా అంచనా వేశారు. ఇందుకోసం ప్రతిపాదించిన తొలిదశ ప్రణాళికను ఇప్పటికే ప్రారంభించారు. ఈ వాగు ఉండవల్లి వద్ద కృష్ణానదిలో కలిసేచోట రూ.237కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు. దీనిద్వారా 5వేల క్యూసెక్కులు నదిలోకి, మరో 5వేల క్యూసెక్కులు కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువలోకి ఎస్కేప్ రెగ్యులేటర్ ద్వారా తరలించే విధంగా పనులను చేపట్టారు.

పనులు శరవేగంగా

కొండవీటివాగు ఎత్తిపోతల పథకం పనుల్లో పట్టిసీమ జోరు కనిపిస్తోంది. గోదావరి వరద జలాలను కృష్ణమ్మ చెంతకు చేర్చేలా పట్టిసీమ ఎత్తిపోతలను రికార్డు సమయంలో పూర్తిచేసిన విధంగానే కొండవీటివాగు ఎత్తిపోతల పనులనూ శ్రీఘ్రంగా జరిపిస్తున్నారు. పట్టిసీమ ప్రాజెక్టును పూర్తిచేసిన మేఘా ఇంజనీరింగ్ కంపెనీయే కొండవీటివాగు ఎత్తిపోతలనూ చేపట్టింది. పట్టిసీమ అనుభవం ఇక్కడ ఆ సంస్థకు బాగా కలిసొచ్చింది. అమరావతికి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు చేపట్టిన కొండవీటివాగు వరద నియంత్రణ పథకం తాలూకు పనులు చివరి దశకు చేరుకున్నాయి. వరద నియంత్రణ కోసం ఉండవల్లి కరకట్ట వద్ద వాగు కృష్ణానదిలో కలిసేచోట ఎత్తిపోతల పనులను చేపట్టిన సంగతి తెలిసిందే. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం అందించిన రూ.1500 కోట్ల నిధుల నుంచి రూ.237 కోట్లను వెచ్చించి దీనిని చేపట్టారు. మేఘా ఇంజనీరింగ్ కంపెనీ కాంట్రాక్టు ఒప్పందం కుదుర్చుకుని నిర్మాణ పనులను జరిపిస్తోంది. ప్రస్తుతానికి 75 శాతానికిపైగా పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టు ఏజెన్సీ సంస్థ మేఘా ఇంజనీరింగ్ కంపెనీ పట్టిసీమ ఎత్తిపోతలను ఎంతైతే వేగంగా పూర్తిచేసిందో అదే వేగాన్ని కొండవీటివాగు ఎత్తిపోతల నిర్మాణ పనుల్లోనూ చూపిస్తోంది. కొండవీటివాగులో గరిష్ట నీటి ప్రవాహాన్ని 16వేల క్యూసెక్కులుగా అంచనా వేస్తూ ఎత్తిపోతలను డిజైన్ చేశారు. ఉండవల్లి కరకట్ట నుంచి 350 మీటర్ల దూరంలో వాగు వెంబడి వరదనీటి కలెక్షన్ పాయింట్ అంటే ఓ సంపు వంటి మినీ రిజర్వాయర్‌ను నిర్మిస్తారు. ఈ సంప్ నిర్మాణాన్ని చివర్లో అంటే వచ్చేనెలలో చేపట్టనున్నారు. దీనికోసం సుమారు ఆరేడు కోట్ల రూపాయలను వెచ్చించనున్నారు. ఇంకో ఆరేడు కోట్లను సుందరీకరణ నిమిత్తం ఖర్చు చేయాలని ప్రతిపాదించారు.

ఊగిసలాట

(మొదటిపేజీ తరువాయి)

జగన్మోహనరెడ్డి వద్ద కూడా వారు ప్రస్తావించారు. అయితే ఆయన వారి అభిప్రాయంతో ఏకీభవించలేదు. అసెంబ్లీలో రెండే పార్టీలున్న నేపథ్యంలో సమావేశాలకు గైర్హాజరు కావడం వల్ల ప్రజల్లో పెద్ద చర్చనీయాంశమవుతుందని, అధికారపార్టీ డిఫెన్స్‌లో పడుతుందన్న వాదన వినిపించారు. ఇక కీలకమైన బడ్జెట్ సమావేశాలకైనా జగన్ నిర్ణయం మార్చుకుంటారని ఆపార్టీ నేతలు భావిస్తుండగా, ఈసారి కూడా పరిస్థితి అలాగే వుంది. అధినేత ధోరణి చూస్తే ఈసారి కూడా బహిష్కరించే అవకాశాలే ఎక్కువగా కనపడుతున్నాయి. జగన్ ప్రస్తుతం ప్రజాసంకల్పయాత్ర పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలకు హాజరుపై ఆయన ఇంతవరకు పార్టీ ముఖ్యనేతలతో చర్చించలేదు. సమావేశాల ప్రారంభానికి మరో మూడు రోజులు మాత్రమే గడువు వుండడంతో వైసీపీ నిర్ణయం ఎలా వుంటుందనే అంశంపై సభ్యుల్లో గందరగోళం నెలకొంది. హాజరైతేనే బావుంటుందని కొందరు ఎమ్మెల్యేలు అంతర్గతంగా అభిప్రాయపడుతున్నప్పటికీ అధినేతకు చెప్పే సాహసం చేయలేకపోతున్నారు. గతంలో శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో పవిత్రసంగమం వద్ద పడవ ప్రమాదం జరిగి దాదాపు 22 మంది మృతి చెందినా, అసెంబ్లీలో లేకపోవడం వల్ల అధికారపార్టీని ఇరుకునపెట్టలేకపోయామని వారు ఉదాహరిస్తున్నారు. సభలో ప్రతిపక్షం లేకపోవడం వల్ల టీడీపీ అంతపెద్ద సంఘటన జరిగినా తేలిగ్గా తప్పించుకుందని, అందువల్ల ఈసారి మళ్ళీ ఆ పొరపాటు చేయకపోవడం మంచిదని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వామ్యపక్షాలుగా వున్న బీజేపీ, టీడీపీలు ప్రస్తుతం కత్తులు నూరుకుంటున్న నేపథ్యంలో అసెంబ్లీకి హాజరై వారి ద్వంద్వ విధానాలను, ఇద్దరూ కుమ్మక్కై రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని నిలదీస్తే బావుంటుందన్న అభిప్రాయం వారిలో వుంది. ఇక పార్టీలో మరో వర్గం అభిప్రాయం దీనికి భిన్నంగా వుంది. ప్రస్తుతం పార్టీ అధినేత పాదయాత్రలో వున్నందున సమావేశాలకు గైర్హాజరైనా పెద్ద నష్టమేమీ వుండదని సమర్థించుకుంటున్నారు. ప్రభుత్వతీరును ఏరోజుకారోజు ప్రజాక్షేత్రంలో జగన్ ఎండగడుతున్నారని, అందువల్ల సభ్యులు ప్రత్యేకంగా అసెంబ్లీకి వెళ్ళకపోయినా నష్టం లేదంటున్నారు. పైగా గైర్హాజరు నిర్ణయంతో పార్టీకి మరింత సానుభూతి పెరిగే అవకాశముందని చెబుతున్నారు. జగన్ సభలో వున్నప్పుడే పెద్దగా మాట్లాడే అవకాశం ఇవ్వని పరిస్థితుల్లో, ఆయన లేకుండా సభ్యులకు మాట్లాడే ఛాన్స్ లభిస్తుందని తాము ఆశించడం లేదంటున్నారు. సభకు గైర్హాజరైతే బీజేపీ, టీడీపీల వ్యవహారం తేలిపోతుందంటున్నారు. మార్చి 5నుండి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు మళ్ళీ ప్రారంభం కానున్న దృష్ట్యా తెలుగుదేశం పార్టీ విభజన అంశాల అమలుకు అదే రోజు కేంద్ర ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించింది. కేంద్రం ఎలాగూ విభజన హామీలు అమలు చేసే అవకాశం లేదు. అప్పుడు టీడీపీ తెగదెంపులకు సిద్ధపడుతుందా ? లేక ప్రజలను మళ్ళీ మభ్యపెట్టి మరికొంతకాలం ప్రభుత్వంలో కొనసాగుతుందా ? ఈ పరిణామాలను బట్టి ఆ రెండు పార్టీల బాగోతాన్ని పాదయాత్రలో ఎండగట్టడం మంచిదని వైసీపీ సీనియర్లు విశ్లేషిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఒకవేళ బీజేపీతో తెగదెంపులు చేసుకుంటే అసెంబ్లీలో ఆ పార్టీయే ప్రతిపక్షంగా మారి నిలదీస్తుందని, అప్పుడు రాజకీయం మరింత రంజుగా వుంటుందని వారు భావిస్తున్నారు. మొత్తానికి బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాలా ? గైర్హాజరవ్వాలా ? అనే దానిపై తర్జనభర్జన సాగుతోంది. దీనిపై ఈనెల 3వ తేదీ ముఖ్యనేతలతో జగన్ నిర్వహిస్తున్న సమావేశం పార్టీ నిర్ణయాన్ని ప్రకటించనుంది.

మండే ఎండలు..!

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని వివరించింది. రాజస్థాన్, పంజాబ్, హర్యానాతోపాటు ఢిల్లీలో సగటు ఉష్ణోగ్రత సాధారణంకన్నా 1.5 డిగ్రీల సెల్సియస్ అత్యధికంగా నమోదవచ్చని పేర్కొంది. సగటు ఉష్ణోగ్రతలు సాధారణకంటే 2.3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండే ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ పర్వత ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలో గరిష్ట పెరుగుదల ఉంటుంది. వేడి గాలులు అధికంగా ఉండే మార్చి నుంచి మే నెలల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు దాదాపు 52 శాతం అధికంగా నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ విభాగం బుధవారం తెలిపింది. ఢిల్లీతో సహా పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, మరఠ్వాడా, విదర్భ, మధ్య మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతాల్లో వేసవి తీవ్రత కలిగిన జోన్‌లుగా ఉన్నాయి. సాధారణ రుతుపవనాలు సానుకూలంగా ఉన్నాయి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఒక డిగ్రీ సెల్సియస్ కంటే అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. అయితే కేరళ, తమిళనాడు, రాయలసీమ, కర్నాటక దక్షిణ ప్రాంతాలపై 0.5 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. మిగిలిన ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 0.5 నుంచి 1 డిగ్రీ సెల్సియస్ మధ్య నమోదవుతాయి.

ఉష్ణోగ్రతలు పెరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలుగా దక్షిణ భారతదేశం, నాలుగు ఈశాన్య రాష్ట్రాలు అని ఐఎండీ తెలిపింది. ఫిబ్రవరిలో ప్రారంభ పరిస్థితుల ఆధారంగానే మార్చి నుంచి మే నెల వరకు అంచనా ఉంటుంది. మార్చి నుంచి మే నెల మధ్య కాలంలో భారీ స్థాయిలో సంకేతాలు లేనపుడు, సూచనలో అంచనా వేసిన ఉష్ణోగ్రత పెరుగుదల భూతాపానికి కారణమవుతుందని ఐఎండీ ప్రధానాధికారి డి.శివానంద పాయ్ తెలిపారు. ఇటీవల కాలంలో ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రతలలో పెరుగుదల చోటుచేసుకుందని ఆయన చెప్పారు. కాగా ఈక్వటోరియల్ పసిఫిక్‌లో లా నినా పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది సాధారణ రుతుపవనాలకు సానుకూల సంకేతాలు.

పుష్టిబ్రాండ్‌వరి

(మొదటిపేజీ తరువాయి)

ఈ వంగడం మొలకెత్తి ఎదిగేందుకు వీలుగా రూపొందించాలని భావిస్తున్నారు. పురుగుమందుల వినియోగం తగ్గించడం, పంటమధ్యలో కలుపును తగ్గించడానికి దోహదంచేసేందుకు వీలుగా జన్యుమార్పిడి విత్తనాలను తయారుచేస్తారు. విభిన్న వాతావరణ పరిస్థితుల్లోనూ పంట పండించాలని భావిస్తున్నారు. పురుగుమందులు, ఎరువులు తక్కువ వినియోగం ఉండేలా ఈ వంగడాన్ని రూపొందిస్తారు. ఐరన్,జింక్ అలాగే అధిక పోషకవిలువలు కల విత్తనాన్ని రూపొందిస్తారు. అధిక పోషక విలువలున్న వరి విత్తనాలను ఇప్పటికే ప్రయోగించినట్లుగా కూడా తెలుస్తోంది. సంప్రదాయ వరివంగడాలతో పోటీపడి దిగుబడిని అందించగలవని భావిస్తున్నారు. దిగుబడి పెరిగినట్లయితే అందరికీ పోషక విలువలుకలిగిన బియ్యం అందుబాటులోకి వస్తాయి. ఫిలిప్పీన్స్ ఈరకం వరివంగడాన్ని ఇప్పటికే తయారుచేసి పంటలు పండిస్తున్నదని తెలుస్తోంది. ఫిలిప్పీన్స్ సంస్థకు అనుబంధంగా ఇక్కడ ఒక యూనిట్‌ను ఏర్పాటుచేయాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది. సాంకేతిక సిబ్బందిని, రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఏర్పాటు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జిఐఎస్ ప్రయోగశాలను తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

రాష్ట్రంలో టీడీపీ బలోపేతమే లక్ష్యం

తెలంగాణ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులతో సమావేశంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ రాష్ట్ర నాయకత్వం పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని మార్చి 29వ తేదీ వరకు విస్తృతంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆ తరువాత మే 28 వరకు ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యక్రమాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రజలను సమీకరించి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసంలో తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. దాదాపు గంటన్నర పాటు పార్టీ నేతలతో సమావేశమైన బాబు, పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై, రాజకీయ పరిస్థితులు, కేంద్రం వైఖరి, ప్రజా సమస్యలపై చర్చించారు. లక్ష మందితో తెలంగాణలో మహానాడు నిర్వహిద్దామన్న నేతలు చంద్రబాబుకు చెప్పారు. రాష్ట్ర పార్టీ చేస్తున్న పల్లెపల్లెకు టీడీపీ, శిక్షణ తరగతులు వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమాలను ఇంకా ముమ్మరం చేయాలని సూచించారు. మే నెలాఖరు నాటికి నియోజకవర్గ కమిటీలను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పార్టీ పదవులలో ఉన్న నాయకులు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించాలన్నారు. రాష్ట్ర నాయకత్వం స్వయంగా ప్రజల్లోకి వెళ్తే కార్యకర్తలో ధైర్యం వస్తుందని, త్వరలోనే ఖమ్మంలో భారీ బహిరంగసభకు తాను హాజరవుతానని బాబు చెప్పారు. మహానాడులోపు మూడు బహిరంగసభలు నిర్వహించాలని నేతల సూచనకు బాబు అంగీకారం తెలిపారు. యువతరాన్ని ప్రోత్సహించి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో పొత్తు ఉండదని బీజేపీ ప్రకటించిందని, రాష్ట్రంలో పార్టీకి ఉన్న ఓటింగ్ శాతాన్ని చర్చించుకొని సమయం, సందర్భం చూసి పొత్తుల గురించి ఆలోచిద్దామన్నారు. ప్రస్తుతం పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సూచించారు. రెండు రాష్ట్రాల్లో పార్టీకి అండగా ఉంటానని, కొందరు నాయకులు పార్టీని వీడినా వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. ఒంటేరు ప్రతాప్‌రెడ్డికి పార్టీ అండగా ఉంటుందని, పార్టీని నమ్ముకున్న ఏ నాయకుడిని వదులుకోమని స్పష్టం చేశారు.

నాయని కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణమూర్తి మాబడి, పాఠశాల తదితర విద్యా సంబంధ మ్యాగజైన్లను కూడా నిర్వహించారు. కృష్ణమూర్తి మృతిపై విద్యావేత్తలు, రచయితలు, రాజకీయ నాయకులు సంతాపం వెలిబుచ్చారు. చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలం నడించర్లలో 1951వ సంవత్సరంలో జన్మించిన నాయని కృష్ణమూర్తి ప్రముఖ తెలుగు రచయితగా, సాహితీ పరిశోధకుడిగా గుర్తింపు పొందారు. ఎన్నో పుస్తకాలు, గేయాలు రచించారు. చౌడేపల్లెలో విజయవాణి విద్యాసంస్థను స్థాపించి విద్యారంగానికి సేవలందిస్తూనే సాహితీ యజ్ఞాన్ని కొనసాగించారు. 7వ తరగతి విద్యార్థుల కోసం మాబడి, 10వ తరగతి విద్యార్థుల కోసం పాఠశాల పేర్లతో ఆయన నేతృత్వంలో రూపొందిన పుస్తకాలు తెలుగునాట బహుళ ప్రాచుర్యం పొందాయి. జిల్లాలో అక్షరాస్యతా ఉద్యమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన అక్షర తపస్మాన్ కార్యక్రమానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు. పలు సినిమాలలో పాటలు రాశారు. వంశీ దర్శకత్వంలో వచ్చిన మహర్షి సినిమా కోసం ఆయన రచించిన సుమం.. ప్రతి సుమం.. వనం ప్రతి వనం.. వనం.. పాట విశేష ప్రాచుర్యం పొందింది. ఇటీవలి కాలంలో మహాభారతం కథాంశంపై ఆయన రచించిన జయం అనే నవల విశేష గుర్తింపు పొందింది.

పలువురు సంతాపం

నాయని కృష్ణమూర్తి మృతి పట్ల రాష్ట్ర మంత్రి ఎన్.అమర్‌నాథ్ రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, కలెక్టర్ ప్రద్యుమ్నలతో పాటు పలువురు రాజకీయ నాయకులు, కవులు, కళాకారులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కృష్ణమూర్తి మృతి సాహితీలోకానికి తీరని లోటని పేర్కొన్నారు. తెలుగు సాహిత్య రంగానికి ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సినిమా థియేటర్లు బంద్

(మొదటిపేజీ తరువాయి)

ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇంగ్లీష్ సినిమాలకు వర్చువల్ ప్రింట్ ఫీజు వసూలు చేయడం లేదన్నారు. డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు ప్రాంతీయ చిత్రాలకు విపిఎఫ్ తగ్గించట్లేదన్నారు. ఐదు రాష్ట్రాల్లోని నిర్మాతలు, పంపిణీ దారులు తమకు మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. విపిఎఫ్ ధరలు సున్నా చేయడం లేదన్నారు. డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు దిగి వచ్చే వరకు థియేటర్ల బంద్ నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. సినిమా థియేటర్ల బందుతో వచ్చే నష్టం కన్నా, తాము ఈ నిర్ణయం తీసుకోకపోతే భవిష్యత్తులో వచ్చే నష్టమే ఎక్కువ అని చెప్పారు.

అన్ని విషయాలు ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తాము తీసుకుంటోన్న చర్యలతో భవిష్యత్తులో చిన్న సినిమాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఐదు రాష్ట్రాల నిర్మాతలతో సంయుక్తంగా ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు చేసుకున్నామని సురేశ్ బాబు చెప్పారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల వైఖరిపై సినీ నిర్మాతల జేఏసీ నిరసన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిపివేస్తూ దక్షిణాది చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. విపిఎఫ్ ధరలపై డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు దిగిరాలేదు. దీంతో సమస్యలను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి జాయింట్ యాక్షన్ కమిటీ తీసుకెళ్ళింది.

దుష్టులకు శిక్ష తప్పదన్న సందేశమే హోలీ

సీఎం చంద్రబాబు వసంతోత్సవ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : దుష్టశక్తులకు ఓటమి తప్పదని, చెడుపై అంతిమంగా మంచి గెలుస్తుందన్న సందేశాన్నిచ్చే పండుగల్లో హోలీ ఒక ప్రధాన పండుగ అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారికి ఆయన హోలీ, వసంతోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రహ్లాదుణ్ణి అంతం చేయాలని భావించిన హోలిక తానే అగ్నిలో అంతమైందన్న పౌరాణిక గాధ ప్రాచుర్యంలో ఉందని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలన్నదే హోలీ పండుగ ఉద్దేశమని ఆయన వివరించారు. కుల మతాలు, ప్రాంతాలకతీతంగా అందరూ ఐక్యతా భావంతో కలసి ఆడుకునే వసంతోత్సవం హోలీ అని అభివర్ణించారు. సమాజంలో అందరూ సంతోషంగా ఉండాలని, అసమానతలు లేని సమాజం ఏర్పడటం తమ ధ్యేయమని చంద్రబాబు అన్నారు. హోలీ ప్రకృతితో అనుసంధానమైన పండు గని, ఈ వేడుకల్లో చెట్లు, పువ్వులు, బెరడుతో చేసిన రంగులనే వినియోగించాలని ప్రజలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

పవన్‌కు నివేదిక ఇచ్చిన 'జేఎఫ్‌సీ'

అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు 'జేఎఫ్‌సీ' నివేదిక అందజేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఏపీని ముంచినట్లు కమిటీ నివేదికలో నిగ్గుతేలినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇరు ప్రభుత్వాలు కూడా ఒక్కటంటే ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయాయని నివేదికలో స్పష్టం చేసినట్లు సమాచారం. శుక్రవారం మరోసారి జేఎఫ్‌సీ భేటీ అయ్యి నివేదికపై నిశితంగా చర్చించనుందని తెలుస్తోంది. పవన్‌తో జేఎఫ్‌సీ త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం సాయంత్రం సమావేశమై కమిటీ నివేదికపై చర్చించారని సమాచారం. రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇస్తామని పవన్‌కు కమిటీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. కాగా శుక్రవారం మరోసారి సమావేశమై నివేదికపై జేఎఫ్‌సీ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో జేఎఫ్‌సీకి.. ఆ తర్వాత ప్రజల ముందుకు నివేదిక తెచ్చేందుకు పవన్ సిద్ధమైనట్లు సమాచారం.

రాజధానిలో ఊపందుకున్న నిర్మాణాలు

విశాలాంధ్ర-అమరావతి : రాజధాని అమరావతిలో నిర్మాణాలు ఊపందుకున్నాయి. రాజధానిలోని సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు ఎక్స్‌ప్రెస్ హైవే కలిపి 18 రోడ్ల నిర్మాణం చకచకా సాగుతోంది. ఈ రోడ్ల నిర్మాణంలో అక్కడక్కడా భూసేకరణ సమస్య ఉన్నా పనులు మాత్రం ఆగటం లేదు. దాదాపు 4వేల కోట్లతో రోడ్ల నిర్మాణం పనులు సాగుతున్నాయి. అలాగే రాయపూడిలో ఐఏఎస్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు, గెజిటెడ్ అధికారులకు 3840 ప్లాట్లు 12 అంతస్తుల చొప్పున 61 టవర్ల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. వీటిలో 288 ఎమ్మెల్యేలకు, 144 ఐఏఎస్‌లకు, 196 ఎన్‌జీవోలకు, గెజిటెడ్-1 అధికారులకు 388, గెజిటెడ్-2 అధికారులకు 366, నాల్గవ తరగతి ఉద్యోగుల 720 కోసం నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణం కూడా దాదాపు నాలుగువేల కోట్లు అవుతుంది. ఇక రాజధానిలోని పేదల కోసం రెండు దశల్లో 650 కోట్లతో 7876 గృహాలు నిర్మిస్తున్నారు. ఈ గృహాలు తుళ్ళూరు, నిడమర్రు, మందడం, దొండపాడు, అనంతవరం, పెనుమాక, ఐనవోలు, నవులూరు గ్రామాల్లో నిర్మిస్తున్నారు. మొదటి దశలో 345 కోట్లతో 5024 గృహాలను నిర్మిస్తున్నారు. రెండవ దశలో ఉండవల్లి, మందడం, నవులూరు గ్రామాల్లో 2852 గృహాల నిర్మాణం జరుపుతారు. దీనికి సంబంధించిన టెండర్లు త్వరలో పూర్తి కానున్నాయి. అలాగే రాయపూడిలో 188 బంగ్లాల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. మార్చి 15న టెండర్లు ఖరారు చేయనున్నారు. ఈ బంగ్లాలు మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులకు కేటాయించనున్నారు.



అనంతవరంలో పేదల కోసం నిర్మిస్తున్న ఎన్టీఆర్ గృహ సముదాయం



సీడ్ యాక్సిస్ రోడ్డు

రాజధానిలో రోడ్లు, అధికారులు, ఉద్యోగుల నివాసాలు తొలి ప్రాధాన్యంగా తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలన్న నిర్ణయంతో ప్రభుత్వం ఉంది. వివిధ ప్యాకేజీల క్రింద ప్రముఖ కాంట్రాక్టు కంపెనీలు రేయింబగళ్ళు పనులు చేస్తున్నాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి రాజధాని రోడ్లు, ఐఏఎస్, ఎమ్మెల్యేల టవర్లు, తొలిదశ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం పనులు పూర్తి కానున్నాయి. ఇదిలా ఉండగా రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు రిటనబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా ఊపందుకుంది. రాజధాని మొత్తంలో భూములిచ్చిన రైతులకు మెట్ట, జరీబు భూముల క్రింద 59,014ప్లాట్లు రైతులకు కేటాయించారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు నెలరోజులుగా ఊపందుకున్నాయి. దాదాపు 9200 ప్లాట్లు స్లాట్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు జరిగాయి.

అగ్రి బాధితులందర్నీ ఆదుకుంటాం

మృతుల కుటుంబాలకు రూ.5కోట్ల చెక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర అమరావతి: అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలందర్నీ ఆదుకుంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు. అగ్రిగోల్డ్ బాధిత మృతుల కుటుంబాలకు రూ. 5 కోట్ల విలువైన చెక్కులను 100 మందికి రూ.5 లక్షల చొప్పున ముఖ్యమంత్రి గురువారం అందజేశారు. గత సంవత్సరం మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబు ఆత్మహత్య చేసుకున్న అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించారు.ఆమేరకు గురువారం సీఎం స్వయంగా మృతుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. బాధితుల్లో షేక్ మహబూబ్, పి. ఆదాం, పి శ్రీనివాసులు, ఎంవీ లక్ష్మీ ప్రసూనాంబలకు స్వయంగా ముఖ్యమంత్రి బ్యాంక్ చెక్కులు అందించారు ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని మరోసారి స్పష్టం చేశారు. అగ్రిగోల్డ్ కేసు పురోగతిపై నిరంతరం సమీక్షిస్తున్నామన్నారు. ఇది ఎనిమిది రాష్ట్రాలకు సంబంధించిన బాధితుల సమస్య అని, అయితే ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందన్నారు. కంపెనీ ఆస్తులకు సంబంధించి ముందుకొచ్చిన జీఎస్సెల్ గ్రూప్‌కు అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. మొత్తం రాష్ట్రంలోని 19 లక్షల కుటుంబాలకు న్యాయం చేస్తామని, ఎవరూ ఆందోళనకు గురికావద్దని కోరారు. .ప్రైవేటు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని సీఎం సూచించారు.ఎక్కువ వడ్డీలిస్తామని, రెండేళ్లల్లో రెట్టింపు చేస్తామనే ప్రచారాలకు మోసపోవద్దన్నారు ప్రభుత్వ బ్యాంకుల్లో డబ్బును డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. ఇటువంటి మోసపూరిత సంస్థల కార్యకలాపాలపై నిఘా ఉంచామన్నారు.ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఆస్తులు జప్తు చేసి మరీ చెల్లిస్తామని హెచ్చరించారు.తప్పుడు పనులు చేసే వారిని ఉపేక్షించనన్నారు. .అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉండి, వారికి చెల్లింపుల బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీఇచ్చారు. మాది ప్రభుత్వం పేదలకు అండగా ఉండే ప్రభుత్వం, ఎట్టి పరిస్థితుల్లో అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు డబ్బులు ఇప్పిస్తాం. మీరు ధైర్యంగా వుండండి అంటూ వారికి భరోసా కల్పించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలు సీఎంకు తమ బాధలను వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీశ్ చంద్ర, డీజీపీ మాలకొండయ్య,ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, సీఐడీ చీఫ్ ద్వారకా తిరుమలరావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఫెడరేషన్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు బి. విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖరరావు, ఐపీఎస్ అధికారి, సీఐడీ ఎస్పీ ఉదయ్ భాస్కర్ బిల్లా, అడిషనల్ సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్. త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటం వల్లే తొలి ఫలితం-ముప్పాళ్ళ నాగేశ్వరరావు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ గత మూడేళ్ళుగా ఐక్యతతో అలుపెరగని పోరాటం చేయడం వల్లే తొలి ఫలితం సాధించగలిగామని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఈ పోరాట ఫలితం తనకేగాక యావత్ అగ్రిగోల్డ్ బాధిత



పరిహారం అందుకున్న బాధిత కుటుంబాలతో ముప్పాళ్ల నాగేశ్వరరావు

లోకానికి పూర్తి సంతృప్తినిచ్చిందన్నారు. ఇన్ని లక్షల మందిని ఐక్యంగా నిలబెట్టడమే కాకుండా, ప్రభుత్వాన్ని ఆలోచనలో పెట్టి, భాదితులకు నష్టపరిహారం చెల్లించడం తప్ప మరో మార్గం లేదనే స్థితికి తీసుకురావడం ఈ ఉద్యమ గొప్ప విజయమన్నారు. మరోప్రక్క బాధిత కుటుంబాల్లో మానసిక స్థైర్యాన్ని కల్పించి ఒక భరోసా కల్పించగలిగామన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా 100 మంది మృతుల కుటుంబాలకు 5 కోట్ల విలువైన చెక్స్ పంపిణీ చేయడం ఒక అరుదైన రికార్డుగా పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ చేసిన మోసానికి బలై మరణించిన అమాయక బాధితులకు ఎక్స్ గ్రేషియా సాధించిన అసోసియేషన్ లేదన్నారు. అలాగే ఇంతమంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇచ్చిన దాఖలాలు కూడా ఎక్కడా లేవన్నారు. ఇవిగాక మరో 37 మందికి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందని, నిధులు మంజూరైన తర్వాత త్వరలోనే వారికీ అందజేసేలా కృషి చేస్తామని చెప్పారు. మొత్తం 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులున్నారని, బాధితులందరికీ పూర్తి న్యాయం చేసే వరకు తమ అసోసియేషన్ వారికి అండగా నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. తమ అసోసియేషన్ పోరాటానికి మద్దతిచ్చిన వారందరికీ, అగ్రి భాధితుల పట్ల సానుకూలంగా స్పందిస్తున్న ముఖ్యమంత్రికి ముప్పాళ్ళ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనులు అన్ని గ్రామాల్లో చేపట్టాలి

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి విల్సన్



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ఉపాధి హామీ పనులు అన్ని గ్రామాల్లో తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల శేఖర్ అధ్యక్షతన గురువారం జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల వారికి ఉపాధి పనులు కల్పించి రాష్ట్రంలో వలసలు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉపాధి పనులు ప్రారంభం కానందున రాయలసీమ, ఉత్తరాంధ్రలలో వలసలు ప్రారంభమయ్యాయని తక్షణమే వలసలు నివారించాలంటే ఉపాధి పనులు మొదలుపెట్టాలని ఆయన చెప్పారు. 200 రోజులు పనిదినాలు కల్పించి రోజు కూలీ రూ.400 ఇవ్వాలని డిమాండు చేశారు. గతంలో పనిచేసిన కూలీ డబ్బులు(బకాయిలు) తక్షణమే ఇవ్వాలని, పని ప్రదేశాల్లో చట్టంలో పేర్కొన్న వాటన్నింటినీ కూలీలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీలో యంత్రాలతో పనులు చేయకుండా కట్టడి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో జిల్లా నాయకత్వం దళాలుగా వెళ్లి పర్యటనలు చేసి వచ్చిన సమస్యలపై జిల్లా అధికారులకు మెమోరాండాలు ఇవ్వాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కపట్టక యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కూలీలకు, చిన్న, సన్న రైతులకు ఉపాధి హామీలో పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని తెలిపారు. గ్రామీణ పేదలకు వేసవికాలంలో రక్షిత తాగునీరు సౌకర్యం కల్పించాలని, అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే గృహ నిర్మాణాన్ని చేపట్టాలని, అన్ని రకాల పెన్షన్లు రూ.3 వేలకి పెంచాలని, భూమిలేని ప్రతి పేదవానికి ఒక హెక్టారు భూమిని ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జన్మభూమి కమిటీలను రద్దు చేసి వాటి స్థానంలో గ్రామ సభలు పెట్టాలని చెప్పారు. అసైన్‌మెంట్ కమిటీలు, ఫుడ్ కమిటీలను విధిగా సక్రమంగా నెల నెలా జరిగేలా ప్రభుత్వం పూనుకోవాలని రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో బంది వెంకటేశ్వరరావు, ఆర్.వెంకట్రావ్, బి.కేశవరెడ్డి, సి.హెచ్. ప్రభాకర్, ఎస్.కొండలరావు, చిలకూరి వెంకటేశ్వరరావు, కె.తిమ్మయ్య, ఎల్.వెంకట్రావు, కలిశెట్టి వెంకట్రావ్, ఎస్.డి.మౌలాలి, ఈశ్వరరావు, రమణయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



7న చలో విద్యుత్‌సౌధ

ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7వ తేదీన 'చలో విద్యుత్‌సౌధ కార్యక్రమాన్ని' నిర్వహించాలని ఐక్యవేదిక తీర్మానం చేసింది. ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం దాసరిభవన్‌లో జరిగింది. సమ్మెను ఉధృతం చేసిన కార్మికులు, జిల్లా నాయకత్వా లకు కమిటీ అభినందనలు తెలిపింది. ప్రభుత్వం చర్చల పేరతో కాలయాపన చేస్తుందే తప్ప సమస్య పరిష్కారానికి ముందుకు రావడం లేదని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు చేస్తున్న న్యాయ మైన పోరాటం, డిమాండ్ల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకోవాలని కమిటీ డిమాండు చేసింది. ఈ సమావేశంలో ఐక్య వేదిక చైర్మన్ పి కాశీమధుబాబు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశీ, కన్వీనర్ ఎస్వీ రమణమూర్తి, కోశాధికారి సి చంద్రశేఖర్, వైస్ చైర్మన్లు వి గంగయ్య, బీవీ సురేష్, వి బాబీ, చీఫ్ కో-ఆర్డినేటర్ జె హారతి, కన్వీనర్ కట్టా నాగరాజు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

భవిష్య కార్యాచరణ - తీర్మానాలు

మార్చి 2వ తేదీ నుంచి 4 వరకూ అన్ని జిల్లా కేంద్రాలు, జెన్‌కోల వద్ద రిలే నిరాహారదీక్షలు. జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్ల వద్ద ధర్నాలతోపాటు వంటా వార్పు కార్యక్రమాలు చేయడం.మార్చి 4వ తేదీ నుంచి రాష్ట్రస్థాయిలో నిరవధిక నిరాహార దీక్షలను విజయవాడ లెనిన్‌సెంటర్ వద్దనున్న ధర్నా చౌక్‌లో ప్రారంభమవుతాయి. ఈ దీక్షలో ఐక్యవేదిక రాష్ట్ర అగ్ర నాయకత్వం కూర్చుంటుంది. అన్ని జిల్లాల్లో ఐక్యవేదిక జిల్లా నాయకత్వాల ఆధ్వర్యంలో ఆయా జిల్లా కేంద్రాల్లో జరుగుతాయి.

ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

లేబర్ కమిషనర్‌కు లేఖ ఇచ్చిన ఈయూ నేతలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) గుర్తింపు సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నేతలు డిమాండు చేశారు. ఈయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం లేబర్‌కమిషనర్ డి వరప్రసాద్‌కు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సవాలు లేఖను అందచేశారు. సంస్థ ఉద్యోగులకు ప్రతి రెండేళ్లకొకసారి ఎన్నికలు జరగాల్సి ఉన్నందున, గతంలో గుర్తింపు పొందిన సంఘం గడువు మార్చి 3వ తేదీతో ముగుస్తున్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పద్మాకర్ విలేకరులతో మాట్లాడుతూ 2016 ఫిబ్రవరి 18న జరిగిన ఎన్నికలో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) స్వల్ప మెజార్టీతో గెలిచిందన్నారు. అయితే ఆ సంఘం ఉద్యోగులను మాయమాటలతో మభ్యపెడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీని అమలు చేయలేకపోయిందన్నారు. అరవై రోజుల సమ్మెకాలం జీతం చెల్లించాలని, తొలగించిన డ్రైవర్లు, కండక్టర్లను వెంటనే పనుల్లోకి తీసుకోవాలని ఆయన సంస్థను డిమాండు చేస్తూ యాజమాన్యానికి కూడా లేఖను అందచేసినట్లు ఆయన వివరించారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, జోనల్ వర్క్‌షాపు యూనిట్ల వద్ద గేట్‌మీటింగ్‌లను నిర్వహిస్తామని తెలిపారు. లేబర్ కమిషనర్‌ను కలిసినవారిలో ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు వైవీరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం హనుమంతరావు, అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, రాష్ట్రకార్యదర్శులు కె బాలాజీ, బి కోటేశ్వరరావు, జోనల్ కార్యదర్శి ఎస్‌కే సుభానీ, కృష్ణా రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు చక్రవర్తి, వై శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి రామకృష్ణ, జోనల్ సహాయ కార్యదర్శి డి వెంకటేశ్వర్లు, సత్యం తదితరులు ఉన్నారు.



నేడు ఉండవల్లిలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ సమావేశం శుక్రవారం జరగనుంది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాస ప్రాంగణంలో ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ నెల 5 నుంచి పునఃప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలతో చర్చించనున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందంటూ కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వంపై టీడీపీ ఎంపీలు పోరాటం చేస్తున్నారు. మార్చి 5లోపు విభజన హామీలు, ఏపీకి ప్రత్యేకహోదా, 9,10,13 షెడ్యూలులోని సంస్థల విభజన, ఆస్తుల పంపిణీ వ్యవహారాలపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించి కాలపరిమితిని కూడా నిర్ణయించాలని టీడీపీ కేంద్ర బీజేపీ పెద్దలకు డెడ్‌లైన్ విధించింది. అయితే ఇప్పటివరకు కేంద్రం నుంచి గానీ, బీజేపీ పెద్దల నుంచి గానీ ఎలాంటి హామీ లభించలేదు. పై అంశాలపై పార్లమెంటరీ సమావేశంలో చర్చించనున్నారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి, పార్టీకి చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు పాల్గొననున్నారు.



సుబ్బారాయుడును పరామర్శించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడిని టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. అనారోగ్య కారణాల వల్ల జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో సుబ్బారాయుడు చికిత్స పొందుతున్నారు. గురువారం ఆసుపత్రికి వెళ్లిన చంద్రబాబు ఆయన ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. వైద్యులు సుబ్బరాయుడుకు అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. సుబ్బరాయుడు కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. త్వరగా కోలుకోని, ప్రజలకు సేవలు అందించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ కూడా సుబ్బారాయుడును పరామర్శించారు.

5 వేల గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు : లోకేష్

విశాలాంధ్ర-అమరావతి : తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం, కడప, విజయనగరం జిల్లాల్లోని 5,237 గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లను ఈఈఎస్ఎల్ ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. గురువారం సచివాయంలో పంచాయతీరాజ్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకూ 2,39,105 ఎల్ఈడీ లైట్లను ఈఈఎస్ఎల్ అమర్చిందని, 535 గ్రామ పంచాయతీల్లో నూటికి నూరు శాతం ఎల్ఈడీ లైట్లను పూర్తి చేసిందన్నారు. 2,39,105 ఎల్ఈడీ లైట్లను 2,068 సీసీఎంఎస్ బాక్సుల ద్వారా అనుసంధానం చేసి, ఇప్పటివరకూ 1,13,912 ఎల్ఈడీ లైట్లను అమర్చినట్లు ఆయన చెప్పారు. నెడ్ క్యాప్ ద్వారా ఇప్పటి వరకూ ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బల్బులను అలర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ విధానానికి అనుసంధానం చేయాలన్నారు. మార్చి నెలాఖరులోపు ఈఈఎస్ఎల్, నెడ్ క్యాప్ కలిపి 7 లక్షల బల్బుల లక్ష్యాన్ని, 2018 నవంబర్ నాటికి ఈఈఎస్ఎల్ 10 లక్షల ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు పూర్తిచేయాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకంపై చర్చించారు. ఉపాధిలో ఈ ఏడాది 24 కోట్ల పని దినాలు పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం వేగవంతం అయ్యిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో 150 రోజుల ఉపాధి కల్పించాలనే డిమాండు ఉందని, నిబంధన సడలించాలని త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించినట్లు లోకేష్ తెలిపారు. 80 కరవు మండలాల్లో ఉన్న అన్ని గ్రామాల్లో 50 రోజులు అదనంగా పని దినాలు కల్పించాలని జీఓ జారీ చేశామని, ఇక్కడ 150 రోజుల పని దినాలు వర్తిస్తాయని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రామాంజనేయులు, నరేగా జాయింట్ కమిషనర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



8 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యం

- ప్రొఫెషనల్, డిగ్రీ, ఇంటర్ చదివినా అర్హులే
- పుత్తూరులో 7 నుంచి 9 వరకు మెగా జాబ్ మేళా
- 14న విశాఖలో, 31న అనంతపురంలో
- ఏపీటా సీఈఓ డాక్టర్ సుందర్

విశాలాంధ్ర - విజయవాడ : రాష్ట్రంలో ప్రొఫెషనల్ కోర్సులతోపాటు డిగ్రీ, ఇంటర్ చదివిని విద్యార్థులకూ ఉద్యోగాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (అపిటా) ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అకాడమీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) డాక్టర్ బీ సుందర్ తెలిపారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుకల్లా ఎనిమిది వేల మందికి ఉద్యోగాల కల్పన దిశగా సంస్థ పని చేస్తోందన్నారు. అందులో భాగంగా అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన సాఫ్ట్‌వేర్, ఇతర సంస్థలతో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు చిత్తూరు జిల్లా పుత్తూరులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని అపిటా సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సుందర్ మాట్లాడారు. పుత్తూరులో నిర్వహించనున్న జాబ్ ఫెయిర్‌కు ఐటీ కంపెనీలతోపాటు పేటీఎం, ఫ్లిప్‌కార్ట్, ఓయో, రెడ్‌బస్, లెన్స్‌కార్ట్, టాటా, మహేంద్ర, వాల్‌మార్ట్, జెన్‌ప్యాక్ట్, బైజూస్‌తోపాటు జెట్ ఎయిర్‌వేస్ కూడా హాజరుకానున్నట్లు చెప్పారు. సుమారు 50కిపైగా సంస్థలు జాబ్ ఫెయిర్‌లో ఉద్యోగాల కల్పనకు ముందుకు వచ్చాయని, మరో 15 సంస్థలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటర్, డిగ్రీతోపాటు ఇంజనీరింగ్, ఫార్మా, మేనేజ్‌మెంట్ కంపెనీలు ఏడాదికి రూ.1.20 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు జీతాలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఫెయిర్‌లో మూడు వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. వీరందరికీ పదో తేదీన తిరుపతిలో నిర్వహించనున్న ముగింపు కార్యక్రమంలో ఆఫర్ లెటర్స్ అందజేస్తామన్నారు. అలాగే విశాఖపట్నంలో ఈ నెల 14న, అనంతపురంలో 31న జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశాఖ, అనంతపురం మేళాలకు అపిటా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇదిలావుండగా, అపిటా జాబ్ మేళాల నిర్వహణ వల్ల డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ అభ్యర్థులలో ఉద్యోగాలు పొందే వారి సంఖ్య పది శాతం నుంచి 33 శాతానికి పెరిగినట్లు ఆయన తెలియజేశారు. దీనిని 80 శాతానికి పెంచాలనే లక్ష్యంతో అపిటా పని చేస్తోందని, ఇందుకోసం ప్రముఖ కంపెనీలతో జాబ్ ఫెయిర్ నిర్వహించటంతోపాటు కాలేజీలలో రిక్రూట్‌మెంట్ మేళాలు నిర్వహిస్తున్నట్లు సుందర్ వివరించారు. విలేకరుల సమావేశంలో అపిటా అదనపు సీఈఓ విన్నీ పాత్రో పాల్గొన్నారు.

సంపాదకీయం

భారత్-నేపాల్ బంధం మారాకుతొడగాలి

సమాజపరంగా లేదా దేశాల విషయంలోనైనా ఇరుగు పొరుగుతో సత్సంబంధాలు కలిగి వున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.. శాంతి వెల్లివిరుస్తుంది. ఇటీవల జరిగిన నేపాల్ పార్లమెంటు ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్‌ను తృతీయ స్థానానికి నెట్టి రెండు కమ్యూనిస్టు పార్టీలు భారీ విజయం సాధించాయి. ఎన్నికలు ముగిసి, కమ్యూనిస్టులు విజయదుందుభి మోగించడంతో తమ మధ్య నెలకొన్న దీర్ఘకాల శతృత్వాన్ని సమాధి చేసి, రెండు కమ్యూనిస్టు పార్టీలను విలీనం చేయడం ద్వారా ఒకే పార్టీగా ఏర్పడాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునైటెడ్ మార్క్సిస్టు-లెనినిస్టు) నాయకుడు ఖడ్గ ప్రసాద్ ఓలీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) నాయకుడు పుష్పకమల్ దహల్ అలియాస్ ప్రచండ నిర్ణయించుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అది ఇప్పుడు జరిగింది. ఇది ప్రపంచంలో జరుగబోయే పరిణామాలకు శుభసూచకంగా భావించాలి. అయితే భారతదేశం ఏ విధంగా దీన్ని అర్థం చేసుకొంటుంది, నూతన నేపాల్ ప్రభుత్వంతో దాని సంబంధాలు ఏ విధంగా ఉండబోతాయన్నది ప్రశ్న. న్యూఢిల్లీ మొట్టమొదట చేయవలసింది వాస్తవాన్ని అంగీకరించడం. నేపాల్‌లో జరిగింది మోడీ ప్రభుత్వానికి ఇష్టంలేకపోవచ్చు.. అయితే నూతన రాజకీయ పరిస్థితిలో రాజీపడి, నేపాల్‌పట్ల ఒక అడుగు ముందుకు వేసి, నేపాల్ ఒక సార్వభౌమాధికార దేశంగా ఆమోదించి చెడిన సంబంధాల మరమ్మతుకు ప్రయత్నించి, సంపూర్ణ సమానత్వం రూపేణ భారత్-నేపాల్ సంబంధాలను నిర్మించుకోవాలి. నూతనంగా విలీనమైన పార్టీలో విభేదాలు వుండవచ్చు.. దాని నాయకుల మధ్య ఒత్తిళ్లు.. పొరపొచ్చాలు వుండవచ్చు. అయితే, తన ప్రయోజనాల కోసం ఆ విభేదాలను వుపయోగించుకొని, నేపాల్‌లో తాజా రాజకీయ అస్థిత్వాన్ని సృష్టించేందుకు ప్రయత్నించినట్లయితే, అది న్యూఢిల్లీకి వినాశకారిగా పరిణమిస్తుందనడం అతిశయోక్తికాదు. నూతన పార్టీ మావో లేక మావోయిజం పేరిట ప్రమాణ స్వీకారం చేయలేదన్న విషయాన్ని మదిలో పెట్టుకోవాలి. పరస్పర మైత్రి, ఉమ్మడి సంస్కృతి, పరస్పర లక్ష్యాలపై ఉభయ దేశాలు విరుద్ధాభిప్రాయ బహిరంగ ప్రకటనలు చేసుకున్నాయి. దీర్ఘకాలంగా భారత్-నేపాల్ సంబంధాలు అంత మైత్రీపూర్వకంగా లేవు. అనేక కారణాలతో నేపాల్ భారత్‌పై ఆగ్రహంతో వుంది. రాచరికాన్ని కూలదోసి నేపాల్‌ను నవీన లౌకిక ప్రజాస్వామ్య దేశంగా మార్చాలని కమ్యూనిస్టులు జరిపిన సుదీర్ఘ సాయుధ పోరాట సమయంలో భారతదేశం రాచరిక వ్యవస్థవైపు మొగ్గు చూపింది. నేపాల్‌లో కమ్యూనిస్టులు విజయం సాధించినట్లయితే, అది చైనా ప్రభావం కిందకు వెళ్లిపోతుందని, భారత ప్రయోజనాలకు అవరోధంగా మారుతుందని భారత్ భయం. రాచరిక వ్యవస్థను కూలదోసిన సందర్భంలో కమ్యూనిస్టులు అధికారాన్ని పాలుపంచుకోడానికి సిద్ధమయ్యారు. రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పడింది. రాజ్యాంగ రచనను మనఃపూర్వకంగా చేపట్టారు. రాజ్యాంగ రచన అమిత దీర్ఘకాల ప్రక్రియగా మారింది. హిందూ జనాభా అధికంగా వున్నప్పటికీ, దేశాన్ని లౌకిక రాజ్యంగా చేసే రాజ్యాంగాన్ని నేపాల్ ఆమోదించనుండగా, భారతదేశంలోని పాలకపార్టీ రహస్యంగా జోక్యం చేసుకొంది. నేపాల్ స్వయంగా హిందూ రాజ్యంగా ప్రకటించబడాలని అది కోరుకుంది. అయితే అలా జరగలేదు. ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సెక్యులరిజాన్ని కాంక్షించే రెండు కమ్యూనిస్టు పార్టీలు, నేపాలీ కాంగ్రెస్ దృఢంగా నిలబడ్డాయి. రాజ్యాంగ నిర్మాతలను ప్రలోభపరచడంలో న్యూఢిల్లీ విఫలమైంది. నేపాల్ ఆంతరంగిక వ్యవహారాల్లో అనవసర జోక్యం చేసుకోడానికి ప్రయత్నిస్తున్న పెద్దన్నగా న్యూఢిల్లీని చూశారు. అప్పుడు అపఖ్యాతి పాలైన దిగ్బంధనం ప్రయోగం జరిగింది. భారత్ నుండి నేపాల్‌కు సరుకులు తీసుకువెళ్తున్న ట్రక్కులన్నింటినీ భారత్-నేపాల్ సరిహద్దులో నిలిపివేశారు. రాజ్యాంగంలో తమ కొరకు పొందుపర్చిన నిబంధనలపై అసంతృప్తితో వున్న కారణంగా నేపాల్ దక్షిణ ప్రాంతాల్లో నివశించే భారతీయ సంతతికి చెందిన మధేసీలు దిగ్బంధనాన్ని నిర్వహించినట్లు పైకి కనిపించారు. అయితే, దిగ్బంధనానికి న్యూఢిల్లీ పూర్తి మద్దతు వున్న విషయం నేపాల్ ప్రజలకు, ప్రభుత్వానికి తెలుసు. నేపాల్ ఒక పరివేష్టిత దేశం. భారత్ ద్వారానే దాని సరఫరాలన్నీ వస్తాయి. ఐదు నెలలపాటు జరిగిన దిగ్బంధనం ప్రత్యేకంగా దేశానికి ఇంధన సరఫరా నిలిపివేయడంతో నేపాల్ ఆర్థిక పతనం అంచుకు చేరుకొంది. దిగ్బంధనం 2015, సెప్టెంబర్ 23న ప్రారంభమై 2016 ఫిబ్రవరి 10న ముగిసింది. దాంతో భారత్‌ను నేపాల్ ప్రతినాయకుడిగా, విశ్వసించలేని దేశంగా భావించింది. భారత్ దిగ్బంధన వ్యూహం బెడిసికొట్టినట్లు రుజువైంది కూడా. నేపాల్‌ను చైనా కౌగిలిలోకి భారత్ నెట్టింది. సరుకుల సరఫరాకు పూర్తిగా భారత్‌పై ఆధారపడటానికి ముగింపు పలికేందుకు టిబెట్‌తో నేపాల్‌ను అనుసంధానం చేసే రైలు మార్గం నిర్మాణాన్ని తక్షణ ప్రాతిపదికపై చైనాతో చేపట్టింది. ఈ రైలు మార్గం పూర్తయితే, అవసరమని భావించినప్పుడు రైలు ద్వారా సైన్యాలను ఖాట్మండు వరకు పంపే అవకాశం ఏర్పడుతుంది. ఈ పరిణామానికి పూర్తి బాధ్యత మోడీ సర్కారే వహించవలసి వుంటుంది. అధికారిక సంబంధాలు అటుంచితే, భారత్-నేపాల్ మధ్య ప్రజలకు-ప్రజలకు సంబంధాలు ఎలా ఉన్నాయి? సగటు భారతీయుడు భారత్‌లోని సగటు నేపాలీల పట్ల ఆదరణ భావంతో వున్నాడు. అందుచేత, ఇరుదేశాల ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు నెలకొనాలి. నేపాల్ వంటి చిన్న పొరుగు దేశాలపట్ల న్యూఢిల్లీ సంప్రదాయ పెద్దన్న వైఖరిని వీడి, సమాన ప్రాతిపదికన వ్యవహరించాలి. భారత్ ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వం, ప్రజల విశ్వాసం పొందేందుకు ఉభయ దేశాల మధ్య సత్సంబంధాలు మారాకుతొడిగి ముందుకు సాగాలి.

చురక

సీబీఐ శీల వ్రతం
చెడుతున్నది దాని గతం
శోధించే మనోగతం
వేధిస్తే ఏలా హితం

పాలించే పార్టీ చుట్టు
పరిరక్షణ గొడుగులు
విపక్షాల చర్యలపై
వింత దాడి అడుగులు

- వేల్పుల నారాయణ

"చోర్ బ్యాంకింగ్"తో జనధనం లూటీ

సందర్భం

రూ 6 లక్షల కోట్లు మాఫీ | 10 లక్షల కోట్ల మొండి బాకీలు | మోడీ ఘోర వైఫల్యం

పతకమూరు దామోదర్ ప్రసాద్

మన దేశంలో తరచుగా వెలుగులోకి వస్తున్న బ్యాంకింగ్ కుంభకోణాలు. "చోర్ బ్యాంకింగ్"తో బ్యాంకులను దగా చేసి జనధనం లూటీ చేసిన అక్రమార్కులు వేల కోట్లు దారి మళ్ళించి యథేచ్ఛగా విదేశాలకు పారిపోవడం ప్రజలకు దేశ ప్రగతిని కోరుకునేవారికి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఎంపిఎల్ నిధుల కుంభకోణంలో వేల కోట్లు దుర్వినియోగం చేసిన లలిత్ మోడీ, మద్యం వ్యాపారి, విలాసాలలో మేటి, రాజ్యసభ సభ్యుడు విజయ్ మాల్యా బ్యాంకులకు రూ. 10 వేల కోట్లు టోపీ వేసి అధికార పార్టీలు, కూటముల సహకారంతో విదేశాలకు పారిపోయి కులాసా జీవితం గడుపుతున్న వారిని పట్టి తేవడంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇప్పుడు తాజాగా గుజరాత్‌కు చెందిన వజ్రాలు, ఆభరణాల వ్యాపారి నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీలో రూ. 11,400 కోట్ల రుణాలు తీసుకుని విదేశాలకు ఉడాయించడం దిగ్భ్రాంత పరచింది. నీరవ్ మోడీ తన మామ, గీతాంజలి జెమ్స్ వ్యవస్థాపకుడు మెహుల్ చోక్సీతో కలసి ఈ మోసాలకు పాల్పడినట్లు బ్యాంకుల అధికారులు చాలా ఏళ్ల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. గీతాంజలి జేమ్స్ అధిపతిగా మెహుల్ చోక్స్ మరో రూ. 1,700 కోట్ల బ్యాంకు రుణాలు తీసుకుని ఎగవేసిన అంశాన్ని పరిశీలిస్తే మామా అల్లుళ్లిద్దరూ కొల్లగొట్టిన మొత్తం రూ. 13 వేల కోట్ల పైమాటేనని తేలుతోంది.

ఢిల్లీకి చెందిన మరి రెండు ఆభరణాల తయారీ వజ్రాల ఎగుమతి సంస్థలు ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, ద్వారకాదాస్ సేథ్ ఎస్.ఇ.జెడ్ కంపెనీలు రూ. 390 కోట్ల రుణాలు తీసుకుని, మోసగించి పరారీ అయినట్లు ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓ.బి.సి.) గత ఆగస్టులోనే ఫిర్యాదు చేసినా సీబీఐ ఫిబ్రవరి 22న మాత్రమే కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. ఈలోగా నిందితులైన ఆ కంపెనీల డైరెక్టర్లు సభ్యసేథ్, రీటా సేథ్, కృష్ణకుమార్ సింగ్, రవికుమార్ సింగ్ ప్రభృతులు ఈలోగానే సురక్షితంగా, సునాయసంగా దేశ సరిహద్దులు దాటి మన నేర దర్యాప్తు సంస్థలకు సవాలు విసిరారు. కాగా కాన్పూర్‌కు చెందిన మరో పారిశ్రామిక వేత్త, రోటోమాక్ పెన్నుల తయారీ సంస్థ అధిపతి విక్రం కొఠారి, భార్య సాధన, కుమారుడు రాహుల్ బ్యాంక్ ఆఫ్ బరోడా సహా మరో 6 బ్యాంకుల నుండి రూ. 3,695 కోట్ల మేర రుణాలు తీసుకుని అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదు రాగా సీబీఐ వారిని అరెస్టు చేసింది. ద్వారకాదాస్ సేథ్ కంపెనీల రుణాలను ఓబీసీ 2014 మార్చి 31నే మొండి బాకీలు (ఎన్‌పీఏ) గా ప్రకటించింది. 2007-12 సంవత్సరాల మధ్య ఓబీసీ దాస్ కంపెనీ తన సరఫరాదార్లకు సొమ్ము చెల్లించడానికై ఎల్‌వోసీలు జారీ చేసింది. రోజూ తమచుట్టూ తిరుగుతున్న నీరవ్ మోడీ - మెహుల్ చోక్సీ వంటి ఘరానా వ్యక్తులు ఇన్ని మోసాలకు, అక్రమాలకు పాల్పడుతున్నా కమలనాధులు కళ్లు తెరవలేదు. నీరవ్ మోడీ రూ. 350 కోట్లు, విజయ్ మాల్యా కూడా భారీ మొత్తాలు బీజేపీ ఎన్నికల ప్రచారాలకు విరాళంగా ఇచ్చినందునే వారిపట్ల మోడీ ప్రభుత్వం మెతక వైఖరి అవలంభించిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

ఇలా ఒకటొకటిగా బయటకు వస్తున్న బ్యాంకు మోసాల కుంభకోణాలు బ్యాంకింగ్ వ్యవస్థను కుదిపేస్తోంది. ఎవరో కొందరు మధ్యశ్రేణి అధికారులపై కేసులు పెట్టి అరెస్టు చేయడం మినహా, బ్యాంకుల యాజమాన్యంలో ఈ ఆర్థిక నేరస్తులకు సహకరించిన ఉన్నతాధి కారులను ఇంకా పట్టుకోకపోవడం శోచనీయం. టెలికాం కుంభకోణంలో దేశ ఖజానాకు రూ. 1.76 లక్షల కోట్ల నష్టం జరిగిందని నిర్ధారించి, ప్రకంపనలు సృష్టించి, బీజేపీకి, నరేంద్ర మోడీకి "బ్రహ్మాస్త్ర" మందించిన మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ విరమణ తర్వాత దేశ బ్యాంకింగ్ బోర్డు చైర్మన్‌గా నియమితు లయ్యారు. ప్రైవేట్ రంగ అక్రమ లాభాల వేటగాళ్లకు సహకరించిన వారికి భారీగా వేల కోట్ల రుణాలిచ్చే అవినీతి అధికారులపై, బ్యాంకుల డైరెక్టర్లపై నిఘావేసి, బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడటంలో వినోద్‌రాయ్, నియంత్రించాల్సిన రిజర్వు బ్యాంకు, కేంద్ర ఆర్థిక శాఖల తమ విధుల నిర్వహణలో విఫలమై నారనడంలో నిస్సందేహం. అవినీతిని అరికడతామనీ, విదేశాలలో దాచిన వేల కోట్ల నల్లధనాన్ని తెచ్చి నిరుపేదల ఖాతాలలో జమచేస్తామని నమ్మబలికిన నరేంద్ర మోడీ వాగ్దానాల అమలులో విఫలమైన సంగతి సుస్పష్టం. ఈ దేశంలో అపర కుబేరులకు, పారిశ్రామిక ధనపతులకు "ఆప్త మిత్రుడు"గా వారి ఆర్థిక, వాణిజ్య అవసరాలు తీరుస్తూ, ప్రయోజనాలు తీరుస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ఐపిఎల్ లలిత్ మోడీ, విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ వంటి ఆర్థిక నేరస్తులు వేలకోట్లు ప్రజాధనం కొల్లగొట్టి, స్వేచ్ఛగా విదేశాలకు పారిపోతున్నా, వారిని దేశానికి రప్పించి, సొమ్మునురాబట్టడంలో ఘోరంగా విఫలమై ప్రజలు తనపై పెట్టుకున్న ఆశలను అడియాసలు చేసి క్రమంగా "విశ్వసనీయతను" కోల్పోతుండటం విచారకరం. పంజాబ్ నేషనల్ బ్యాంక్, తదితర బ్యాంకుల్లో ఏడేళ్లుగా ఈ మోసాలు జరుగుతున్నట్లు ప్రధాని సచివాలయానికి ఫిర్యాదులందినా వారిపై చర్యలు తీసుకోకపోగా ఆర్థిక నేరస్తులకు రాచమర్యాదలందించడం హేయం. వేల కోట్ల మోసాలు, అక్రమాలు బయటపడినందున అరెస్టు తప్పదని ఉన్నతాధికార వర్గాలు ముందే తెలియజేయగా గత జనవరిలోనే నీరవ్ మోడీ ఆయన కుటుంబ సభ్యులు విదేశాలకు పారిపోయారు. అయితే అదే నీరవ్ మోడీ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక అగ్రనాయకుల సభకు హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ వెనుక నిలబడి గ్రూప్ ఫొటో దిగడం, లలిత్ మోడీ భాయ్, నీరవ్ మోడీ భాయ్‌లు నరేంద్ర మోడీ భాయ్‌కి, కమలనాథులకెంత సన్నిహితులో, వ్యవస్థను ప్రభావితం చేయగల శక్తిమంతులో స్పష్టమవుతోంది. రూ. 5,500 కోట్లు నీరవ్-చోక్సీల ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నా వాటి అసలు విలువెంతో తేలలేదు.



పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముంబయి బ్రాడీహౌస్ శాఖ కేంద్రంగా ఏడేళ్లపాటు నిరాటంకంగా నీరవ్ మోడీ సాగించిన లావాదేవీలు, అక్రమాలు బ్యాంకు ఉన్నతా ధికారులు రాజకీయ నేతల ప్రమేయం లేకుండా జరిగే ఆస్కారం లేదు. అంతర్జాతీయంగా జరిగే వాణిజ్య లావాదేవీల్లో వ్యాపార సంస్థలకు సులువుగా చెల్లింపులు జరిపే నిమిత్తం 1977లో బెల్జియం కేంద్రంగా ఈ స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వరల్డ్ వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలీకమ్యూనికేషన్స్)ను ఏర్పరచి ఇంతవరకు 7.1 బిలియన్ల లావాదేవీలు నిర్వహించారు. పీఎన్‌బీలో ఎల్‌వోయూల పేరిట తీసుకున్న సొమ్మును నీరవ్ మోడీ తన ఇతర కంపెనీలకు, మామ చోక్సీ సంస్థలకు మళ్లించి, పీఎన్‌బీకి రూ. 11,400 కోట్ల మేర దగా చేసినట్లు ఇప్పటికి తేలింది. డిప్యూటీ మేనేజర్‌గా గోకుల్‌నాథ్ షెట్టి ఏడేళ్లపాటు అదే హోదాలో, అదే శాఖలో ఎవరు ఎందుకు కొనసాగించారో పీఎన్‌బీ అధికారులు సంజాయిషీ ఇవ్వాల్సి వుంది. ఆయన ఉద్యోగ విరమణ చేశాక బాధ్యతలు స్వీకరించిన అధికారులు అసలు గుట్టు బయటపెట్టారు. ఇదిలా వుండగా గీతాంజలి జెమ్స్ అధిపతి మెహుల్ చోక్సీ తనను రూ. 13 కోట్ల మేర దగా చేసినట్లు బెంగళూరు ఆభరణాల వ్యాపారి ఎస్.వి. హరిప్రసాద్ చేసిన ఫిర్యాదుపై బెంగళూరు సెషన్స్ కోర్టు విచారణ ఆరంభించింది. రూ. 2 కోట్లయినా చేయని ఆభరణాలను తనకు రూ. 10 కోట్లకు అంటగట్టారని, ఆర్.వి. రోడ్డులోని షోరూంకు రూ. 3 కోట్ల అద్దె చెల్లించకుండా మెహుల్ చోక్సీ మోసగించారని హరిప్రసాద్ ఆరోపణ. రూ. 100 విలువ చేయని గీతాంజలి జెమ్స్ షేర్లను కృత్రిమ పద్ధతిలో లంచాలిచ్చి ఏ విధంగా రూ. 650 కి పెంచి అదే రేటుకు ఎల్ఐసి కి అమ్మి రూ. 10 వేల కోట్ల మేర మోసాలకు పాల్పడినట్లు చోక్సీపై 2016లోనే హరిప్రసాద్ ఫిర్యాదు చేసినా ప్రధాని కార్యాలయం పట్టించుకోలేదు. ఆ తరువాత షేరు ధర రూ. 50కి పడిపోగా 6 నెలలు సెబీ నిషేధించింది. నీరవ్ మోడీ కుంభకోణం వెలుగు చూశాక పీఎన్‌బీ షేరు విలువ పతనమై రూ. 7 వేల కోట్ల నష్టం జరిగినట్లు తేలింది.

దేశంలో బ్యాంకులిచ్చిన రుణాలు రూ. 10 లక్షల కోట్ల మేర "మొండి బాకీలు"గా తేలాయి. రూ. 6 లక్షల కోట్ల మొత్తాన్ని బ్యాంకులు మాఫీ చేశాయి. ఆపై బ్యాంకుల కుంభకోణాలు వెరసి బ్యాంకుల రుణవితరణ సామర్థ్యాన్ని తగ్గించడంతో కొత్తగా రుణాలివ్వలేని స్థితి. ప్రభుత్వం రూ. 2.10 లక్షల కోట్లిస్తామన్నా ఇచ్చింది రూ. 70 వేల కోట్లే. మిగతాది మార్కెట్ నుండి సమీకరించుకోమని బ్యాంకులకు ప్రభుత్వ సలహా. మన వాణిజ్య బ్యాంకులు కేవలం 11,643 మందికి రుణాలతో 38 శాతమిచ్చినట్లు రిజర్వు బ్యాంకు 2016లో పేర్కొంది. మొండి బాకీలలో 84 శాతం గుత్త బడా పారిశ్రామిక సంస్థలవే కావడం గమనార్హం. ఈ తరుణంలో జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించాలని పారిశ్రామిక సంఘాలు కోరడం విడ్డూరం. 1969లో జాతీయీకరణకు ముందు ఏటా 35 బ్యాంకులు దివాలా తీసిన సంగతి గుర్తుంచుకోవాలి. దేశంలో సంస్కరణలు ఆరంభమయ్యాక రమేష్ గెల్లి గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, సెంచూరియన్ బ్యాంకులు కుప్పకూలగా వాటి భారాన్ని ప్రభుత్వ బ్యాంకులే మోయాల్సి వచ్చింది. ప్రైవేటు రంగ ఆక్సిస్, ఐసీఐసీఐ మొండి బాకీలు పెరిగాయి. కొటక్ మహేంద్ర బ్యాంకు పూచీలేని రుణాలిస్తోందనే ఆరోపణలున్నాయి. బ్యాంకుల వ్యవహారాలను ఓ కంట కనిపెడుతూ నియంత్రించాల్సిన రిజర్వుబ్యాంకు, బ్యాంకుల డైరెక్టర్ల బోర్డులు, ఆడిటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు పటిష్టంగా వుంటాయి. ప్రస్తుత కుంభకోణాలకు యూపీయే కారణమని కమల నేతలు, ఎన్డీఏ ప్రభుత్వ వైఫల్యమే కారణమని పరస్పరం నిందించుకుంటున్నారు. బడా వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు 2014 ఎన్నికలకు భారీగా బీజేపీ ఎన్నికలకు నిధులిచ్చినందునే వారి అక్రమాలపై మెతకవైఖరి అని ఆరోపణలున్నాయి. దేశానికి తను "కాపలాదారునని" చెప్పుకున్న ప్రధాని మోడీ సర్వాధికారులు కేంద్రీకరించుకుని, నోట్ల రద్దు వంటి హానికర చర్యలకు పాల్పడి ఎందరికో వేదన కలిగించారు. ఎస్‌బీఐ వంటి బ్యాంకులు ప్రజలపై లేనిపోనీ చార్జీలు వసూలు చేస్తూ భారం మోపుతున్నాయి. మోడీ ఇప్పటికైనా బ్యాంకుల పటిష్టతకు చర్యలు చేపట్టి పేదలు, రైతులకు రుణాలు అందుబాటులోకి తెస్తే అది కమలానికే మేలు.

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు,
సెల్ : 9440990381

తెలుగు గడ్డ చాలా సారవంతమైంది. రెండు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు రకాల కూరగాయలను పండించడం వీలవుతుంది. కూరగాయల పరాధీనతకు విరుగుడు- తెలుగు రైతులు అన్నిరకాల కూరగాయల్నీ పండించడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వాలు అందుకు సమర్థ కార్యాచరణను చురుగ్గా పట్టాలకు ఎక్కించాల్సి ఉంది!

కూరగాయలు

శాకాహారులు, మాంసాహారులు అనే తేడా లేకుండా ఏ ఆహారం తీసుకునే వారికైనా కూరగాయలు ఎంతో అవసరం. పీచుపదార్థం, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు తదితరాలన్నీ పుష్కలంగా వీటిలో లభిస్తాయి. సీజన్లతో సంబంధం లేకుండా అన్ని కాలాల్లోనూ ఏవో ఒక రకం కూరగాయలు లభిస్తాయి. జనం కూడా అలాగే వీటిని ఆహారంగా స్వీకరిస్తుంటారు. సహజంగా వేసవి వస్తుందంటే కూరగాయల దిగుబడులు తగ్గి ధరలు భగ్గుమంటుంటాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గిపోవడమే. వేసవే కాదు, వర్షాలు జోరెత్తినప్పుడు కూడా సాగు విస్తీర్ణం, దిగుబడులు తగ్గుతాయి. ఇటీవల సంవత్సరాల్లో సీజన్లతో నిమిత్తం లేకుండా, కూరగాయలు కొనబోతే కంట్లో కారం పడ్డట్లుగా విలవిల్లాడే దురవస్థ తరచూ అనుభవంలోకి వస్తోంది. జాతీయ ఉద్యానమండలి గణాంకాల ప్రకారం నిరుడు దేశవ్యాప్తంగా సుమారు రెండున్నర కోట్ల ఎకరాల్లో పదిహేడున్నర కోట్ల టన్నుల మేర కూరగాయలు పండించారు. దిగుబడుల ప్రాతిపదికన తొలి పది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చోటు సంపాదించలేకపోయాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక అవసరాలకు కావాల్సిన కూరగాయల్లో సగానికిపైగా ఇతర రాష్ట్రాలనుంచి రవాణా చేసుకోవాల్సి వస్తుంది. దీంతో చిల్లర ధరలు చుక్కలు చూపిస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో ఉల్లి, ఆలుగడ్డ, పచ్చిమిరప, క్యారెట్, బీన్స్ లాంటి రకాల్నీ నాందేడ్, ఆగ్రా,



బెంగళూరు తదితర ప్రాంతాలనుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో వినియోగదారులు కొనబోతే కొరివిని తలపిస్తున్న కూరగాయలు రైతులు అమ్మబోతే అడివి చందం కావడం చాలా సార్లు జరుగుతుంది. తెలుగునేలపై పండించిన ఉల్లిగడ్డ, దొండకాయల్ని చవగ్గా కొనేసిన వ్యాపారులు ఆ సరకునే 10, 20 రెట్లకు పైగా రేటు పెంచేసి విక్రయించడం- అనేకసార్లు జరిగింది.

కూరగాయల సాగు విస్తీర్ణంలో పశ్చిమ బెంగాల్ (13.91 లక్షల హెక్టార్లు), దిగుబడి రీత్యా ఉత్తర్ ప్రదేశ్ (256.88 లక్షల టన్నులు) ప్రథమ స్థానాల్లో ఉన్నాయి. మిగిలిన రాష్ట్రాలు కూడా బాగానే కూరగాయలు పండిస్తున్నట్లు జాతీయ ఉద్యాన

లోచనం

మండలి పేర్కొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల కన్నా ఒడిశా, ఝార్ఖండ్, హర్యానా లాంటివి అధికంగా కూరగాయలు పండించగలుగుతున్నాయి. నగరాలు, పట్టణ ప్రాంతాలకు చేరువలో కూరగాయలు, పళ్లు, పూలతోటలు పెంచుతున్న దేశాల స్ఫూర్తితో మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక వంటిచోట్ల 'అర్బన్ క్లస్టర్స్' ద్వారా లాభాలు పండిస్తున్నారు. ఒక హెక్టారుకు పండే కూరగాయల జాతీయ సగటు 17.3 టన్నులు. తమిళనాట అది ఎకాయెకి 30 టన్నులు. జాతీయ సగటునైనా అందుకోలేక తెలుగు రాష్ట్రాలు ఈసురోమనడానికి ఎన్నో కారణాలున్నాయి. సాధారణ పంటల సాగుకిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలకు ఇక్కడి కూరగాయల రైతులు నోచుకోవడంలేదు. రాయితీపై విత్తన సరఫరా జరగడంలేదు. హర్యానా, ఒడిశా తదితర రాష్ట్రాలు సంకర జాతి వంగడాల దన్నుతో అధిక దిగుబడి సాధిస్తున్నాయి. వ్యవస్థాగత తోడ్పాటు లేకపోవడంతో అనువైన రకాల సాగుకు కూడా తెలుగు రైతులు సాహసించలేకపోతున్నారు. కోత, రవాణా ఖర్చులకైనా ఠికాణా లేని స్థితిలో టమాటా, దొండ, బెండ, దోస వంటి కూరగాయల్ని రైతులు రోడ్లపై పారబోస్తున్న, చేనులోనే వదిలేస్తున్న ఘటనలు అనేకం మనకు తెలుసు. తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల పంట లకు సంబంధించి సహకరించేందుకు ప్రత్యేకంగా నెలకొల్పిన ఉద్యాన విశ్వవిద్యాల యాలూ నిస్తేజమైపోయాయి. ఏ కాలంలో ఏ పంటవేస్తే ఎంత ధర పలికే వీలుందన్న కనీస మార్గదర్శకత్వం కూడా తెలుగు రైతులకు కొరవడింది. దీంతో కూరల సేద్యాన్ని వదిలేస్తున్నారు. వ్యవస్థాగతమైన ఈ అలసత్వానికి ప్రజలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది!

పథక రచన, విత్తన సరఫరా, నిల్వ, పంపిణీల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ పళ్లు, కూరగాయల ఉత్పాదనలో చైనా, జపాన్, ఆస్ట్రేలియా తదితర దేశాలు విశేష లాభాలు గడిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొరవడిన కారణంగా నిల్వచేసుకొనే పరిస్థితులు లోపించి నిరుడు దేశంలో పండిన కూరగాయల్లో దాదాపు 15 శాతం (2.62 కోట్ల టన్నుల) మేర పాడై పోయాయి. ఇలా పాడైన కూరగాయలను అయిదు రాష్ట్రాల ప్రజలకు ఏడాది పొడుగునా ఉచితంగా అందించవచ్చని నిపుణులు పేర్కొన్నారు. దీన్నిబట్టి ఏ స్థాయిలో కూరగాయల వృథా జరుగుతున్నదో స్పష్టమవుతోంది. దేశంలో ప్రస్తుతం శీతల గిడ్డంగుల మొత్తం సామర్థ్యం మూడున్నర కోట్ల టన్నులకు పరిమితమైంది. కనీసం 30-40 లక్షల టన్నుల మేర ఈ సామర్థ్యాన్ని విస్తరించితేనే, పళ్లు, కూరగాయల భారీ వృథాను నివారించడం సాధ్యమవుతుంది. దీనికి ప్రాసెసింగ్, శుద్ధి వంటి ప్రక్రియలు జతకూడితే మన దేశంలో వినియోగానికి సరిపోవడమే గాక ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం కలుగుతుంది. స్థాపిత లక్ష్యాల్ని గాలికొదిలేసిన వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలు, పరిశోధక సంస్థల్లో పునరుత్తేజం నింపాల్సిన అవసరం ఉంది. శాస్త్రవేత్తల ప్రత్యక్ష భాగస్వామ్యంతో మేలిమి వంగడాల రూపకల్పన సహా అన్ని అంచెల్లో సమగ్ర ప్రక్షాళనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రథమ ప్రాధాన్యమివ్వాలి. ఇలా జరిగితే రైతులు, వినియోగదారులకే కాదు- దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా పళ్లు, కూరగాయల సేద్యం ఊతంగా మారుతుంది.

- జ్యోతి

కాశ్మీర్ జర్నలిస్టులు నిజా-నిజాలు

సుశీల్ కుట్టి

ప్రముఖ కాశ్మీరీ ఫొటో జర్నలిస్టు, కామ్రాన్ యూసఫ్‌ను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) 'రాళ్ళు విసిరిన' వ్యక్తిగా ముద్రవేసి 'రియల్ జర్నలిస్టు' కాదు అని తేల్చి చెప్పింది. వాస్తవమైన జర్నలిస్టులా అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను గురించి రాయలేదని అభాండాలు వేసి గత సెప్టెంబరు నుంచి యూసఫ్‌ను నిర్బంధంలోకి తీసుకుంది. ఇతర ఫొటో జర్నలిస్టుల్లా యూసఫ్ కూడా రొటీన్‌గా రాళ్లు రువ్విన వారి ఫొటోలు తీసి కెమేరాలో బంధించేవారు. యూసఫ్ విడుదలకోసం ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్టు (ఐఎఫ్‌జే)లు పెద్ద ఎత్తున పిలుపుఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆయన విడుదలకు తగిన చర్యలేమీ జరగలేదు. దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన యూసఫ్‌ను 2017 సెప్టెంబరులో అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకొచ్చారు.అప్పుడు ఆయనపై ఎటువంటి అభియోగం మోపలేదు.జనవరి 18న ఆయనపై భద్రతాదళాలపై రాళ్లురువ్విన వ్యక్తిగా, భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రవాద కార్యకలాపాలు సాగించడంతోపాటు టెర్రరిస్టులతో చేతులు కలిపాడన్న అభియోగాలు మోపారు. దీనిపై ఎన్ఐఏ ఒక డాక్యుమెంటరీని కూడా రూపొందించి టెర్రరిస్టుగా చూపించేందుకు ప్రయత్నించింది.

నేను ముగ్గురు కాశ్మీరీ జర్నలిస్టులతో పనిచేశాను. కాగా మరొకరు రెండేళ్ల క్రితం ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంలో రామ్‌నాథ్ గోయంకా అవార్డు గ్రహీత 28ఏళ్ల యువకుడు. కాగా మూడవ వ్యక్తి ప్రస్తుత రాజకీయాలపై సమగ్ర నివేదిక అందించే అనుభవం ఉన్న వ్యక్తి, కష్టజీవి. వీరు ముగ్గురినీ నేను 2014లో కలుసుకున్నాను. వీరందరితో సమావేశం గొప్ప ఆవిష్కరణగా చెప్పవచ్చు. మొదటిసారి నేను పాకిస్తానీ అనుకూల కాశ్మీరీలతో ముఖాముఖిగా మాట్లాడాను. ఈ 28ఏళ్ల కుర్రవాడు పాకిస్తాన్ అనుకూలుడే...కానీ అతన్ని రెచ్చగొడితే తప్ప ఎట్టిపరిస్థితుల్లోనూ బయటపడకుండా ముసుగు కప్పు కుంటాడు. అతన్ని వాదనలోకి దింపి భారత్ వ్యతిరేక పటిమ బయటకు తీసుకురావలసి ఉంటుంది. అతను చాలా ధైర్యవంతుడు అని చెప్పవచ్చు. అతని అనుభవంలో.... "ఒకరోజు మధ్యాహ్న సమయంలో స్కూలు నుంచి తిరిగివస్తున్నాను. మార్గమధ్యలో సైనికుల కాల్పుల్లో చిక్కుకుపోయాను. ఆ సందర్భంలో ఎవరో నా చేయి పట్టుకు గోడ వెనక్కి తీసుకెళ్లడంతో బతికి బట్టకట్టాను. భద్రంగా ఇంటికి చేరుకున్న వెంటనే మా అమ్మ స్కూలు బ్యాగ్‌లో బుల్లెట్లు ఉన్నట్లు గ్రహించింది. నా పుస్తకాలే ఆరోజు నన్ను కాపాడాయి" అని తెలిపాడు. ఆరోజు నుండి తనలో భారతీయ సైనికుల పట్ల పూర్తి వ్యతిరేకత నాటుకుందని చెప్పుకొచ్చాడు. భయంకరమైన వాస్తవాన్ని ఎదుర్కొనడం చాలా ధైర్యంతో కూడుకున్నపనే...

ప్రస్తుతం విలేకరిగా ఉన్న శ్రీనగర్‌లోని ఒక యువతి రాళ్లురువ్వడాన్ని 'ధైర్యం', 'హీరోయిజం', బుల్లెట్లకు భయపడటం అనే పదాలను వాడటానికి కాదు, ఆ ప్రక్రియ అణచివేత, ప్రజాఅవరోధానికి కారణంగానే ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి" అని ఆమె చెప్పుకొచ్చారు. అయితే ఆమె కోణాన్ని కూడా కాదనలేము. రాళ్లురువ్వేవారిలో చాలామంది ఆమె పొరుగింటివారే ఉంటారు, వారిపట్ల జాలి ఆమె జీవిత ఘట్టాలనుండే వచ్చిఉంటుంది.

ఆమె ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతూ ఉంటారు. అయితే ఆమెతో నేను మొదటిసారి ముఖాముఖి మాట్లాడిన సందర్భాన్నే నేను గుర్తుకు తెచ్చుకుంటున్నాను. నేను ఒక కార్యక్రమంలో ఉండగా జనగణమన పాడుతుండగా అందరూ లేచి నిలబడ్డాము. అయితే ఆమె మాత్రం ఆపని చేయలేదు. అందుకు ఆమె సమాధానం చెబుతూ అది నాదేశ జాతీయ గీతం కాదు..నేను భారతీయురాలిని కూడా కాదు. మొదట నేను కాశ్మీర్‌ని, తర్వాత పాకిస్థానీని అని చెప్పింది. కార్యక్రమం అనం తరం మాకు రవాణా వాహనాలు ఏవీ కనిపించలేదు. కనీసం ఆటోకూడా.. దాంతో ఇద్దరం రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ మెట్రో స్టేషన్ చేరుకున్నాం. దాని తర్వాత నేను ఆమెను పట్టించుకోలేదు. ఆమె ఇక్కడే నివశిస్తున్నా.. దేశం మాత్రం తనది కాదంటోంది. అవార్డు గ్రహీత అయిన పరిశోధాత్మక జర్నలిస్టు ఒక మంచి వ్యాసం రాశారు. అయితే నేను వారికి అందుబాటులో లేను. అయినా వారి గురించి తెలుసుకుంటూనే ఉన్నా.. ఆయనకు నేనొక వేర్పాటు వాది గురించి చెప్పా.. అతనికంటే మంచి జర్నలిస్టు మరొకరు ఉండరనే భావంతో ఉండేవారు. అతని భావాలు, వ్యాసాలు పాకిస్థాన్‌కు అనుకూలంగా, వేర్పాటువాదానికి దగ్గరగా ఉండటాన్ని ఎప్పుడూ దాచుకోలేదు.

ఒకసారి యూ ట్యూబ్‌లో పాకిస్థాన్ వార్తలు చూస్తుండగా, బాగా పరిచయం ఉన్న గొంతు వినిపించడంతో దానికి అతుక్కుపోయాను. అది ఇంతకు ముందు నేను చెప్పిన సీనియర్ జర్నలిస్టుదే. భారత్ నుంచి యూట్యూబ్ వీడియోకి గెస్టుగా వెళ్లాడు. భారత్ గురించి, సైనికదళాలపై మాట్లాడుతూ భారత్ కాశ్మీర్‌ను ఆక్రమించుకుందని చెబుతున్నాడు.అతను పూర్తిగా దేశద్రోహిగా మారాడు. నాకు చేష్టలుడిగి పోయాయి. పాకిస్థాన్‌లోని ఉర్దూపత్రికలకు కూడా ఆయన అనేక వ్యాసాలు రాసే ఉంటారు. అయితే అంతకు మించి మనం మాట్లాడుకోవడం అనవసరం. అతను ఎదుర్కొన్న పరిస్థితులే అయన్ను అలా మార్చి ఉంటాయి. కొన్నాళ్లు ఆయన జైలు శిక్ష అనుభవించాడని కూడా విన్నాను. మళ్లీ మనం యూసఫ్ దగ్గరకు వస్తే నిజమైన వృత్తి జర్నలిస్టు అయితే.. కొన్ని ప్రజోపకారాలు కూడా చేసి ఉండాలి. కొన్ని రక్తదాన, వైద్య శిబిరాలు, రంజాన్ ఇఫ్తార్ విందులు, కొంతమంది విద్యార్థులను భారతదేశ దర్శనానికి ఉచితంగా తీసుకు వెళ్లిఉండాలి అని ఆయన గురించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పేర్కొంది. దీన్నిబట్టి చూస్తే ఎన్ఐఏలో వాస్తవ దర్యాప్తు దారుల కొరకు ఖాళీలు ఉన్నట్లుగా కనిపిస్తోంది. అర్హత : మెదళ్లు ఉండటం .

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
02 మార్చి 2018



కంసాలి, బ్రహ్మం, విశ్వ బ్రాహ్మణులు, స్వర్ణకారుడు....ఇలా పేరు ఏదైనా, పిలుపు ఏదైనా వారు చేసే పని బంగారు ఆభరణాలు తయారు చేయడం. వారు చేసే పనిలాగే వారి ఇల్లూ కళకళలాడుతూ ఉండేది ఒకప్పుడు. ఇంత వెలుగు వెలిగిన ఈ పుత్తడి పుత్రులు ఇప్పుడు వెలవెలబోతున్నారు. వారి జీవితాలు ఇప్పుడు నిస్సారంగా, నిస్తేజంగా తయారయ్యాయి. ఒకప్పుడు దర్జాగా జీవించిన స్వర్ణకారులు ఇప్పుడు కనీసం అద్దె కూడా చెల్లించలేని స్థితిలో కడు అవస్థలు పడుతున్నారు. చాలీచాలని ఆదాయంతోనే దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. పనులు లేక పస్తులు ఉంటున్న కుటుంబాలూ ఉన్నాయి. ఇందుకు కారణం వీధికొక్కటిగా పుట్టుకొచ్చిన రెడీమేడ్, కార్పొరేట్ బడా జ్యువెలరీ షాపులు, షోరూంలే. ఈ రెడీమేడ్ దెబ్బకు స్వర్ణకారులు విలవిల్లాడుతున్నారు. ఈ పనిలో కొనసాగలేక, ఇతర పనుల్లో అనుభవం లేక సతమతమవుతున్నా మాలాంటివాళ్ళను ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదని ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు విశాఖ జిల్లా రాంబిల్లి మండలానికి చెందిన స్వర్ణకారులు.

వెలవెలబోతున్న పుత్తడి బతుకులు





ఇంట్లో శుభకార్యమంటే మొదట గుర్తుకొచ్చేవారు కంసాలులే. పెళ్ళిలో కీలకమైన మంగళసూత్రాన్ని ఈ స్వర్ణకారులే తయారు చేసి ఇచ్చేవారు. ఇక్కడ కేవలం ఆభరణాలను కొనుగోలు చేయడం మాత్రమే కాదు ఇందులో ఒక సెంటిమెంట్ ఉండేది. మూడుముళ్ళ బంధం నూరేళ్ళ పాటు నిలవాలని కోరుకుంటూ వారి చేతితో తయారు చేసిన మంగళ సూత్రాలనే తీసుకునేవారు. ఇందుకోసం మేళతాళాలతో వారి ఇంటికి స్వయం పాకం కూడా తీసుకుని వెళ్ళేవారు. సమాజంలో స్వర్ణకారులకు అంత ప్రాధాన్యత ఉండేది. ఇదంతా గతం. వర్తమాన పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. నిత్యం బంగారంలో మునిగితేలిన ఈ స్వర్ణకారుల జీవితాలు ఇప్పుడు అల్లకల్లోలంగా మారాయి. కేజీల కొద్దీ బంగారంతో కళకళలాడిన కంసాలుల ఇళ్ళు ఇప్పుడు ఆర్డర్లు లేక కళావిహీనంగా మారాయి. ఎందుకు ఇలాంటి పరిస్థితి ఏర్పడిందంటే బడా షోం రూలు, వాటిలో పనిచేసే బెంగాలీ కార్మికులే అంటున్నారు స్వర్ణకారులు.

నాడు ఎంతోమందికి పని...నేడు కూటికి లేదు!



గతంలో చిన్న ఉంగరం నుండి భారీ హారాల వరకూ ఏది కావాలన్నా స్వర్ణకారుల దగ్గరకే వెళ్ళేవారు. దీంతో కంసాలులకు బంగారు ఆభరణాల తయారీ పని పుష్కలంగా ఉండేది. వారు పని చేసుకోవడమే కాదు పదిమందికి పని కల్పించేవారు. కాలక్రమంలో ఈ పరిస్థితి తారుమారైంది. సొంత వృత్తిని కోల్పోయి వర్క్‌షాపులను మూసేశారు. కుటుంబ పోషణ కోసం అభరణాల షోరూంలు, తయారీ సంస్థల్లో పనివాళ్ళుగా మారారు చాలామంది. అక్కడా అంతంతమాత్రం ఆదరణే ఉండడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వేరే పనులకు వెళుతున్నారు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసపోతున్నవాళ్ళూ ఉన్నారు.

90ల తర్వాత తారుమారు!

ఒకప్పుడు స్వర్ణకారులు రాజుల పోషణలో ఉండేవారు. నేడు పోషకులు లేక రోడ్డున పడ్డారు. రాజుల కాలం మొదలు పాతికేళ్ళ క్రితం వరకూ స్వర్ణకారుల జీవితాలు సాఫీగానే సాగిపోయాయి. 1990 తర్వాతే వారి జీవితాల్లో ఆటుపోట్లు మొదలయ్యాయి. ముంబై, కోయంబత్తూరు, అహ్మదాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారు రెడీమేడ్ ఆభరణాలు విక్రయించడం ప్రారంభించారు. ఇదే స్వర్ణకారుల వృత్తి మీద, వారి జీవితాల మీద తీవ్ర ప్రభావం చూపించింది. ఇందులోనూ ప్రత్యేకించి బెంగాల్ కార్మికుల రాక మరింత దుర్భరమైన పరిస్థితుల్లోకి నెట్టింది. తక్కువ కూలీకి పని చేస్తారన్న కారణంతో షోరూంల అధినేతలు బెంగాల్ నుండి కార్మికులను తీసుకువచ్చి విలక్షణమైన రీతిలో ఆభరణాలను తయారు చేయించడం ప్రారంభించారు. పదేళ్ళ కాలంలో ఈ పరిస్థితులు మరింత మారాయి. మెషినరీ ఆభరణాలు, విలక్షణమైన, ప్రత్యేకమైన ఆభరణాలపై మోజు పెరగడంతో మామూలు కంసాలులకు పని బాగా తగ్గిపోయింది. ఈ పరిస్థితి 2000 సంవత్సరం నాటికి మరింతగా మారింది. మజూరి లేదు, తయారీ ఖర్చు తక్కువ అంటూ బయటి వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించడంతో స్థానిక వ్యాపారులకు పని లేకుండా పోయింది. సన్నని, నాజూకైన ఆభరణాలకు ఆదరణ పెరిగిన నేపథ్యంలో స్వర్ణకారుల పరిస్థితి మరింతగా దిగజారింది.

ఆదుకోని ప్రభుత్వం

స్వర్ణకారుల జీవితాల్లో పూర్వపు కాంతులు తీసుకువస్తానన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచారు. పనిముట్ల కొనుగోలుకు తక్కువ వడ్డీపై రుణాలు ఇస్తామన్న వాగ్దానాన్ని గాలికి వదిలేశారు. కార్పొరేషన్ నిధులు ఒక ఏడాదికే పరిమితమయ్యాయని స్వర్ణకారులు విమర్శిస్తున్నారు. తొలి ఏడాది అరకొర రుణాలు ఇచ్చిన సర్కార్ రెండేళ్ళుగా అసలు ఆ మాటే ఎత్తడం లేదని స్వర్ణకారులు వాపోతున్నారు.

రెడ్డిపల్లి. రాము
రాంబిల్లి, విశాఖ జిల్లా

మా కుమారునికి పని నేర్పలేదు

నా తండ్రి వద్ద వృత్తిపని నేర్చుకున్నాను. ఇప్పుడు పని బాగా తగ్గిపోయింది. కొంత మెషినరీ ఉండటంతో మాలాంటివాళ్ళు ఏదోలా నెట్టుకొస్తున్నారు. ఈ వృత్తికి భవిష్యత్ లేకపోవడంతో నా కుమారుడికి ఈ పని నేర్పలేదు. ఈ వృత్తిలోకి రానివ్వలేదు. బాగా చదువుకుంటే మంచి ఉద్యోగమైనా వస్తుందనే ఆశతో కష్టపడి చదివించుకుంటున్నాం.

- మన్నాబత్తుల .రాజు
రాంబిల్లి

నేడు పని లేదు

నావయస్సు 69. తండ్రి నుంచి వారసత్వంగా ఎనిమిదో ఏటే స్వర్ణకార వృత్తిలోకి అడుగుపెట్టాను. 20 ఏళ్ళకే సొంతంగా షాపుపెట్టి పదిమందికి పని ఇచ్చాను. అభరణాలు చేయించుకోవడానికి చుట్టుపక్కల 20 గ్రామాల నుంచి వచ్చేవారు. రెడీమేడ్ షాపులు రావడంతో 20 ఏళ్ళుగా పని లేకుండా ఉంది. గతంలో యలమంచిలిలో మూడు షాపులు మాత్రమే ఉండేవి. ఇప్పుడు దాదాపు 50 వరకు జ్యూయలరీ షాపులు పెరిగిపోయాయి. ఆర్డర్లు లేకపోవడంతో పనివాళ్ళని తీసేసి కొంతకాలం పాటు ఒక్కడినే చేసుకున్నా. ఇప్పుడు అసలు నాకు కూడా పని లేకుండా పోయింది. అద్దె చెల్లించలేక పదేళ్లక్రితం షాపు ఖాళీ చేసేశాను. కొన్నాళ్ళు ఇంటి దగ్గర పనిచేశాను. ఇప్పుడు అదీ లేదు. చెయ్యడానికి పని లేదు. తినడానికి తిండి లేదు. ఇదీ ఈనాటి స్వర్ణకారుల పరిస్థితి.

- నవరం రాజా, యలమంచిలి

బతుకు తెరువు లేదు

ఈ వృత్తి వలనే గతంలో ఒక వెలుగు వెలిగాం. బెంగాలీ వర్కర్లు, షోరూంల పుణ్యమాని మాకు వచ్చే ఆర్డర్లు పడిపోయాయి. ఇప్పుడు పూట గడవడం గగనంగా మారింది. గత్యంతరం లేని పరిస్థితులో వేరే పని చేయలేక అదే పనిలో కొనసాగుతున్నాం.

అర్జున్, ఎస్.రాయవరం

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

స్వర్ణకారుల జీవితాలు మెరుగుపడేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. దానివల్ల అందుతున్న ప్రయోజనం ఏమీ లేదు. మాకు జీవనాధారం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- రమణ, ఏటికొప్పాక

టీ ఖర్చులు కూడా రావడం లేదు

నాకు 15 ఏళ్ళ వయస్సు ఉన్నప్పుడు వృత్తిలోకి వచ్చాను. ఇప్పుడు 78 ఏళ్ళు. ఈ వృత్తికి విరామం అంటూ లేదు. కానీ బేరాలు లేక ఇప్పుడు ఖాళీ అయిపోయాం. పనిచేసి నెలరోజులు అవుతోంది. చేసేది లేక షాపుతెరుచుకుని కాలక్షేపం కబుర్లతో రోజు గడిపేస్తున్నాం. టీ ఖర్చులు కూడా రావడం లేదు.

- సున్నం నాగేశ్వరరావు, రాంబిల్లి



నేనూ హోలీ ఆడా!

హోలీ సందడి అంతా ఈ బామ్మ దగ్గరే కనిపిస్తోంది కదా! బృందావన్‌లోని పురాతనమైన గోపీనాథ్ దేవాలయం వద్ద సులభ్ ఇంటర్నేషనల్ నిర్వహించిన రంగుల సంబరంలో ఈ బామ్మ పాలు పంచుకుంది. ఈ బామ్మ ఒక్కతే కాదు చాలామంది వితంతువులు ఇక్కడ హోలీ ఆడి తమ సంతోషాన్ని పంచుకున్నారు.

నీళ్ళెందుకు తాగాలంటే...!



మనిషి ఎన్ని నీళ్ళు తాగాలనేదానికి ఇంత అని లెక్క లేదు. ఎవరి శరీర తత్వాన్ని బట్టి వారికి ఈ పరిమితి ఉంటుంది. వేసవి వచ్చేసిందిగా. ఇక ఈ నీళ్ళు తాగడం మీద పుంఖానుపుంఖాలుగా వార్తలు, కథనాలు వస్తూనే ఉంటాయి. ఇవన్నీ చదివి కంగారుపడిపోనక్కర్లేదు. ప్రతి వేసవిలో మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో వాటినే ఫాలో అయిపోండి. మామూలు సీజన్‌లో కంటే కొంచెం ఎక్కువ నీళ్ళు తాగితే చాలు. అది కూడా మీ శరీరతత్వాన్ని బట్టి ఎన్ని లీటర్ల నీళ్ళు తాగాలనేది నిర్ణయించుకోండి. శరీరానికి నీళ్ళు సరిపోకపోతే అది ఆ విషయాన్ని మీకు తెలియజేస్తూ సంకేతాలిస్తూనే ఉంటుంది. అది గమనించుకోండి. శరీర అవసరాలకు తగ్గట్టుగా నీటిని అందించండి. దీనివల్ల మనకు కలిగే ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. చాలా రకాల పానీయాలను మించిన ఆరోగ్య లాభాలను నీరు మనకు అందిస్తుంది. ఈ ప్రపంచంలో అత్యంత సహజమైన, అత్యంత ప్రయోజనకరమైన, అత్యంత ఆరోగ్యకరమైన, అత్యంత చౌకైన పానీయం నీరు. శుద్ధమైన నీటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు, పైగా దీనివల్ల కలిగే కేలరీలు ఏమీ ఉండవు.

- మనిషి జీవించి ఉండాలంటే నీరు చాలా అవసరం. ఆహారం తీసుకోకుండా నెల రోజుల వరకూ బతకవచ్చు కానీ నీళ్ళు తాగకుండా వారానికి మించి బతకలేరు. నీరు మనకు ఆరోగ్యాన్నే కాదు అందాన్నీ ఇస్తుంది.
- శరీరంలో రోజువారీ జరిగే జీవక్రియలన్నీ సక్రమంగా జరగాలన్నా, రక్తప్రసరణ సరిగ్గా ఉండాలన్నా నీరు అవసరం. శరీరానికి అవసరమైన అన్ని రకాల మినరల్స్, విటమిన్స్, ఇతర రకాల పోషకాలను అందించే ప్రాథమిక మార్గం నీరే.
- మనం తాగే నీరు జీవక్రియల వేగాన్ని పెంచుతుంది. ఆకలిని క్రమబద్ధీకరిస్తుంది. తద్వారా ఆరోగ్యకరమైన బరువు ఉండేలా చేస్తుంది. దాహం వేసినప్పుడు తగినంత నీరు తాగితే దాహం తీరడమే కాదు ఆకలి కూడా తగ్గుతుంది.
- శరీరానికి తగినంత నీరు సరిపోకపోతే నిస్సత్తువ ఆవహించేస్తుంది. ఏ పనీ చేయలేని, ఒక్కోసారి అసలు కదలలేని పరిస్థితి వస్తుంది. దీనినే మనం డీ హైడ్రేషన్ అంటాం. ఈ స్థితి వస్తే తలనొప్పి వస్తుంది, శరీరంలో శక్తి బాగా క్షీణించిపోతుంది. తగినంత బలం, ఉత్సాహం అందించేదీ నీరే.
- అవయవాలన్నీ వాటి పని అవి చేయాలన్నా, చర్మం శుభ్రంగా, ఆరోగ్యంగా కనిపించాలన్నా తగినన్ని నీళ్ళు తాగాలి. చర్మం తాజాదనం, మెరుపు, కాంతి అన్నీ మనం తాగే నీటి పైనే ఆధారపడి ఉంటాయనే విషయం తెలుసా!
- జీర్ణప్రక్రియ సజావుగా సాగాలన్నా నీళ్ళు బాగా తాగాలి
- మన శరీరంలో 80 శాతం నీరే ఉంటుంది. అందులో ఒక్క శాతం తగ్గినా మనకు చాలా దాహంగా అనిపిస్తుంది. దాహం అనిపించినప్పుడు వెంటనే నీళ్ళు తాగండి. లేదంటే ప్రమాదం కొనితెచ్చుకున్నట్టే.
- మన శరీరానికే కాదు మన మెదడు చురుకుగా పనిచేయాలన్నా అందుకు కావలసిన ప్రధానమైన వనరు నీరే.
- మన శరీరంలోని కణాలు బాగా పనిచేయడానికీ నీరు దోహదపడుతుంది. రక్తంలో ఆరోగ్యకరమైన కొత్త కణాలు పుట్టడానికీ నీరు అవసరం. కారణంగా రక్తంలో 80 శాతానికి పైగా ఉండేది నీరే. మెదుడలోని కణాలతో సహా శరీరంలోని అన్ని కణాలు కచ్చితంగా, సక్రమంగా పనిచేయడానికి నీరు అవసరం.
- మనలోని వ్యర్థ పదార్థాలు, విష పదార్థాలు బయటకు పంపించేయడానికీ నీరు కావాలి.
- మన శరీర ఉష్ణోగ్రతను సమతులంగా ఉంచేదీ నీరే.
- రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. అనేక వ్యాధులను నివారిస్తుంది.
- తలనొప్పికి సహజసిద్ధమైన ఔషధం నీరు. తలనొప్పి సాధారణంగా డీహైడ్రేషన్ వల్లే వస్తుంది.



అతడు-ఆమె



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

అమ్మా, నేనూ నవ్వుపట్టలేకపోయాం. "నేను యెప్పుడేనా చేరితే, కాంగ్రెసు సోషలిస్టుల్లో చేరతానేమో!" అన్నా. "సరి! యేలేశ్వరం వెళ్ళినా శనేశ్వరం పోలేదన్నట్టుంది. ఆ సోషలిస్టుకూడా ఎందుకు? కాంగ్రెస్సే చాలు - అన్నింటికీ కన్నతల్లి!" అన్నారు సహం నవ్వుతూ, సహం కోపంగానూ.

"నాకింకా యెన్నో పుస్తకాలు చదవాలని వుంది నాన్నా! అవన్నీ చదివాక యేదో ఒకటి నిశ్చయిస్తా. నేను సీమనుంచి తెచ్చిన పుస్తకాలు పుస్తకాల్లాగే వున్నాయి!" అన్నా. "ఆ చెత్తంతా అలాగే ఉంచేయి. వాటిని చదివి బుర్ర పాడుచేసుకోకు. నా లండన్ స్కూలు ఆఫ్ ఎకనామిక్సు పుస్తకాలు లాస్కీ వెల్సు, బెర్నార్డుషా వెల్సు, గ్రహం, వాల్లేసు, హెన్రీ జార్జీ, సామ్యుయల్, బట్లరు బోలెడున్నాయి. మీ అమ్మదగ్గిర గాంధీ సారస్వతం బీరువానిండా బీరువాడుంది.

(నిన్నటి సంచిక తరువాయి)

నీ ఇష్టం వచ్చిన పుస్తకం చదువుకో, నాకేం అభ్యంతరం లేదు. పుస్తకం చదివే ముందు మాత్రం నన్నడుగు. మంచి పుస్తకం అయితే నేనే తీసియిస్తాను - నీ స్వేచ్ఛకేం అడ్డులేదు" అన్నారు నాన్న. "నాన్నా! సోవియట్ కమ్యూనిజం మీద వెబ్బు కొత్తపుస్తకం రాశారటకదా- నాకది కొనిపెట్టరూ?" అని అడిగా. "వాళ్ళు అవసానదశలో రాశారు ఆ పుస్తకాన్ని. అంచేత చిన్నపిల్లలు చదవదగ్గ పుస్తకంకాదు. చిన్నపిల్ల లేమిటి, పెద్దవాళ్ళు కూడాను. నేనూ చదవలేదు. అది చదవదగ్గది కాదు. వాళ్ళింకా లక్షా తొంభై పుస్తకాలు రాశారు. అవేవి చదివినా ఫరవాలేదు!" అన్నారు. మధ్యాహ్నమే మౌంటురోడ్డు వెళ్ళి ఆ పుస్తకం కొనుక్కొద్దాం అనుకున్నా మనసులో.

"అవునుగానీ శాంతం! అమృతరావు అని కొత్త డ్రైవరుని పెట్టావు స్టుడిబేకరు కారుకి.వాడెవడో, వాడి పుట్టుపూర్వోత్తరాలేమిటో దర్యాప్తు చేసే పెట్టావా? సరికొత్తకారుకూడాను! మొన్న వాడిచేతిలో తెలుగు పత్రికేదో చవకబారు పత్రిక చూచినట్టుంది. ఏమిట్రా ఆ పత్రిక అని అడుగుదాం అనుకున్నాను. కాని వాడు తిరగబడతాడేమో అని భయంవేసి అడగలేదు. కొంపతీసి దండకారణ్యంలో మాయలేడిలాగు అజ్ఞాతవాసంలో వున్న కమ్యూనిస్టు కాదుగదా!" అన్నారు నాన్న అదుర్దాగాను.

"అతను తెలుగువాడు కాదు. తంజావూర్ మహారాష్ట్రుడు నాన్నా!" అన్నాను.

"చంపేశావు - మహారాష్ట్రుడవుతే వాడు చదువుతూంది 'కాంతి' పత్రికే అయివుంటుంది. శాంతం! నువ్వు అడ్డమైనవాళ్ళని తీసుకొచ్చి నౌకరీలో పెడతావు. మొగాణ్ణి నేనంటూ వున్నానుగా - నాతో చెప్పకూడదూ? ఏం తొందర ఏ మిల్లు మజ్దూరో!" నాన్న చిందులు తొక్కుతూ అరిచారు.

"శాస్త్రీ! అతని ముఖంమీద రాసి వుంటుందటోయ్ కమ్యూనిస్టు అని? అడుగుతే మాత్రం చెబుతాడా? లైసెన్సుచూశాను. మచ్చలేకుండా అద్దంలాగుంది. కొత్తకారుని అతి జాగ్రత్తగా నడుపుతున్నాడు. ఏదేనా అడుగుతే మర్యాదగా ఇంగ్లీషులో జవాబు చెబుతాడు. అడగకపోతే ఏ విషయంలోనూ అనవసరంగా జోక్యం కలుగజేసుకోడు" అంది ఉత్సాహంగాను.

"అదిగో-దానివల్లే తెలుస్తుంది వాడు కమ్యూనిస్టు అని. అతివినయం ధూర్తలక్షణం అన్నారు. ఆ నక్క వినయాలూ వాడున్నూ. పిశాచాలు వేదాలు వల్లిస్తాయట. మనం కాంగ్రెసువాళ్ళమికదా - ఇలాంటి రౌడీల గురించి యెంత జాగ్రత్తగా వుండాలి! మనం మాట్లాడుకునేదల్లా ఇహ పోలీసువాళ్ళ దగ్గరికి జారేస్తాడు" అన్నారు నాన్న చికాకు పడిపోతూ.

"కమ్యూనిస్టు అవుతే వజ్రాల తమ్మెట్లు పెట్టుకుంటాట్ట నాన్నా?" అన్నాను నేను నవ్వుతూనూ. "అబద్ధపు పెళ్ళికి యేదో వాయిద్యం అన్నట్టు అవి దొంగసొత్తో మాయవజ్రాలో నీకేం తెలుసు? కమ్యూనిస్టుల కేమిటి? తమ్మెట్లూ పెట్టుకుంటారు. జంద్యమూ వేసుకుంటారు. అవసరమైతే బోడిగుండూ చేయించుకుంటారు. వాళ్ళ మతం అలాంటిది!" అన్నారు నన్ను చివాట్లు పెడుతూ...

ఈ ధోరణిలోంచి మళ్ళించుదాం అని "నాన్నా! కమ్యూనిస్టుల మీద ఆంక్షని తీసేస్తున్నారటగా గవర్నమెంటు?" అన్నా.

"అవునే. సి.ఐ.డి. కమీషనరు శివరాజన్ నాతో రహస్యంగా



చెప్పాడే. పోలీసువాళ్ళని మాత్రం యెవడు నమ్మమన్నాడే? శాంతం కొంప ముంచి కమ్యూనిస్టు మెంబర్లు పదిహేనుమందీ అలహాబాద్ ఏ.ఐ.సి. కమీషనరు శివరాజన్ నాతో రహస్యంగా చెప్పాడే. పోలీసువాళ్ళని మాత్రం యెవడు నమ్మమన్నాడే? శాంతం! కొంప ముంచి కమ్యూనిస్టు మెంబర్లు పదిహేనుమందీ అలహాబాద్ ఏ.ఐ.సిసి: సమావేశానికి తయారవుతారా యేమిటి తగుదునమ్మా వాయనానికని!" అన్నారు గాభరాగా నాన్న. కాస్త ఆలోచించి "అయినా వీళ్ళంటే గవర్నమెంటుకి భయమేనే. అందుచేత కీడెంచి మేలించమన్నారు. అంత తెలివి తక్కువపని చెయ్యకూడదు గవర్నమెంటు మరి!" అని ధైర్యం తెచ్చుకున్నారు. మళ్ళీ."వాళ్ళొస్తే మీ లెజిస్లేచరు పార్టీ తీర్మానానికే చేతులెత్తుతారుగా! వాళ్ళు అలహాబాదు వెళ్ళేది లేనిదీ అమృతరావుని అడుగుతాలెండి" అన్నా.

"నాన్న కుర్చీలోంచి చెంగునలేచి గుమ్మానికడ్డంగా నిలబడి "అదిగో నువ్వు మాత్రం ఆ తెలివితక్కువ పని చెయ్యకు? నేనే అడుగుతా, నాకేం భయమా, నన్నేం మింగేస్తాడా? వాడిని అడిగితేనే తెలిసిపోతుంది" అన్నారు హడావిడిగా.

"అతన్ని పిలుద్దునా - నాన్నా?" అని అడిగా.

"నేను శివరాజన్ని అడుగుతాన్లే - వీడిని కాదే" అన్నారు నాన్న, నేను అమృతరావుని యెక్కడ పిలిచేస్తానో అని. అమ్మా నేను నవ్వలేక నవ్వలేక చచ్చాం! నాన్నకి మా నవ్వు చూచి కోపం వచ్చింది. ప్రసంగ ధోరణి మార్చేద్దాం అని నేనన్నాను.

"నాన్నా! అలహాబాదు సమావేశానికి అమ్మకి టిక్కట్టు కొని రైలులో స్థలం ఖాయం చేశారా?"

"ఆ నేనుకూడా వెళ్లుతున్నాను. ఇద్దరికి ఫస్టుక్లాసు అప్పుడే తీసుకున్నా. మా తీర్మానానికి వోట్లు సంపాదించాలి. ఇక్కడ ఇటు బుర్ర వూపినవాళ్ళు అక్కడ ఆ అజాదుచూసి అటు బుర్రవూపితే కష్టం!" అన్నారు నాన్న.

"మీ తీర్మానం ఎలాగో వీగిపోతుందనుకోండి! అప్పుడు రాజాజీ కాంగ్రెసులోంచి వెళ్ళిపోవడం ఖాయం. మరి మీరుకూడా కాంగ్రెసుకి రాజీనామా ఇచ్చేస్తారా?"అని అడిగా.

"ఐతంపూడి ఉద్యోగం. ఐతే, గియితే - ఈ ప్రశ్నలన్నీ నీ కెందుకే సుబ్బడూ! మనిషిని యిరుకునపెట్టే ప్రశ్నల్ని వేస్తావు నువ్వు. పాడు అలవాటు!" అన్నారు నాన్న కోపంతో.

"శాస్త్రీ! నేనూ అదే అడగాలనుకుంటుండగా, అమ్మాయే అడిగింది" అంది అమ్మ నన్ను వెనకేసుకొస్తూ.

"నేను మాత్రం కాంగ్రెసునుంచి బైటికి రాను సుమా - శాంతం! ఆంధ్రులం మనం కాంగ్రెసునే నమ్ముకుని వుండాలి. రేప్పొద్దున్న సంయుక్త మంత్రివర్గం వచ్చినా - ఆంధ్రరాష్ట్రం వచ్చినా - మన మంత్రి స్థానం మనకి ఖాయంగా వుండిపోతుంది. ఒకరిని నమ్ముకుని మనమేం బాగుపడతాం అంటా?" అన్నారు నాన్న.

"శాస్త్రీ! ఇన్నాళ్ళు నీతో కాపురం చేశాను కాని - నీ అపరచాణక్యం చూసి నవ్వాలో - యేడవాలో తెలియకుండా వుందోయ్!" అంది అమ్మ కొంచం విసుక్కుంటూ.

"ఏమిటీ శాంతం, కుర్రదాని యెదుట ఆ మాటలు. సరే. అది ఏలాగూ వింటిలే. నువ్వు చూసి ఏడవావొద్దు - నవ్వావొద్దు. ఎప్పటిలాగానే ప్రేమించు నన్ను!"అన్నాడు నాన్న అమ్మను బుజ్జగిస్తూ. "అవునుగాని - శాంతం! అలహాబాదు యెలాగూ వెళుతున్నాం,. గయ కూడా వెళ్ళి గయావర్జనం చేసేస్తే తీరిపోతుంది. ఏటా యీ తద్దినాలు పెట్టలేక మన తద్దినాలు దగ్గిరకొస్తున్నాయి!" అన్నారు.

"గయావర్జనం యెందుకు? ఏకంగా బ్రహ్మకపాళమే వెళ్ళి అక్కడ ఘటాశ్రాద్ధం పెడతాను అన్నావు కావు - మన తద్దినాలు కలిసొస్తాయని!" అంది అమ్మ మహాకోపంతో, నాన్న చాదస్తానికి.

"ఈ రాజకీయ తంత్రాగం చూస్తే - వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిలుకి మనకే పిలుపు రాకూడదూ? ఈ వున్నవాళ్ళకంటే మనమేం తీసిపోయామా? వాళ్ళకే ఖాయమా? అప్పుడు ఢిల్లీ నుంచి రాజవైభవంతో ఏటా బ్రహ్మకపాళం వెళ్ళొచ్చు- దర్జాగా! సరే, ఆ మాటంటే నువ్వు మరీ విరుచుకుపడతావు. మాటవరసకి అన్నాననుకో!" అన్నారు నాన్న వెర్రిగా నవ్వుతూ - మిడతంభొట్లులా చేతికి చిక్కిపోయానే అని నోరు కరుచుకుంటూ.

అమ్మేదో ఘాటుగా అనబోతోంది. ఇంతలో పాపాయి మేడమీదికి వచ్చి -

"శుభక్కా! నీకోసం ఎవరో టెలిఫోనులో పిలుస్తున్నారే!" అంది. "ఎవరో అడగలేదే పాపాయీ?" అన్నారు నాన్న.

"నే నడగలేదే - నాన్నా!" అంది పాపాయి. "ఎందుకేనా మంచిది - ఎప్పుడూ ఎవరు టెలిఫోనులో పిలుస్తున్నారో అడిగి తెలుసుకోవాలి - అమ్మాయీ! ఈమాటు మర్చిపోకేం!" అన్నారు నాన్న. నేను నవ్వుకుంటూ కింద కెళ్ళిపోయాను.

8 అతడు

శుభ వచ్చినరోజు నేను స్టేషనుకి వెళ్ళలేదు. అన్నీ అలా వచ్చాయి. ఆనాడు. ఏంచెయ్యనూ? ఆదివారం వస్తున్నానని మొదటి టెలిఫోను చేసింది. ఆ వేళ సెంట్రలు స్టేషనుకి వెళితే రాలేదు. వాళ్ళ వాళ్ళెవ్వరూ రాలేదు. స్టేషనునుంచి నేను కచేరీకి వెళ్ళిపోయి, కొత్త రైల్వే లైను గొడవల్లో పడిపోయాను. ఢిల్లీనుంచి 'వార్ డిపార్టుమెంటు' తాలూకు మిలిటరీ ఇంజనీర్లు వస్తే వాళ్ళ తో సరిపోయింది రోజంతా. సోమవారం, మంగళవారం, బుధవారం - అవసరం అయితే గురువారంకూడా - వాళ్ళతో ఆరం బాకం, ఉప్పుగల్లీలు, గుమ్మడిపూడి వెళ్ళి - స్థలం తనిఖీచేసి - అఖరి ఏర్పాట్లు నిశ్చయం చేసి కంట్రాక్టర్లకి పని ఒప్పజెప్పేద్దాం అనుకున్నాం. వాళ్ళతో సమావేశంలో వున్నాను. శుభ దగ్గిర నుంచి ట్రంకు టెలిఫోను - బుధవారం వస్తున్నాను - రైలుకు రమ్మని. జవాబు యేం చెప్పేది? తెలుగున మాట్లాడితే - నేను రాగలనో - రాలేనో అని తర్జన భర్జన వీళ్ళముందర ఎందుకు- అని ఇంగ్లీషునే - 'సరే -సరే' అనేసి టెలిఫోను పెట్టేశాను.

మధ్యాహ్నానికి అసలు కంట్రాక్టరు. పెద్దదొర మేనల్లుడు డిక్సమా వాడి టెక్నికల్ సెక్రటరీ ఎడిసన్నూ, గులాబ్ చందు గారూ - నలుగురూ వచ్చి చిన్న కంట్రాక్టర్లూ - అందరూ పోగయ్యారు.

- ఇంకా వుంది.

యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)- 2018



యూనివర్సిటీలు, కాలేజీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో పరిశోధనలకు ఔత్సాహిక అభ్యర్థులను ఎంపిక చేసే పరీక్ష యూజీసీ నెట్. ఈ పరీక్షలో మెరిట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా నెలకు రూ.33 వేల ఫెలోషిప్‌ను అందుకుంటూ పరిశోధనలు చేసే మహదవకాశాన్ని పొందవచ్చు. అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు కూడా పోటీపడవచ్చు. 2018, జూలైకి సంబంధించి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)కు నోటిఫికేషన్ వెలువడింది. కొత్త పరీక్ష విధానంతో, కొన్ని కీలక మార్పుల అనంతరం వచ్చిన ప్రకటన ఇది. ఈ నేపథ్యంలో నెట్ నోటిఫికేషన్ వివరాలు, పరీక్షకు సన్నద్ధానికి సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

కనీస మార్కులు తప్పనిసరి

పేపర్ 1,2లో కలిపి కనీసం 40 శాతం, రిజర్వేషన్ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు పొందాలి. ఈ రెండు పేపర్లలో పొందిన మార్కుల ఆధారంగా... పరీక్షకు హాజరైనవారిలో టాప్ 6 శాతం మందికి (కేటగిరీల వారీగా) అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత లభిస్తుంది. అత్యంత ప్రతిభావంతులను జేఆర్ఎఫ్‌కు ఎంపిక చేస్తారు.

ఇకనుంచి రెండు పేపర్లు మాత్రమే

యూజీసీ నెట్‌ను గతంలో మూడు పేపర్లలో నిర్వహించేవారు. తాజా నోటిఫికేషన్ నుంచి రెండు పేపర్లలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ రెండు పేపర్లూ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండు పేపర్లు.

- పేపర్-1 అన్ని సబ్జెక్టుల అభ్యర్థులకు ఒకటే. గతంలో ఈ పేపర్‌కు సంబంధించి 10 ప్రశ్నలను వదులుకునే వెసులుబాటు ఉండేది. కానీ, ఇప్పుడు ఎలాంటి ఆప్షన్లు (ఐచ్ఛికాలు) లేవు. 50 ప్రశ్నలకు తప్పనిసరిగా సమాధానాలు ఇవ్వాలి. ఈ పేపర్‌లో అభ్యర్థి రీసెర్చ్/ టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, కాంప్రెహెన్షన్‌లను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. పేపర్-2 అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుపైనే ఉంటుంది. గతంలో పేపర్-2, 3 ఉండేవి. పేపర్-2లో 50 ప్రశ్నలు, పేపర్-3లో 75 ప్రశ్నలు అడిగేవారు. ఇప్పుడు వీటిని 100 ప్రశ్నలకు కుదించారు.

పేపర్	ప్రశ్నలు	మార్కులు	సమయం
పేపర్-1	50	100	గంట
పేపర్-2	100	200	2 గంటలు

ప్రయోజనాలు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత లభిస్తుంది. ప్రతిష్ఠాత్మక రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశానికి వీలుంటుంది. జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.33 వేలు ఫెలోషిప్ లభిస్తుంది. ఎలిజిబిలిటీ ఫర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణులకు రాష్ట్రస్థాయి వర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంలో ప్రాధాన్యముంటుంది. వివిధ పీఎస్‌యూలు ఆర్ అండ్ డీ, మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, హెచ్ ఆర్, ఫైనాన్స్ తదితర విభాగాల్లో నియామకాలకు యూజీసీ నెట్ ఉత్తీర్ణులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

అర్హతలు

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మొత్తం 100 సబ్జెక్టుల్లో యూజీసీ నెట్ నిర్వహిస్తుంది. హ్యూమానిటీస్ (భాషలు సహా), సోషల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్ సైన్స్ తదితర వివిధ విభాగాల్లోని సబ్జెక్టులకు ఈ అర్హత పరీక్ష ఉంటుంది. ఆయా సబ్జెక్టుల్లో పీజీ లేదా తత్సమాన స్థాయిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 5 శాతం సడలింపు ఉంటుంది. ఫైనలియర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయోపరిమితి

2018 జూలై ఒకటో తేదీ నాటికి 30 ఏళ్లలోపు వయసున్న వారు జేఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓబీసీ (నాన్-క్రీమీ లేయర్), ఎస్సీ/ ఎస్టీ/పీడబ్ల్యూడీ తదితర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు ఉంటుంది. ఎల్ఎల్ఎం అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత కోసం గరిష్ట వయోపరిమితి లేదు.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం :** 2018 మార్చి 5.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ :** 2018, ఏప్రిల్ 5.
- **ఈ చలాన్/ డెబిట్ కార్డ్ / క్రెడిట్ కార్డ్ ద్వారా ఫీజు చెల్లింపు చివరి తేదీ :** 2018 ఏప్రిల్ 6.
- **దరఖాస్తు రుసుం :** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఓబీసీలకు రూ.500.

ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు రూ.250.

- **పరీక్ష తేదీ :** 2018 జులై 8.
- **వెబ్‌సైట్ :** cbsenet.nic.in

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్‌లో పీహెచ్‌డీ



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ).. 2018కి గాను ఎకనమిక్స్ అండ్ ట్రేడ్ పాలసీ, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజీ, ఐటీ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ ఆపరేషన్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ (ఫుల్ టైమ్/పార్ట్ టైమ్) ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

అర్హతలు : సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం (ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ/ దివ్యాంగ-50శాతం) మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ ఎంఫిల్/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ : ఏప్రిల్ 27, 2018.

దరఖాస్తు రుసుం : రూ.2,500 (ఎస్సీ/ ఎస్టీ- రూ.1,250)

వెబ్‌సైట్ : http://tedu.iift.ac.in/iift/index.php

సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ -2018



దేశవ్యాప్తంగా ఉన్న 10 కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు బెంగళూరులోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ (బీఏఎస్ఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూ సెట్-2018)కు ప్రకటన విడుదలైంది. దీన్ని హర్యానా, జమ్మూ, జార్ఖండ్, కర్ణాటక, కశ్మీర్, కేరళ, పంజాబ్, రాజస్థాన్, సౌత్ బిహార్, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు బెంగళూరులోని బీఏఎస్ఈ సంయుక్తంగా విడుదల చేశాయి.

కోర్సులు : డిగ్రీ, పీజీ, రీసెర్చ్ ప్రోగ్రామ్స్.

అర్హతలు : సంబంధిత కోర్సులను అనుసరించి ఇంటర్/ డిగ్రీ/ పీజీ.

ఎంపిక : ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (సీయూ సెట్-2018).

దరఖాస్తు రుసుం : జనరల్/ ఓబీసీ-రూ.800; ఎస్సీ/ఎస్టీ-రూ.350; దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 26, 2018.

వెబ్‌సైట్ : www.cucetexam.in

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో యూజీ-2018 ప్రవేశాలు



ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- హైదరాబాద్.. 2018-19 సంవత్సరానికి బీటెక్ ప్రోగ్రామ్ ప్రవేశ ప్రక్రియ ప్రారంభించింది. ఈ ఏడాది ప్రవేశ ప్రక్రియలో కొన్ని మార్పులు చేసింది. నాలుగు విధానాల్లో విద్యార్థులను ఎంపిక చేయనుంది.

వివరాలు..

జేఈఈ విధానం : జేఈఈ మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా బీటెక్ (ఈసీఈ), బీటెక్ (సీఎస్ఈ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కల్పించనుంది.

యూజీఈఈ : రీసెర్చ ఆధారిత డ్యూయల్ డిగ్రీ ఔత్సాహికుల కోసం అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. ఇందులో ఉత్తీర్ణులకు ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితా రూపొందిస్తుంది. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఇన్ఫర్మాటిక్స్, సైన్స్ ఒలింపియాడ్/ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్, పానినియన్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్‌లలో ఏదో ఒక ఒలింపియాడ్‌లో పాల్గొన్న విద్యార్థులు.. నేరుగా డ్యూయల్ డిగ్రీ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి ఎలాంటి రాత పరీక్ష ఉండదు. కానీ, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కొత్తగా ఎస్‌సీపీ : ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లలో ఈ ఏడాది కొత్తగా అమలు చేస్తున్న విధానం.. స్పెషల్ ఛానెల్ ఆఫ్ అడ్మిషన్. ఉడాన్ పథకంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, అదే విధంగా ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు చదువుతూ రెండో ఏడాది పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉద్దేశించి ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్‌సీపీ ద్వారా 20 సీట్ల వరకు అందుబాటులో ఉంటాయి. ఇందుకోసం రాత పరీక్ష, తర్వాత ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

డీఏఎస్ఏ : డైరెక్ట్ అడ్మిషన్ ఫర్ స్టూడెంట్స్ అబ్రాడ్. ఈ విధానంలో ప్రవాస భారతీయ విద్యార్థులు, విదేశాల్లో నివసిస్తున్న భారత సంతతి విద్యార్థులకు నేరుగా ప్రవేశం కల్పిస్తారు. అయితే వీరు శాట్‌లో నిర్దేశిత స్కోర్ సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య తేదీలు..

యూజీఈఈ, ఎస్‌సీపీ దరఖాస్తు : ఫిబ్రవరి 5, 2018- మార్చి 15, 2018.

యూజీఈఈ, ఎస్‌సీపీ అభ్యర్థులకు పరీక్ష తేదీ : ఏప్రిల్ 18, 2018

ఫలితాల వెల్లడి : మే మొదటి వారం.

ఇంటర్వ్యూ : జూన్ మొదటి వారం.

జేఈఈ ఉత్తీర్ణులకు దరఖాస్తుల లభ్యత : ఏప్రిల్ మొదటి వారం.

డీఏఎస్ఏ విద్యార్థులకు దరఖాస్తుల లభ్యత : మార్చి మొదటి వారం.

వెబ్‌సైట్:www.iiit.ac.in/admissions/undergraduate



టీజీ గురుకుల్ సెట్-2018

'పీజీ టు కేజీ మిషన్'లో భాగంలో తెలంగాణ ప్రభుత్వం వివిధ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2018-19 సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశాలకు 'టీజీ గురుకుల్ సెట్-2018' ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు : ఐదో తరగతి.

మాధ్యమం : ఆంగ్లం.

ప్రవేశం కల్పించే పాఠశాలలు : ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ.

అర్హతలు : ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. అలాగే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం.. పట్టణాల్లో నివసిస్తున్నట్లయితే రూ.2,00,000; పల్లెల్లో నివసిస్తున్నట్లయితే రూ.1,50,000కు మించరాదు.

వయసు : 2018, సెప్టెంబర్ 1 నాటికి 9-11 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు గరిష్ఠ వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక : ప్రవేశ పరీక్ష (టీజీ గురుకుల్ సెట్-2018) ద్వారా.

దరఖాస్తు రుసుం : రూ.50.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 16, 2018.

వెబ్‌సైట్ : tgcet.cgg.gov.in

ఏపీ పాలీసెట్-2018



ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2018-19కి గాను డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ ఏపీ-పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2018(ఏపీ పాలీసెట్-2018) ప్రకటన వెలువడింది.

అర్హతలు : పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు అర్హులు. తుది పరీక్షలు రాయబోయే విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ ప్రారంభ తేదీ : మార్చి 19, 2018 నుంచి..

వెబ్‌సైట్ : polycetap.nic.in/Default.aspx

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీలో ప్రవేశాలు

ఛత్తీస్‌గఢ్‌లోని రాంచీలో ఉన్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ... పీజీ డిగ్రీ/ డిప్లొమా, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు -సీట్లు : డిప్లొమా (సైకియాట్రిక్ నర్సింగ్)-15; ఎంఫిల్ (క్లినికల్ సైకాలజీ) -12; ఎంఫిల్ (సైకియాట్రిక్ సోషల్ వర్క్)-12; పీహెచ్‌డీ (క్లినికల్ సైకాలజీ)-4.

స్కాలర్‌షిప్ : ఇందులో ఎంఫిల్, పీహెచ్‌డీకి నెలకు రూ.8,000; డిప్లొమాకు నెలకు రూ.2,500 స్కాలర్‌షిప్ ఇస్తారు.

అర్హతలు : పీహెచ్‌డీకి ఎంఫిల్ (మెడికల్ అండ్ సోషల్ సైకాలజీ /క్లినికల్ సైకాలజీ); ఎంఫిల్ (క్లినికల్ సైకాలజీ)కి ఎంఏ/ ఎంఎస్సీ (సైకాలజీ) ; ఎంఫిల్ (సైకియాట్రిక్ సోషల్ వర్క్)కు ఎంఏ (సోషియాలజీ/ మాస్టర్ ఇన్ సోషల్ వర్క్ ; డిప్లొమా (సైకియాట్రీ నర్సింగ్)కు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో 'ఎ' గ్రేడ్ సర్టిఫికెట్/ డిప్లొమా.

ఎంపిక : పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ప్రాక్టికల్ టెస్ట్ ; డిప్లొమా కోర్సుకు ఇంటర్వ్యూ.

దరఖాస్తు రుసుం : అన్‌రిజర్వ్‌డ్/ఓబీసీ- రూ.400; ఎస్సీ/ ఎస్టీ-రూ.300.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి 15, 2018.

హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : మార్చి 20, 2018.

వెబ్‌సైట్ : www.cipranchi.nic.in

ఏపీ గురుకుల పాఠశాల సెట్-2018



ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ సాంఘిక, గిరిజన, వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో 2018-19కి గానూ ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతూ ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీటీపీసీఈటీ)-2018 నోటిఫికేషన్ వెలువడింది.

అర్హతలు : ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం (2017-18)లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 20, 2018.

ప్రవేశ పరీక్ష : ఏప్రిల్ 8, 2018

వెబ్‌సైట్ : apgpcet.apcfss.in

విశాలాంధ్ర బిజినెస్

-162.35 ▼	-61.45 ▼	-200 ▼	బంగారం (విశాఖపట్నం)	-300 ▼	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	29,010	వెండి (విజయవాడ)	41,700	రూపాయి
34,184.04	10,492.85	29,100	ప్రొద్దుటూరు 29,010	39,500	ప్రొద్దుటూరు 41,483	65.18
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఇన్ఫోసిస్	1,174.25	2.26
ఏషియన్ పెయింట్స్	1,118.85	0.78
హీరో మోటార్‌కార్ప్	3,600.55	0.35
ఎస్‌బీఐ	270.40	0.35
రిలయన్స్	954.90	0.26

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
హెచ్‌యుఎల్	1,316.35	-2.02
ఐసీఐసీఐ బ్యాంక్	313.50	-1.92
సన్‌ఫార్మా	535.35	-1.75
యాక్సిస్ బ్యాంక్	535.90	-1.47
ఎస్ బ్యాంక్	325.00	-1.47

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.87	65.18
యూరో	79.91	79.59
పౌండ్	90.45	89.99
ఆస్ట్రేలియా డాలర్	50.85	50.91
సింగపూర్ డాలర్	49.18	49.27

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,010	31,026
చెన్నై	29,080	31,101
బెంగళూరు	28,500	30,481
ముంబై	30,020	32,106
విజయవాడ	29,100	31,500
విశాఖపట్నం	29,010	31,674
ప్రొద్దుటూరు	29,010	30,460

ముడి చమురు	66.63



స్వల్పంగా తగ్గిన

పసిడి, వెండి ధరలు

ముంబై: అంతర్జాతీయంగా డిమాండ్ లేకపోవడం.. స్థానిక నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు తగ్గడంతో బంగారం ధర లకు తగ్గుముఖం చూస్తున్నాయి.. వరుసగా నాలుగు సెషన్లలో పెరుగుతూ వస్తున్న పసిడి.. బుధవారం ఒక్క రోజే రూ.460 తగ్గింది. గురువారం కూడా బంగారం 10 గ్రాములు రూ.30 తగ్గి రూ. 31,360గా ఉంది. వెండి కూడా బంగారం బాట లోనే పయనించింది. కేజీ వెండి ధర రూ.90 తగ్గి రూ. 39,210గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి ధర 0.30 శాతం మేర పడిపోయింది. సింగపూర్‌లో ఔన్సు బంగా రం 1,313.80అమెరికన్ డాలర్లు పలికింది. అటు ఔన్సు వెండి కూడా 0.34శాతం తగ్గి 16.33 అమెరికన్ డాలర్లు పలికింది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు తగ్గడంతో దేశీయ బులియన్ మార్కెట్‌పైనా ఆ ప్రభావం పడిందని ట్రేడ ర్లు చెబుతున్నారు. అంతేగాక పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులు, స్థానిక నగల వ్యాపారుల నుంచి కూడా డిమాండ్ లేకపోవడం ఇందుకు కారణమని భావిస్తున్నారు.

తృణధాన్యాల ఉత్పత్తిలో రికార్డు

న్యూఢిల్లీ: తృణధాన్యాల ఉత్పత్తిలో భారత్ రికార్డు సృష్టిం చింది. 2017-2018 ఆర్థిక సంవత్సరానికి తృణ ధాన్యాల ఉత్పత్తిలో 277.49 మిలియన్ టన్నులు ఉత్పత్తిచేసిందని వ్యవసాయ శాఖ మంత్రివర్గం వెల్లడించింది. గత ఏడాదికన్నా ఇది 0.9శాతం అధికంగా నమోదైనట్లు తెలుస్తోంది. కాటన్ ఉత్పత్తి 33.2 మిలి యన్ టనున్నలు, రైస్ 111 మిలియన్ టనున్నలు, తృణధా న్యాల ఉత్పత్తి 23.9 మిలియన్ టన్నులు, గ్రెయిన్స్ 45.4 మిలియన్ టన్నులుగా ఉంది. తృణధాన్యాల అధికరాబడితో రైతులు మరింత ఆశగా వ్యవసాయంవైపు మొగ్గుచూపవలసిన అవసరం ఉందని మాజీ వ్యవసాయ శాఖ సహాయ మంత్రి సిరాజ్ హుస్సేన్ వెల్లడించారు.

నీరవ్ అమెరికా కంపెనీకి మంచి డిమాండ్

ఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ మోసానికి పాల్పడిన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ అమెరికాలోని తన కంపెనీపై దివాలా పిటిషన్ వేశారు. అయితే ఆ కంపెనీని కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారట. అమెరికాలోని ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీ ఫిబ్రవరి 26న దివాలా పిటిషన్ దాఖలు చేసింది. పీఎన్‌బీలో నీరవ్, ఆయన మామ ఛోక్సీ కలిసి దాదాపు రూ.12వేల కోట్లకు పైగా మోసం చేశారని ఆరోపణలు వచ్చిన అనంతరం నీరవ్ అమెరి కాలోని తన ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీపై దివాలా పిటిషన్ వేశారు. భారత్‌లో ఫిబ్రవరి 14న ఈ మోసం వెలుగు చూడ గా, అమెరికాలో ఫిబ్రవరి 26న నీరవ్ దివాలా పిటిషన్ వేశారు. అమెరికాలోని ఫైర్‌స్టార్ డైమండ్ కంపెనీని కొనేం దుకు చాలా మంది ముందుకు వస్తున్నారని కోర్టు ఫైలింగ్స్‌లో తెలిపారు. నీరవ్, ఛోక్సీల భారీ మోసం నేపథ్యంలో భారత్‌లో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకర్ల అతి తెలివి

ఎగవేతదారులకే మళ్లీ రుణాలు

న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని.. కొందరు బ్యాంకర్ల అతితెలివి కోలుకోకుండా దెబ్బతీస్తున్నది. మొండి బకాయిల ఊబిలో పీకల్లోతు కూరుకుపోయిన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పరిస్థితైతే గొర్రె కసాయి వాడినే నమ్ముతుంది అన్నట్లుగా తయా రైంది. వరుస కుంభకోణాలు వెలుగుచూస్తున్న వేళ.. బ్యాంకుల అమాయకత్వాన్ని మోసగాళ్లు ఎలా క్యాష్ చేసు కున్నారో తెలుస్తుంటే నవ్వాలో.. ఏడ్వాలో తెలియని దుస్థితి. అవును.. ఓసారి అప్పు తీసుకుని ఎగ్గొట్టినవాడికే పాత బకాయిని తీర్చేందుకు కొత్తగా మళ్లీ రుణాన్ని మంజూరు చేసింది ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ). ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌కు చెందిన సింభౌలీ షుగర్స్ లిమిటెడ్‌కు 2011లో రూ.148.60 కోట్ల రుణాన్ని ఓబీసీ మంజూరు చేసింది. 5,762 మంది చెరకు రైతుల కోసం ఇచ్చిన ఈ రుణంలో ఎక్కువ మొత్తాన్ని సంస్థ పక్కదారి పట్టించింది. దీంతో రూ.97.85 కోట్ల వసూలు ప్రశ్నార్థకంగా మారగా, దీన్ని చెల్లించేందుకు మరో రూ.109.08 కోట్ల కార్పొరేట్ రుణాన్ని 2015 జనవరి 28న సదరు సంస్థకే బ్యాంక్ ఇవ్వడం గమనార్హం. ఈ రెండింటినీ సింభౌలీ ఎగ్గొట్టింది. ఈ క్రమంలో తొలి పద్దును 2015 మార్చి 31న మొండి బకాయిగా ప్రకటిం చిన ఓబీసీ.. ఇదే ఏడాది మే నెలలో రూ.97.85 కోట్ల మొండి బకాయి మోసాన్ని గుర్తించింది. పాత పెద్ద నోట్లు రద్దైన 20 రోజుల తర్వాత 2016 నవంబర్ 29న మలి విడత కార్పొరేట్ రుణాన్నీ నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ)గా ప్రకటించింది. రెండుసార్లు రుణాలు మంజూరు చేయడం, రెండో రుణం జారీ అయిన రెండు నెలల్లోపే తొలి రుణాన్ని మొండి బకాయిగా ప్రకటించడం వంటివి సింభౌ లితో బ్యాంక్ అధికారులు కుమ్మక్కై ఉంటారన్న అను మానాల్ని రేకెత్తిస్తున్నది. ఏదిఏమైనా ఓబీసీ అతితెలివి వికటించింది. పద్దు పుస్తకాల్లో పాత బకాయిలను చెరి పేసేందుకు కొత్త రుణాల్ని వాడుకుందామనుకున్న బ్యాంక్ అధికారులు బొక్కబోర్లాపడ్డారు.



2015లోనే సింభౌలీపై సీబీఐ కేసు

సింభౌలీ షుగర్స్.. తమ పాత మొండి బకాయిదారేనని ఓబీసీ స్పష్టం చేసింది. రూ.148.60 కోట్ల రుణానికి సంబంధించి జరిగిన మోసంలో 2015 సెప్టెంబర్ 3న సింభౌలీపై సీబీఐ తొలి కేసును నమోదు చేసిందని తెలి పింది. తాము అదే సంస్థకు ఇచ్చిన రూ.109.08 కోట్ల కార్పొరేట్ రుణం ఎగవేతపై 2017 నవంబర్ 17న మళ్లీ సీబీఐని ఆశ్రయించినట్లు సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు బ్యాంక్ వివరించింది. దర్యాప్తులో అంతర్భాగంగానే ఆదివారం తాజా కేసులు నమోదైనట్లు పేర్కొన్నది. పాత ఎన్‌పీఏకు సంబంధించిన వివరాల్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు తెలియపరిచామన్నది. కాగా, ఓబీసీకి దాదాపు రూ.210 కోట్ల నష్టం కలిగించారన్న దానిపై కొందరు బ్యాంక్ అధికారుల తోపాటు దేశంలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారాల్లో ఒకటైన సింభౌలీ షుగర్స్, దాని ఉన్నతాధికారులపై సీబీఐ కేసుల్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో భాగంగా హాపూ ర్‌తో పాటు నొయిడాల్లో ఒక్కొక్క చోట, ఢిల్లీలో ఆరు చోట్ల ఉన్న సంస్థ కార్యాలయాలు, అధికారుల ఇండ్లలో సీబీఐ సోదాలు కూడా నిర్వహించింది. సంస్థ సీఎండీ గుర్మిత్ సింగ్ మన్, డిప్యూటీ ఎండీ గుర్పాల్ సింగ్, సీఈవో జీఎస్‌సీ రావు, సీఎఫ్‌వో సంజయ్ తప్రియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుర్సిమ్రాన్ కౌర్ మన్‌సహా మరో ఐదుగురు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, బ్యాంక్ అధికారుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పెట్టింది. ఇందులో గుర్పాల్ సింగ్.. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ అల్లుడు కావడం గమనార్హం.

2014లోనే ద్వారకా దాస్ ఎగవేతదారు

ద్వారకా దాస్ సేఠ్ ఇంటర్నే షనల్‌పై 2014 జూన్ 30నే ఉద్దేశపూర్వక ఎగవేతదారు ముద్ర వేశామని ఓబీసీ వెల్లడించింది. దీని ఖాతాను 2014 మార్చి 31నే మొండి బకాయిగా ప్రకటించామన్నది. ఇప్పటికే ఈ సంస్థపై అటు సీబీఐకి ఫిర్యాదు చేశామని, ఇటు ఆర్బీఐకీ తెలియజే శామని తెలిపింది. ఢిల్లీకి చెందిన డైమండ్ జువెల్లరీ ఎగుమతిదారైన ద్వారకా దాస్ సేఠ్ ఇంటర్నేషనల్.. ఓబీసీలో రూ.389.85 కోట్ల మోసానికి పాల్పడిందన్న ఆరోపణల్ని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. 2007-12 మధ్య ఈ మొత్తం రుణాన్ని ఓబీసీ నుంచి ద్వారకా దాస్ అందుకున్నది. ఇదిలావుంటే ఈ కేసులో ద్వారకా దాస్ సేఠ్ ఇంటర్నేషనల్, దాని నలుగురు డైరెక్టర్లు సభ్య సేఠ్, రీటా సేఠ్, కృష్ణ కుమార్ సింగ్, రవి సింగ్‌లతోపాటు ద్వారకా దాస్ సేఠ్ సెజ్‌లపై సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

లుకౌట్ నోటీసులు

మరోవైపు ఈ కేసులో నిందితులపై సీబీఐ లుకౌట్ నోటీసులను జారీ చేసింది. నలుగురు డైరెక్టర్లు విదేశాలకు పారిపోకుండా దేశంలోని అన్ని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలను అప్రమత్తం చేసినట్లు అధికారులు సోమవారం తెలిపారు. వీరి రాకను అడ్డుకోవాలని, ఈ సమాచారాన్ని తమకు తెలియపరుచాలని సదరు నోటీసుల్లో అన్ని పోర్టులకు సందేశాలిచ్చినట్లు సీబీఐ స్పష్టం చేసింది.

వరుసగా మూడవరోజు...

• 137పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ • 10,500 దిగువన నమోదైన నిఫ్టీ



ముంబై: దేశీయ మార్కెట్లు వరుసగా మూడవరోజు నష్టాల బాట పట్టాయి. అమెరికా ఫెడరల్ వడ్డీరేట్లు పెంచుతామనే సంకేతాలి వ్వడంతో మదుపరులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో గురు వారం నాటి ట్రేడింగ్‌లో సూచీలు నష్టాలను చవిచూశాయి. జీడీపీ సానుకూల ప్రభావంతో ఉదయం లాభాలతో ట్రేడింగ్‌ను ఆరంభించినప్పటికీ.. అంతర్జాతీయ సంకేతాలతో మదుపర్లు అమ్మకాల వైపు మొగ్గు చూపడంతో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.ఫలితంగా ఆరంభలో లాభాలను కోల్పోయాయి. చాలా సేపు ఊగిసలాడిన సూచీలు చివరకు నష్టాలను మూటగట్టుకున్నాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 137 పాయింట్లు దిగజారి 34,047 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 34 పాయింట్లు కోల్పోయి 10,458 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.65.20గా కొనసాగుతోంది. ఐసిఐసిఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బీఐ నష్టాల్లో మునిగాయి. ప్రధానంగా పిఎస్‌యు బ్యాంకింగ్ 35 అంతర్జాతీయ బ్రాంచీలను మూసివేయమని ప్రకటించడంపై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎన్ఎస్ఈలో భారత్ పెట్రోలియం, కోల్‌ఇండియా, అరబిందో ఫార్మా, ఇండస్ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడగా.. ఐసీఐసీఐ బ్యాంక్, వేదాంతా లిమిటెడ్, జీ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్‌బీఐ, హిందాల్కో షేర్లు నష్టపోయాయి. ఈక్విటీ మార్కెట్లు, ఫారెక్స్,కమాడిటీ మార్కెట్ శుక్రవారం హోలీ సందర్భంగా సెలవు ప్రకటించాయి. సెక్టరల్ సూచీల్లో నిఫ్టీ పిఎస్‌యు బ్యాంక్ ఇండెక్స్ 1.87శాతం నష్టపోయింది. ఇండియన్ బ్యాంకు, కెనరాబ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు నష్టాల్లో నమోదయ్యాయి. దేశీయ మార్కెట్‌లో అక్టోబరు-డిసెంబర్ మాసానికి సంబంధించి 7.2శాతంతో ఆర్థికవృద్ధి నమోదుచేసింది. అంతర్జాతీయ మార్కెట్‌ల ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిసాయి. వాల్ స్ట్రీట్ రెండేళ్ల కనిష్టానికి దిగజారింది. జపాన్ నిక్కీ 0.85శాతం దిగజారింది.

సైన్స్ ఒలింపియాడ్‌లో

శ్రీచైతన్య విజయభేరి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం-హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ముంబై సంయుక్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్, ఇండియన్ నేషనల్ ఆస్ట్రానమీ ఒలింపి యాడ్‌లో శ్రీచైతన్య స్కూల్ ఘన విజయాన్ని సాధించింది. తెలుగు రాష్ట్రాల నుంచి అత్యధికంగా ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డా.బీఎస్ రావు తెలిపారు.

ఐదేళ్లుగా ముంబై క్యాంపుకు ఒక్క శ్రీచైతన్య స్కూల్ నుంచే 45 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, అంతర్జాతీయ స్థాయిలో 6 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించారని చెప్పారు. అకడమిక్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ తాము రూపొందించిన ప్రత్యేక సి-బ్యాచ్, సి-ఐపీఎల్ ప్రోగ్రామ్‌ల వల్లే ఈ విజయ భేరి సాధ్యమైందన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

చందమామపై తొలి 4జీ నెట్‌వర్క్

బెర్లిన్: కంప్యూటర్ యుగంలో టెక్నాలజీని ఎన్నో ప్రాంతాల్లో... ఎన్నో రకాలుగా విని యోగిస్తున్నాం. ముఖ్యంగా కమ్యూని కేషన్ వ్యవస్థలో ప్రతిఏడాది కొత్త తరం టెక్నా లజీని అందిపుచ్చుకొని జెట్ వేగం తో దూసు కెళ్తున్నాం. ప్రతి దేశంలోని ప్రముఖ నగరా లతో పాటు మారుమూల గ్రామాలకు టెలికాం సంస్థలు 4జీ సేవలు అందిస్తు న్నాయి. ఐతే ఇప్పుడు శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు జాబిల్లిపై 4జీ నెట్‌వర్క్‌ను సిద్ధం చేయడానికి రెడీ అవుతున్నారు. నాసాకు చెందిన వ్యోమ గాములు చంద్రుని ఉపరితలంపై నడిచిన దాదాపు 50ఏళ్ల పూర్తికావొస్తోంది. వచ్చే ఏడాది చంద్రునిపై 4జీ కవరేజ్‌ను అందు



బాటులోకి తీసుకొచ్చేందుకు దిగ్గజ టెలికాం సంస్థ వొడాఫోన్ ప్రయత్నాలు ప్రారంభిం చింది. వొడా ఫోన్ జర్మనీ ఈ బృహత్తర కార్య క్రమానికి శ్రీకారం చుట్టింది. టెక్నాలజీ పార్ట్ నర్‌గా నోకి యాను

వోడా, నోకియా సన్నాహాలు


నియ మించుకొంది. ప్రైవేట్ రంగంలో బెర్లిన్‌కు చెందిన స్పేస్ కంపెనీ పీటీ సైంటి స్టుల కంపెనీ సహకారంతో వొడాఫోన్ జర్మనీ, నోకియా ప్రైవేట్ భాగస్వామ్యంతో తొలిసారి చందమామపై ఈ ఘనత సాధిం చాలని చూస్తున్నాయి. మిషన్ మూన్‌లో భాగ ంగా 2019లో కేప్ కెనవరాల్ నుంచి స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ప్రయో గం చేపట్టనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల కోసం తొలిసారి లైవ్- స్ట్రీమింగ్ ద్వారా హెచ్‌డీ వీడియోను ప్రసారం చేసి ప్రత్యేకఅనుభూతి కల్పించనుంది వొడాఫోన్.

పెరుగుతున్న ఐవోటీ వినియోగం

• ఆధునిక కాలంలో వ్యక్తిగత అవసరాలతోపాటు ప్రజాసేవలకూ ఎంతో ఉపయోగకరం

• 2020 నాటికి భారత్‌లో 15 బిలియన్ డాలర్లకు చేరుకోనున్న మార్కెట్

హైదరాబాద్: ఇంట్లో బల్బులు ఆర్పేశామా? గ్యాస్ బంద్ చేశామా?.. సరిగ్గా ఇంటికి తాళం వేసి బయటికి వెళు తుంటే మనలో చాలామందికి కలిగే సందేహాలు ఇవి. అప్పటికే ఆలస్యమైందని పనుల మీద బయటకు వెళ్తాం.. వెంటనే మళ్లీ వెనుకకు రాలేం.. తీరా బయటికి వెళ్లినా రోజంతా ఆ సందేహాలు మనసును పీడిస్తుంటాయి. ఇంట ర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో అటువంటి సమస్యలు తీర్చుకోవచ్చు. మన ఇంట్లోని ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాల వినియో గాన్ని కంప్యూటర్లకు, మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేయడమే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ).. ఉదా హరణకు లైట్లు, తలుపులు, థర్మోస్టాట్లు, మంచినీటి వ్యవస్థ వంటి వన్నీ ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లకు అనుసంధానం చేసు కుని వాటిని ఎక్కడి నుంచైనా ఆన్, ఆఫ్ చేయవచ్చు. ఇంట్లోకి అనుమతి లేకుండా ఇతరులు ఎవరైనా ప్రవేశిస్తే వెంటనే తెలుసుకోవచ్చు. అయితే ఇందుకు ప్రత్యేక గ్యాడ్జెట్స్ అవసరం అవుతాయి. ఆధునిక కాలంలో మారిన జీవన స్థితిగతులు, వృత్తి, ఉద్యోగ జీవితంలో పెరుగు తున్న ఒత్తిడుల కారణంగా నగర ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఐవోటీ చక్కగా పరిష్కరి స్తుందని నాస్కామ్ తెలి పింది. మన దేశంలో కూడా ఐవోటీ అవసరం, విని యోగం క్రమంగా పెరుగుతు న్నది. ఈ దృష్ట్యా 2020 నాటికల్లా భారత్‌లో ఐవోటీ మార్కెట్ విలువ 15 బిలియన్‌డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటినీ అనుసంధానం చేస్తే, వాటి వినియోగంపై 10 శాతం దాకా విద్యుత్తు ఆదా అవుతుందని నిపుణులు పేర్కొన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కి భారత్‌లో అత్యధిక ఆదరణ లభిస్తుందని ఇటీవల వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వ హించిన సదస్సులో నిపుణులు అభిప్రాయపడ్డట్లు ఆ



సదస్సులో పాల్గొన్న సంస్థల ఉన్నతాధి కారులు కొందరు చెప్పారు. మన దేశంలో ఐవోటీ వినియోగం ప్రజా పరిపాలనలో కూడా ప్రారంభ మైంది. దీంతో ప్రజల భద్రత, జీవన ప్రమాణాలూ పెరుగు తాయి. మంచినీరు, విద్యుత్ వంటి సేవలను మెరుగ్గా నిర్వహించడానికి ఐవోటీ ఉపయోగపడుతుంది. ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం దాదాపు 29.1 శాతం ప్రజలు ఎలక్ట్రానిక్ వస్తువులను అనుసంధానించడానికి అంగీకరించారు. ప్రధానంగా, చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులను భద్రపర్చవచ్చు. దీంతో చిన్నారి ఆరోగ్య వివరాలను డాక్టర్లు ఎక్కడ్నుంచి అయినా తెలుసుకోవ డానికి వీలుంటుంది. ఐవోటీని వినియోగించి ట్రాఫిక్, కాలుష్యం, వాతావరణ సమస్యలు పరిష్కరించ వచ్చు. ఈ విధంగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఐవోటీ వినియోగించడంపై అధ్యయనం జరుగుతున్నట్లు సిస్కో ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

విజ్ఞానం

ఫిష్ సప్లిమెంట్లతో ఎలర్జీలు దూరం



గర్భిణీలు ఫిష్ ఆయిల్ సప్లిమెంట్స్ విని యోగంతో ఎలర్జీలను తగ్గించవచ్చునని ఇంపీరియల్ కాలేజి ఆఫ్ లండన్ వెల్లడిం చింది. గర్భస్థ సమ యంలో రోజుకు ఒక ఫిష్ ఆయిల్ సప్లిమెంట్‌తో శిశువు పుట్టిన కొద్ది నెలలవరకు ఫుడ్ ఎలర్జీ తగ్గుతుందని తెలుస్తోంది. 30శాతం ఎగ్ ఎలర్జీలు తగ్గుతాయని ప్రయోగాత్మకంగా రుజువైంది. చేప ఆయిల్‌లో ఉండే ప్రత్యేకమైన ఫాట్ ఒమేగా-3 ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలుస్తోంది. ప్రెగ్నెసీలో తీసుకునే ఆహారం పిల్లల పెరు గుదలపై ప్రభావం చూపుతాయి. 20మందిలో ఒక శిశువు ఫుడ్ ఎలర్జీలైన నట్స్,గుడ్లు, పాలు,గోధుమల వంటి వాటితో పలు సమ స్యలను ఎదుర్కోనే ప్రమాదంఉంది. ఈ ఎలర్జీలు మాల్‌ఫంక్షనింగ్‌తో పాటు దద్దుర్లు, వాపులు, వాంతులు వంటివి సంభవించే అవకాశం ఉంది. 15,000 మంది గర్భిణీలపై చేపట్టిన ప్రయోగంలో వేయిమంది పిల్లలో 31శాతం ఫుడ్ ఎలర్జీలు ఉన్నట్లు తెలుస్తోంది. ఫిష్ సప్లిమెంట్స్ వలన 22శాతం తగ్గినట్లు తెలుస్తోంది.

బాదం వినియోగంతో

కొలోన్ కేన్సర్‌కు చెక్...



ఆహారంలో బాదం పప్పు, వేరుశనగ పప్పు వినియో గంతో పెద్ద ప్రేగు కేన్సర్‌ను నివారిం చవచ్చునని తెలు స్తోంది. వాల్‌నట్స్, జీడి పప్పు, బాదం వంటి పదా ర్థాలను రోజుకు కనీసం రెండు చొప్పున వినియోగిస్తే వారానికి కనీసం 42శాతం మెరుగుదల కనిపిస్తుందని బోస్టన్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. స్టేజ్ 3లోఉన్న పెద్ద ప్రేగు కేన్సర్ సగానికి తగ్గుతుందని తెలుస్తోంది. శారీరక వ్యాయామం, సుగర్ వంటి తీపి పదార్థాలను తక్కువ తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు బరువును నియంత్రించడంతోపాటు కొలోన్ కేన్సర్ తగ్గేందుకు దోహదంచేస్తుందని తెలుస్తోంది. 826మంది రోగులపై చేపట్టిన ప్రయోగంలో వీరు విజయం సాధించినట్లు గమనించారు.



నౌర్క్రిన్‌ను ఆవిష్కరించిన గ్లెన్‌మార్క్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన హెయిర్ గ్రోత్ ఫార్ములా నౌర్క్రిన్ ఉమెన్‌ను గ్లెన్‌మార్క్ ఆవిష్కరించింది. ఫార్మా మెడికోతో ఉన్న ఎక్స్‌క్లూజివ్ లైసెన్సింగ్ ఒప్పందం ద్వారా దేశంలో ఈ ఉత్పత్తిని ఆవిష్కరించిన తొలి కంపెనీ గ్లెన్‌మార్క్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సేల్స్ అండ్ మార్కెటింగ్ రాజేష్ కపూర్ మాట్లాడుతూ అంత ర్జాతీయ అనుసంధానిత గ్లెన్‌మార్క్ పార్మాస్యుటికల్ లిమిటెడ్ మహిళల్లో జుట్టు పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. ఇది శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. దేశంలో 90 మిలియన్ల మంది మహిళలు జుట్టుకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారన్నారు. నౌర్క్రిన్ ఉమెన్ ప్రొడెక్టివ్ ప్రొటోయోగ్లికాన్ రిప్లేస్‌మెంట్ ద్వారా మహిళల్లో జుట్టురాలే సమస్యను అధిగమించవచ్చని చెప్పారు. నౌర్క్రిన్ ఉమెన్ ట్యాబ్లెట్ రూపంలో మార్కెట్లో లభ్యమవుతుందన్నారు. ఆరు నెలల పాటు రోజుకు రెండు ట్యాబ్లెట్లు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. డా.రజిత మాట్లాడుతూ హార్మోన్ సమస్యల వల్ల జుట్టు రాలుతుందన్నారు.

అపోలోకు ఎక్సలెన్స్ అవార్డు



విశాలాంధ్ర బ్యూరో- హైద రాబాద్: అపోలో హాస్పిటల్స్ 'సీఐఐ సిగ్నిఫికెంట్ అచీవ్ మెంట్ అవార్డ్ ఇన్ హెచ్‌ఆర్ ఎక్సలెన్స్'ను దక్కించుకుంది. టాటా స్టీల్ లిమిటెడ్ సీఈ వో, ఎండీ నరేంద్రన్ ఈ అవార్డ్‌ను అపోలో హైదరా బాద్ డీజీఎం-హెచ్‌ఆర్ సీహెచ్ సురేష్ రెడ్డి, హెచ్‌ఆర్ ఎల్‌డీ కవిత సేథిలకు అందజేశారు. సీఐఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇంద్రాణి కర్ హాజరయ్యారు. ఒక సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన మానవవనరుల పనితీరుకు సంబంధించి నాయ కత్వం, అభ్యాసం, అభివృద్ధి, ఉద్యోగ నిబద్ధత, మానవ వనరుల ప్రక్రియ వంటి అంశాలను విశ్లేషించిన తర్వాత ఈ అవార్డుకు అర్హులుగా ఎంపిక చేస్తారు. మానవ వనరుల నిర్వహణలో ఉత్తమ పద్ధతులు, కార్యక్రమాలు, విధానాల అమలుకు ఈ అవార్డు ప్రతీక.

భారత్‌లో వారానికో కోటీశ్వరుడు



ముంబై: భారత్‌లో కొత్త కోటీశ్వరులు ఆవిర్భవిస్తు న్నారని హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ పేర్కొంది. ఒక్క 2017 లోనే 56 మంది బిలియనీర్లు తయారయ్యారని సర్వే పేర్కొంది. దీంతో భారత్ 170 మంది బిలియనీర్లతో అత్య ధికంగా సంపన్నులున్న దేశాల గ్రూప్‌లో భారత్ కూడా చేరిందన్నారు. మొత్తం 819 మంది బిలియనీర్లతో చైనా అగ్రస్థానంలో ఉంది. ఇక అమెరికాలో 571 మంది బిలియనీర్లు ఉన్నారు.

భారత్‌లో ఎదురులేని ముఖేశ్..

భారత్‌లో హురున్ సంస్థ తయారు చేసిన టాప్-20 బిలియనీర్ల జాబితాలో రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ తొలిస్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో మూడో వంతు కొత్త ముఖాలే ఉన్నాయి. గనుల రద్దు భారత్‌లోని బిలియనీర్ల జాబితాను ప్రభావితం చేసిందని ఈ సంస్థ పేర్కొంది. దీంతోపాటు వాటాదారుల మధ్య విభేదాలతో వ్యాపారాలు విక్రయించడం వల్ల కొత్త వారు ఈ జాబితాలో స్థానం సాధించారని అన్నారు. చైనాలో 163 మంది మహిళా బిలియనీర్లు ఉండగా.. భారత్‌లో కేవలం 14 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో సావిత్రి జిందాల్ తొలిస్థానంలో ఉన్నారు. అత్యధికంగా బిలియనీర్లను తయరు చేస్తున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది.



స్వార్ధం ముదిరిపోతే...

ఒక ఊరులో సాంబశివుడు, శంభుదాసుడు అనే యిద్దరు మిత్రులుండేవారు. సాంబశివుడు గుడిని మింగేద్దాం అన్నంత స్వార్ధంతో వుంటే, గుడినే కాదు గుడిలోని లింగాన్ని కూడా మింగేద్దాం అన్నంత పరమస్వార్ధంతో వుండేవాడు శంభుదాసుడు.

చిన్నప్పటినుండి అన్యాయాలు, అక్రమాలు, అడ్డదారులు, కుట్రలు, కుతంత్రాలు, నెరుపుకుంటూ పట్టుమని పాతికేళ్ళ వయసు రాకముందే "నిండైన నిజదుర్మార్గులు" అన్నంత స్థాయికి ఎదిగారు ఆ యిద్దరు మిత్రులు.

కులబలం, ధనబలం, కండబలం, పుష్కలంగా వుండే ఆ యిద్దరు విలన్‌కి జనబలం అండగా వుండటంతో ఆ గ్రామంలో మకుటంలేని మహారాజుల్లా తయారయ్యారు. ఆ యిద్దరి వల్ల ఆ ఊరు ఒక అగ్నిగుండంలా తయారయ్యింది.

అప్పులు యివ్వడం, భూములు తాకట్టుపెట్టుకోవడం, బంగారం అమ్మడం, కొనడం, విత్తనాలు యివ్వటం, పంటకొనడం లాంటి సవాలక్ష వ్యాపారాలు చేస్తూ " అధిక లాభాలు, నాసిరకం, సేవలు వస్తువులు" అన్న వ్యాపారనీతితో చీకటి రాజ్యాన్ని ఏలుతుండేవారు ఆ యిద్దరు మిత్రులు. ఒకరోజు శీనయ్య అనే యువకుడు ఆగ్రామం మీదుగా పోవడం వాళ్ళు గమనించారు, యిలాంటి కండలు తిరిగిన వీరుడు మన వద్ద వుంటే మరిన్ని అరాచకాలు చేసుకోవచ్చు అన్న దురుద్దేశ్యంతో శీనయ్యను చేరదీసి అధికజీతంతో ఉద్యోగం యిస్తాము అని ఆశచూపారు. నిరుద్యోగి శీనయ్యకు ఆనందంకలిగింది. ఆరునెలల పాటు శీనయ్యకు తమచీకటి వ్యాపారాలు తెలియనివ్వకుండా వుంచి తరువాత నెమ్మదిగా అతన్ని పావుగా వాడుకొని దొంగ వ్యాపారాలు చేయడం మొదలు పెట్టారు సాంబశివుడు, శంభుదాసుడు. నీతినిజాయితీలు గల శీనయ్య సాంబశివుడు, శంభుదాసుడుకి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు.


ఒకరోజు అత్యంత విలువైన వజ్రాలమూటను విదేశీయులకు అప్పగించి విపరీతమైన డబ్బును తీసుకొచ్చే పనిని శీనయ్యకు అప్పగించారు సాంబశివుడు, శంభుదాసుడు. శీనయ్య ఆ పనిని విజయవంతంగా చేశాడు. "అలాంటి పనులు చేయడంలో నమ్మకస్తుడు, సమర్థుడు శీనయ్య" అన్న నమ్మకాన్ని యజమానులకు కలిగించాడు శీనయ్య. ఒకరోజు తన యజమానులు మందు త్రాగి వాగుతుండగా అయ్యా! మీలాంటి తెలివైన దొంగవ్యాపారులు పట్టుమని పదినెలలు వాళ్ళ దేశంలో వుండి వాళ్ళకు సలహాలు యిస్తే లక్షకోట్ల ధనాన్ని యిస్తామని' 'జపాన్ జంబుద్వీపాల దొంగవ్యాపారాలు కంపెనీ' ఆఫర్ పెట్టింది. కేవలం పదినెలలే కదా అని చెప్పాడు లక్షకోట్లు నువ్వు తెచ్చి యిక్కడ వుంచు మేము పదినెలలు వాళ్ళతో వుండి తిరిగి వచ్చేస్తాం అంటూ బయలుదేరారు సాంబశివుడు, శంభుదాసుడు. వెంటనే వాళ్ళను విశాఖపట్నం ఓడరేవుకి తీసుకుపోయి, సరుకుల రవాణా ఓడను ఎక్కించి మూడురోజులు తరువాత జపాన్‌లో మిమ్మల్ని వాళ్ళు తీసుకెళ్తారు అని చెప్పాడు. మద్యంమత్తులో వున్న వాళ్ళు సరేనన్నారు మత్తు దిగేసరికి వాళ్ళు అండమాన్ జైల్లో వున్నారు.

– మీగడ వీరభద్రస్వామి, 9441571505

పక్కనున్న టేబుల్‌లో ఈ పదాలు కనుక్కోండి

bell
belt
bird
bread
bagel
spoon

m	d	a	e	r	b
s	b	a	g	e	l
p	n	m	z	n	w
o	t	l	e	b	u
o	u	b	i	r	d
n	b	l	l	e	b



Start

Finish

చిక్కు ప్రశ్న

ఏ పండు ఎంత ఖరీదు?

రామయ్య పండ్లు కొనడం కోసమని బజారుకు వెళ్లి ఒక షాపులో ధరలు తెలుసుకున్నాడు. మూడు బత్తాయిలూ రెండు మామిడి పండ్ల ధర మూడు ఆపిల్ పండ్లకు సమానమని చెప్పాడు దుకాణదారుడు. రామయ్య పక్క షాపునకు వెళ్లి అక్కడ పండ్ల ధరలు వాకబు చేశాడు. రెండు మామిడి పండ్లు, మూడు ఆపిల్ పండ్ల ధర కలిపితే తొమ్మిది బత్తాయి పండ్ల ధరకి సమానమని ఆ షాపు వ్యక్తి చెప్పాడు. అక్కడి నుంచి రామయ్య మరో షాపునకు వెళ్లాడు. అక్కడ మూడు ఆపిల్ పండ్లు, ఆరు బత్తాయిల ధర ఎనిమిది మామిడి పండ్ల ధరకి సమానమని తెలుసుకున్నాడు. రామయ్య లెక్క వేసుకుని ధరలు అందరి దగ్గరా ఒకేలా ఉన్నాయని గ్రహించాడు. ఒక బత్తాయి, ఒక మామిడి, మరొక ఆపిల్ పండు తొమ్మిది రూపాయలిచ్చి కొనుక్కొని ఇంటిదారి పట్టాడు. అయితే వాటిలో ఒక్కొక్క పండు ధర ఎంతో చెప్పండి?



చుక్కలు కలపండి

తెలుసుకుందాం!

శబ్దతరంగాలు ఎలా నశిస్తాయి?

శబ్దతరంగాలు క్రమేణా బలహీనమై నశిస్తాయి కదా! మరి కాంతితరంగాలు ధ్వని తరంగాల మాదిరిగానే కొంతసేపటికే నశించిపోతాయా?

... కాదు, ఎలాగంటే..ఓ చెరువులో రాయి వేసినప్పుడు చెల్లాచెదురయ్యే నీటి మాదిరిగా ధ్వని తరంగాలు ప్రవర్తిస్తాయి. అప్పటివరకు నెమ్మదిగా కదులుతుండే నీటిలో రాయి విసిరిన వెంటనే నీరు అలల రూపంలో వేగంగా కదులుతుంది. నీటి అణువుల మధ్య ఏర్పడే ఘర్షణ ఫలితంగా ఈ అలలు క్రమేణా బలహీనమై వాటి శక్తిని కోల్పోతాయి. ఫలితంగా కొద్దిసేపటికే ఈ అలలు కనిపించకుండా పోతాయి. అదే విధంగా గాల్లో ఏర్పడే ఘర్షణ ఫలితంగా ధ్వనితరంగాలు



కూడా కొంచెంసేపటికే వాటి అస్తిత్వాన్ని కోల్పోతాయి.

అయితే కాంతి తరంగాల మీద ఎలాంటి ఘర్షణ ప్రభావం ఉండదు. ఒకవేళ కాంతి కిరణాల కన్నా వేగంగా ప్రయాణించగలిగితే గతంలో జరిగిన సంఘటనల్ని కూడా మనం వీక్షించవచ్చు. కానీ అది సాధ్యంకాదు. విశ్వంలోని ఏ శక్తీ కూడా కాంతితో పోటీపడి ప్రయాణించలేదు.

రంగులు వేయండి



మార్చి 6న 'ది విజన్ ఆఫ్ భరత్'

సూపర్‌స్టార్ మహేష్‌బాబు, సూపర్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమతి డి.పార్వతి సమర్పణలో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై స్టార్ ప్రొడ్యూసర్ దానయ్య డి.వి.వి. నిర్మిస్తున్న భారీ చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రం ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న విషయం తెలిసిందే. కాగా, ఈ చిత్రానికి సంబంధించి 'ది విజన్ ఆఫ్ భరత్'ను మార్చి 6న విడుదల చేయనున్నారు. సూపర్‌స్టార్ మహేష్, కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్‌లతోపాటు ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, పాటలు: రామజోగయ్యశాస్త్రి, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ: శ్రీమతి డి.పార్వతి, నిర్మాత: దానయ్య డి.వి.వి., దర్శకత్వం: కొరటాల శివ.




మరోసారి విలన్ పాత్రలోఆర్య



తమిళంలో ఆర్యకు మంచి ఫాలోయింగే ఉంది. ఈ యువ కథానాయకుడు కథ నచ్చితే విలన్‌గా కూడా చేయడానికి సిద్ధమవుతాడు. ఇంతకుముందు అల్లుఅర్జున్, గుణశేఖర్ కాంబినేషన్‌లో రూపొందిన వరుడు సినిమాలో ఆర్య విలన్‌గా నటించి మెప్పించాడు. ఇప్పుడు మరోసారి ఆర్య విలన్‌గా నటించబోతున్నాడు. ఆ సినిమా ఏదో కాదు. తెలుగు, కన్నడ భాషల్లో రూపొందుతోన్న రాజారథం. రొమాంటిక్ కామెడీగా రూపొందుతున్న నిరూప్ భండారి, అవంతిక శెట్టి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దర్శకుడు అనూప్ భండారి ఈ చిత్రానికి కథ, పాటలు, సంగీతం అందించటంతో పాటు కొన్ని పాటలు కూడా పాడటం విశేషం. నిరూప్ భండారి హీరోగా అనూప్ భండారి దర్శకత్వం వహించిన 'రంగి తరంగ' చిత్రాన్ని యు.ఎస్, యూరప్ దేశాలలో పంపిణీ చేసిన 'జాలీ హిట్స్' సంస్థ తమ తొలి ప్రయత్నంగా 'రాజారథం' చిత్రంతో నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతోంది

విశాలాంధ్ర సినిమా

అజయ్ భూపతి దర్శకత్వంలో 'ఆర్ ఎక్స్ 100'



కార్తికేయ, పాయల్ రాజపుట్ ఇందులో హీరోహీరోయిన్లు. కెసిడబ్ల్యు బ్యానర్‌పై అశోక్ రెడ్డి గుమ్మకొండ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రీలుక్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. రావురమేష్, సింధూర పువ్వు రాంకీ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైలీ ఎమోషనల్ రియలిస్టిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక బృందం పని చేస్తోంది . నేషనల్ అవార్డు విన్నర్ ప్రవీణ్. కే.ఎల్ ('కబాలి' ఫేమ్) ఈ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. తెలుగులో ఆయనకు ఇదే తొలి చిత్రం కావడం విశేషం . వేసవిలో సినిమాను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెబుతున్నారు.

రామ్ చరణ్‌కు విలన్‌గా బాలీవుడ్ స్టార్ హీరో

రామ్ చరణ్ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఓ వైపు ఈ సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది. డీవీవీ దానయ్య నిర్మాణ సారధ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. చెర్రీ సరసన కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే ఈ సినిమాలో విలన్ క్యారెక్టర్‌పై చాలా ఊహాగానాలు వచ్చాయి.

చివరకు బాలీవుడ్ స్టార్ హీరో వివేక్ ఒబెరాయ్ విలన్‌గా కన్ఫామ్ అయినట్టు తెలుస్తోంది. ఈ సినిమాపై ఇప్పటికే చాలా బజ్ ఏర్పడింది. ఇక విలన్ పాత్రలో వివేక్ నటిస్తున్నారంటే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రశాంత్, ఆర్యన్ రాజేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మరోవైపు చెర్రీ నటిస్తున్న రంగస్థలం మూవీ మార్చి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు సంబంధించిన పనులు పూర్తవగానే చెర్రీ కంప్లీట్‌గా బోయపాటి సినిమాపైనే ఫోకస్ చేయనున్నాడు. ఈ సినిమా పూర్తైన వెంటనే రాజమౌళి డైరెక్షన్‌లో మల్టీ స్టారర్ చేయనున్నాడు చెర్రీ.



డిఫరెంట్ లుక్‌లో ప్రిన్స్

కొత్త హీరోలను, హీరోయిన్స్‌ను తెలుగు తెరకు పరిచయం చేసిన దర్శకుడు తేజ డైరెక్షన్‌లో నీకు నాకు డాష్ డాష్ సినిమా ద్వారా పరిచయమైన హీరో ప్రిన్స్. ఈ యువ హీరో కాస్త చూడటానికి చిన్నప్పటి మహేష్‌లా ఉండటంతో అందరి దృష్టిలో పడ్డాడు. తర్వాత ప్రిన్స్ నటించిన బస్‌స్టాప్, రొమాన్స్ చిత్రాలు తనకి మంచి గుర్తింపు తెచ్చి పెట్టినా.. సక్సెస్‌ఫుల్ హీరోగా నిలదొక్కుకోవడంలో ప్రిన్స్ రాణించలేకపోయాడు. తర్వాత నేను శైలజ, మిస్టర్ చిత్రాల్లో అతిథి పాత్రల్లో నటించాడు. తర్వాత సినిమాలు రావడం లేదనో, మరేదైనా కారణమో ఏమో కానీ, చాక్లెట్ బాయ్‌లా కనిపించే ప్రిన్స్ ఇప్పుడు జిమ్‌కు వెళ్లి సిక్స్ ప్యాక్ పెంచి డిఫరెంట్ లుక్‌లో కనపడుతున్నాడు.




ఇద్దరికీ 72వ సినిమానే!

నేనే రాజు నేనే మంత్రి తరువాత తేజ దర్శకత్వం వహిస్తోన్న సినిమాలో వెంకటేష్ హీరోగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఆట నాదే వేట నాదే అనే టైటిల్ ఈ సినిమాకు పరిశీలనలో ఉంది. మార్చి 12 నుండి ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో మొదలుకానుంది. వెంకటేష్ నటిస్తోన్న 72వ సినిమా ఇది. అలాగే శ్రియకి కూడా ఇది 72వ సినిమా అవ్వడం విశేషం. యాదృచ్ఛికంగా ఇద్దరు ఒక సినిమాలో నటించబోతున్నారు. అనూప్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాకు అభినవ్ రామానుజం సినిమాటోగ్రఫీ అందిస్తున్నాడు. గురు సినిమా తరువాత కొంత గ్యాప్ తీసుకొని వెంకటేష్ చేస్తున్న సినిమా ఇది.

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి బయోపిక్ 'యాత్ర'

మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పాత్రలో కనిపించబోతున్నారు. పాఠశాల, ఆనందో బ్రహ్మ సినిమాల దర్శకుడు మహి వి.రాఘవ్ దర్శకత్వంలో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి బయోపిక్ తెరకెక్కనుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వై.ఎస్.ఆర్ పాత్రలో ఎవరు నటిస్తారనే దానిపై పలువురి పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. నాగార్జున పేరు కూడా ప్రముఖంగా వినపడింది. అయితే రీసెంట్‌గా యూనిట్ మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టిని కలిశారట. ఈ సినిమాకు యాత్ర అనే టైటిల్ పరిశీలనలో ఉంది. వై.ఎస్.ఆర్.సతీమణి విజయమ్మ పాత్రకు నయనతార పేరు పరిశీలనలో ఉంది.



ఈశ్వర్ రెడ్డి దర్శకత్వంలో సప్తగిరి

సప్తగిరి కమెడియన్‌గా చేస్తూనే హీరోగా సినిమాలు చేస్తున్నాడు. సప్తగిరి ఎల్ఎల్‌బి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ నటుడు తాజాగా మరో సినిమా హీరోగా చెయ్యడానికి ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డితో సప్తగిరి సినిమా చేస్తున్నట్లు సమాచారం. ఈశ్వర్ రెడ్డి గతంలో అల్లరి నరేష్ తో సిద్దు ఫ్రమ్ శీకాకుళం సినిమాకు దర్శకత్వం వహించాడు. సప్తగిరి, ఈశ్వర్ రెడ్డి సినిమా న్యూస్ త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ సినిమాకు కథ విక్రమ్ రాజ్ అందించగా మాటలు డైమండ్ రత్నబాబు రాసున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉండనుంది.

అరుదైన వ్యాధుల నివారణకు కేంద్రం చర్యలు

ఢిల్లీ: దేశంలో పెరిగిపోతున్న అరుదైన వ్యాధుల నివారణకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. 'ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్' ఆధ్వర్యంలో దిల్లీలో జరిగిన అరుదైన వ్యాధుల నివారణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. భారత వైద్య పరిశోధన మండలి ప్రారంభించిన అరుదైన వ్యాధుల నమోదు పట్టిక రాబోయే రోజుల్లో వ్యాధుల వర్గీకరణ సహా వ్యాధుల నిర్మూలనకు దోహదపడుతుందని తెలిపారు.

పారిపోయిన ఖైదీని పట్టించిన ఆధార్

ముంబై: భార్యను హత్య చేసిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఓ ఖైదీ జైలు నుంచి తప్పించుకున్నాడు. ఆరేళ్ల పాటు పోలీసులకు చిక్కకుండా ముప్పుతిప్పలు పెట్టాడు. కానీ, అతడిని ఆధార్ పట్టించింది. అదెలా.. అని అనుకుంటున్నారా? అతడు తన ఫోన్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవడంతో పోలీసులకు విషయం తెలిసిపోయింది. దాని, ఆధారంతో అతడు ఎక్కడ ఉన్నదనేది కనిపెట్టి పట్టుకున్నారు.సతీశ్ మహిపాల్ వాల్మీకి అనే వ్యక్తి 2010లో తన భార్యను అత్యంత కిరాతకంగా చంపేశాడు. అనంతరం ఆమెను ముక్కలు ముక్కలుగా కోశాడు. ఈ కేసుకు సంబంధించి అతడికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. నాసిక్ రోడ్ సెంట్రల్ జైలు నుంచి వాల్మీకి 2012లో తప్పించుకున్నాడు. అప్పటి నుంచి అతడి



కోసం పోలీసులు విస్తృతంగా గాలించారు. అతడి ఫొటోలను అన్ని చోట్లా ముద్రించారు. కానీ, వాల్మీకి మాత్రం దొరకలేదు. ఇటీవల వాల్మీకి తన ఫోన్ నెంబర్‌ను ఆధార్‌కు అనుసంధానం చేసుకున్నాడు. దీంతో సంబంధిత అధికారుల ద్వారా ఈ విషయం పోలీసులకు చేరింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఫోన్ నెంబర్ ఆధారంగా అతడు ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. సుమారు ఆరేళ్ల పాటు వాల్మీకి పోలీసుల నుంచి తప్పించుకొని ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరానా ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. మొబైల్‌కు ఆధార్ లింక్ చేయడం ద్వారా అతడిని పట్టుకోగలిగామని పోలీసులు తెలిపారు. మళ్లీ అతడిని నాసిక్ సెంట్రల్ జైలుకు తరలించారు.

అంబులెన్స్ లేక బైక్‌పై చిన్నారితో 30కిలోమీటర్లు

తీవ్ర జ్వరంతో ప్రాణాలొదిలిన నాలుగేళ్ల పాప

రత్లాం: సరైన వైద్య సదుపాయం అందుబాటులో లేక, కనీసం మరో ఆస్పత్రికి వెళ్లడానికి అంబులెన్స్ కూడా లేకపోవడంతో మధ్యప్రదేశ్‌లోని రత్లాంలో నాలుగేళ్ల చిన్నారి అతి దయనీయమైన పరిస్థితిలో కన్నుమూసింది. రత్లాంలోని నంద్లెటా అనే గ్రామానికి చెందిన జీజా అనే పాప గత కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రులు ఘనశ్యామ్, దీనాబాయ్‌లు బుధవారం జీజాను వారి గ్రామానికి ఏడు కిలోమీటర్ల దూరంలోని సైలానా ప్రాంతంలో ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అయితే అక్కడ వైద్యులు చిన్నారికి సెలైన్ పెట్టారు. పరిస్థితి మరింత విషమంగా మారుతున్నందున పాపను రత్లాం ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించారు. అయితే పాప తండ్రి తమకు అంబులెన్స్ ఏర్పాటు చేయాలి ప్రాధేయపడ్డారు. కానీ, వారు నిరాకరించారు.దీంతో ఆలస్యం చేయకుండా ఆయన వెంటనే తన స్నేహితుడిని పిలిచి మోటార్ సైకిల్‌పై పాపను ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్నేహితుడు వాహనం నడుపుతుండగా మధ్యలో ఘనశ్యామ్ పాపను ఎత్తుకుని కూర్చున్నారు. పాప తల్లి సెలైన్ బాటిల్ పట్టుకుని వెనుక కూర్చున్నారు. ఇలా 30కిలోమీటర్లు ప్రయాణించి రత్లాం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ, అప్పటికే ఆలస్యమైపోయింది. ఆస్పత్రిలో చేర్చిన 15 నిమిషాల్లోనే జీజా చనిపోయిందని వైద్యులు వెల్లడించారు. ఘటనపై రత్లాం కలెక్టర్ సోమేశ్ మిశ్రా విచారణకు ఆదేశించారు. అయితే సైలానా ఆరోగ్య కేంద్రంలో ఒక్కటే అంబులెన్స్ ఉందని, అది కూడా మూడు వారాల క్రితం చెడిపోయిందని అక్కడి వైద్యులు వెల్లడించారు. అంబులెన్స్ రిపేర్ చేయాలని కాంట్రాక్టర్‌ను కోరినప్పటికీ ఇంకా బాగుచేయించలేదని చెప్పారు.

పోరు ఉగ్రవాదంపైనే..

ప్రధాని నరేంద్రమోడీ



న్యూఢిల్లీ : మా పోరాటం ఉగ్రవాదంపైనే తప్ప మతంపై కాదని ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. యువత తప్పుదోవ పట్టకూడదన్నదే తమ ఆరాటంగా వెల్లడించారు. ప్రతీ మతం మానవవిలువలనే బోధిస్తుందన్నారు. మోడీ గురువారం 'ఇస్లామిక్ వారసత్వం : అవగాహన, సంయమనాల ప్రోత్సాహం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా -2 కూడా పాల్గొన్నారు. భారతదేశ ఒడిలో ప్రపంచంలోని ప్రధాన మతాలన్నీ ఉన్నాయని ప్రధాని తెలిపారు. పురాతన ప్లూరలిజంకు భారత ప్రజాస్వామ్యం ఓ వేదిక అని అన్నారు. అన్ని మతాలు మానవత్వ విలువలను పెంపొందిస్తాయని, ఇస్లాంలోని మానవత్వ అంశాలను యువత అలవర్చుకోవాలని, అదే సమయంలో ఆధునిక పరిజ్ఞానాన్ని అవగతం చేసుకోవాలని మోడీ అభిప్రాయపడ్డారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 మాట్లాడుతూ, మతమంటే మానవాళిని కలిపి ఉంచేదని, ద్వేషాన్ని ఉద్బోధించే గళాన్ని ప్రజలు తిరస్కరించాలన్నారు. మత విశ్వాసమన్నది మన వృద్ధికి, సుసంపన్నతకు దోహదపడుతుందని చెప్పారు. ఉగ్రవాదంపై పోరాడటమంటే ముస్లింలకు వ్యతిరేకంగానో, మరో మతంపైనో పోరాటం కాదన్నారు. ఐక్యంగానే సంక్షోభాన్ని జయించవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.



జేడీయూలోకి నలుగురు కాంగ్రెస్ నేతలు...

పాట్నా : బీహార్‌లో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్సీలు జేడీ(యూ) తీర్థం పుచ్చుకున్నారు. ఇకపై తమను జేడీ(యూ) ఎమ్మెల్సీలుగా పరిగణించాలంటూ ఎగువసభకు అర్జీ పెట్టుకున్నారు. కాంగ్రెస్ బీహార్ మాజీ అధ్యక్షుడు అశోక్ చౌదరి, ఎమ్మెల్సీలు దిలీప్ చౌదరి, రామచంద్ర భారతి, తన్వీర్ అక్తర్‌ల దరఖాస్తులను ఆమోదించినట్టు బీహార్ శాసనమండలి చైర్మన్ హారూన్ రషీద్ వెల్లడించారు. ఈ నలుగురు పార్టీ వీడుతున్నట్టు బుధవారమే ప్రకటించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సీపీ జోషి తమను 'యూజ్ అండ్ త్రో'గా పరిగణించారని ఆరోపించారు. జోషి తనను ఓ విధంగా కాంగ్రెస్ నుంచి బయటకు గెంటివేశారని అశోక్ చౌదరి అన్నారు. అయితే, ఈ నలుగురిని పార్టీ నుంచి బహిష్కరించినట్టు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కౌకబ్ ఖాద్రీ వెల్లడించారు.

రాజ్యసభ ఎన్నికల్లో లెఫ్ట్ అభ్యర్థికి మద్దతిస్తాం

బెంగాల్ కాంగ్రెస్

కోల్‌కతా : బీజేపీ పెరుగుదలను అరికట్టడానికి రాజ్యసభ ఎన్నికలలో వామపక్ష సంఘటన మద్దతిచ్చే స్వతంత్ర అభ్యర్థిని బలపర్చాలని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను సీపీఎం సమర్థించింది. మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీని ఎన్నికల్లో నిలబెడితే సీపీఎంకు మద్దతిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పేర్కొంది. 'రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవాలంటే.. లెఫ్ట్, కాంగ్రెస్ ఏకం కావాలి. ఐక్యపోరాటాలు చేయాలి. త్వరలో జరగబోయే రాజ్యసభ ఎన్నికల్లో ఐదో స్థానానికి నిలబెట్టే స్వతంత్ర అభ్యర్థి ఉమ్మడిగా మద్దతిచ్చి బలపర్చాలి' అని కాంగ్రెస్ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ చౌదరి అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశం అనంతరం



ఆయన విలేకరులతో మాట్లాడుతూ వామపక్ష సంఘటనతో కాంగ్రెస్‌కు మధ్య పొత్తు లేకపోవడమే బీజేపీకి కలిసివచ్చిందన్నారు. సీతారం ఏచూరి పోటీచేస్తే సీపీఎంకు మద్దతిస్తామని చెప్పారు. ఈనెల 23న ఐదు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు స్థానాలలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఒక స్థానంలో సీపీఎం పోటీచేస్తోంది. వామపక్ష సంఘటన శాసనసభాపక్ష నేత సుజన్ చక్రవర్తి మాట్లాడుతూ, చౌదరి చేసిన ప్రతిపాదన అర్థవంతంగానే ఉందని, అయితే దీనిపై ఇంకా నిర్ణయించాల్సి ఉందని అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే, సభలో ప్రతిపక్ష నేత అబ్దుల్ మన్నన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. స్వతంత్ర అభ్యర్థిని నిలబెట్టే పరిస్థితిలో పార్టీ లేదని, సొంత అభ్యర్థిని నిలబెట్టడం సబబుగా ఉంటుందన్నారు. స్వతంత్ర అభ్యర్థులు అనుకున్నట్లుగా వ్యవహరిం చరని అభిప్రాయపడ్డారు. పార్టీ అభ్యర్థి అయితే పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటారన్నారు. అయితే, పార్లమెంటులో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించే సమర్థనేత తమకు అవసరమని అబ్దుల్ మన్నన్ చెప్పారు.

'లోక్‌పాల్' ఆహ్వానాన్ని తిరస్కరించిన ఖర్గే

న్యూఢిల్లీ : లోక్‌పాల్ సెలక్షన్ కమిటీని బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా సెలక్షన్ కమిటీకి రావాలంటూ కేంద్రప్రభుత్వం పంపిన ఆహ్వానాన్ని లోక్‌సభలో పార్టీ నేత మల్లికార్జున ఖర్గే తిరస్కరించారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోడీకి లేఖ రాశారు. లోక్‌పాల్ సెలక్షన్‌లో విపక్ష గళాన్ని అణచివేసేందుకు ఈ ప్రత్యేక ఆహ్వానం ఓ 'సంయుక్త యత్నం'గా ఖర్గే అభివర్ణించారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, 2013 ప్రకారం లోక్‌సభలోని ప్రతిపక్ష నేత మాత్రమే సెలక్షన్ కమిటీ సభ్యులు కాగలరు. ఖర్గేకు ఆ హోదా లేనందున ఆయన సెలక్షన్ కమిటీలో లేరు. అయితే, కేంద్రం గురువారం జరిగిన సెక్షన్ కమిటీ సభకు ఆయనను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించింది. ఈ చర్యను ఖర్గే తప్పుబట్టారు. ప్రతిపక్ష గళాన్ని వినిపించకుండా చేసేందుకు జరిగిన యత్నంగా అభివర్ణించారు.లోక్‌పాల్, లోకాయుక్త చట్టం స్ఫూర్తిని హరించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దీనిని కేవలం మర్యాదపూర్వంగానే భావిస్తోందన్నారు. అనేక చట్టాలను సవరించిన కేంద్రం లోక్‌పాల్ చట్టాన్ని



మాత్రం సవరించలేదని ఖర్గే తెలిపారు. కేవలం ఆలయ విగ్రహంగా సభలో వ్యవహరించడం తనకు ఇష్టం లేదని, ప్రక్రియలో పాల్గొనే హక్కు లేకుండా అక్కడకు వెళ్లడం వ్యర్థమని, తన అభిప్రాయాన్ని పొందుపర్చడం, ఓటింగ్ వట్టి కంటితుడుపుగానే ఉంటాయని ఖర్గే అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఆహ్వానాన్ని తాను మర్యాదగా తిరస్కరించడమే సబబుగా ఉంటుందని తన లేఖలో పేర్కొన్నారు. ప్రతిపక్ష భాగస్వామ్యాన్ని చూపే యత్నమే ఈ ఆహ్వానమంటూ ఖర్గే విమర్శించారు.

కదిలే రైలులో పెళ్లి

ఢిల్లీ: పెళ్లి.. ప్రతి ఒక్కరి జీవితంలో ఓ మధురమైన ఘట్టం. బంధువుల, ఆప్తులు, స్నేహితుల ఆశీర్వచనాల మధ్య వధూవరులు వివాహబంధంతో ఒక్కటవుతారు. అయితే ఈ మధ్య కొందరు వధూవరులు తమ వివాహ వేడుకలను వైవిధ్యంగా జరుపుకునేందుకు ఇష్టపడుతున్నారు. గాల్లో తేలుతూనే.. నీటిలో ఈదుతూనే పెళ్లి చేసుకుంటున్నారు. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ జంట కదిలే రైలులో వైవాహిక జీవితంలోకి



అడుగుపెట్టింది. ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ ఆశీర్వచనాల మధ్య రైలులోనే పెళ్లి జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశంబి ప్రాంతానికి చెందిన సచిన్ కుమార్ బదోహీలో ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్నారు. సచిన్‌కు అదే ప్రాంతానికి చెందిన జ్యోత్స్న సింగ్ పటేల్‌తో వివాహం నిశ్చయమైంది. జ్యోత్స్న సెంట్రల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి. వీరిద్దరూ తమ పెళ్లిని కాస్త ప్రత్యేకంగా రైలులో జరుపుకోవాలనుకున్నారు. ఇందుకోసం రైల్వే అధికారులను సంప్రదించగా.. వారు కూడా అనుమతిచ్చారు. దీంతో బుధవారం వారు రైల్లో పెళ్లి చేసుకున్నారు. గోరఖ్‌పూర్ నుంచి లఖ్‌నవూ వెళ్తున్న రైల్లో వీరు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఇదే రైలులో ప్రయాణిస్తున్న శ్రీశ్రీ రవిశంకర్ ఈ వివాహాన్ని దగ్గరుండి జరిపించారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహానికి సంబంధించిన ఫొటోలను శ్రీశ్రీ అనుచరులు ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు.



జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం

కాంచీపురం: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కంచి కామకోటి పీఠానికి 69వ అధిపతిగా వ్యవహరించిన జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశ క్రతువు పూర్తయింది. ఉదయం వరకు భక్తుల సందర్శనార్థం ఉంచిన జయేంద్ర సరస్వతి భౌతికకాయాన్ని ఆయన శిష్య బృందం బృందావనం వద్దకు తరలించారు. అక్కడ ఉత్తర పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు.

చంద్రశేఖరేంద్ర స్వామి బృందావనం పక్కనే జయేంద్ర సరస్వతి బృందావన ప్రవేశం చేశారు. ఈ క్రతువును వీక్షించేందుకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, డాలర్ శేషాద్రి, టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు తదితరులు జయేంద్ర సరస్వతికి నివాళులర్పించారు.

కార్తిని కస్టడికివ్వండి : కోర్టులో సీబీఐ పిటిషన్



న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా స్కాంలో అరెస్టయిన మాజీ మంత్రి చిదంబరం తనయుడు కార్తి ఒక రోజు కస్టడీ ముగియడంతో మరో 14 రోజులపాటు కస్టడీని పొడిగించవలసిందిగా కోరుతూ సీబీఐ గురువారం నాడు ఢిల్లీ హైకోర్టుకి పిటిషన్ దాఖలు చేసింది. కార్తి తల్లి, సీనియర్ అడ్వొకేట్ అయిన నళిని చిదంబరం కూడా కార్తితో పాటు కోర్టుకు హాజరైనట్లు తెలుస్తోంది. సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మను సింఘ్వి కార్తికి సంబంధించిన ఈ కేసును పరిశీలిస్తున్నారు. నిందితుడితో పాటు సహ నిందితుడిని, ఇతరులను, అనుమానితులతో కలిసి విచారించేందుకు సమయం పడుతుందని.. తమకు లభ్యమైన ఆధారాలపై మరింత విచారణ జరపవలసిఉందని అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు నివేదించారు. మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి కార్తి ఆయన ఛార్టర్డ్ ఎకౌంటెంట్ ఎస్ భాస్కరరామన్‌ను ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టు చేయడం జరిగింది. భాస్కరరామన్ తనను ఇంటరాగేషన్‌లోకి తీసుకోవలసిన అవసరమేమీ లేదని దీనికిగాను తనను కస్టడీనుండి బెయిల్ ఇవ్వవలసిందిగా కోరడంతో దీనికి సంబంధించి విచారణను మార్చి 7కునాయిదా వేసినట్లు సీబీఐ ప్రత్యేక జడ్జి సునీల్ రానా వెల్లడించారు. భాస్కరరామన్‌ను ఢిల్లీలో ఫిబ్రవరి 16న అరెస్టు చేయడం జరిగింది. దీనికి సంబంధించిన ఇంటరాగేషన్ ఫిబ్రవరి 26న ముగియనుండటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భాస్కరరామన్‌ను తిరిగి జైలుకుపంపివేసింది.

ఐఎన్ఎక్స్ మీడియా సంస్థలోకి నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు 2007లో కార్తీ భారీగా ముడుపులు తీసుకున్నారన్నది ప్రధాన ఆరోపణగా ఉంది. అయితే ఈ వ్యవహారం కేవలం కార్తీ అరెస్టుతో కాకుండా ఆయన ఛార్టర్డ్ ఎకౌంటెంట్ భాస్కరరామన్‌కు పలు కీలక విషయాలు తెలిసినందున ఆయనను కూడా విచారిస్తోంది.

ఐఎన్ఎక్స్ మీడియా స్కాం కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం మెడకు చుట్టుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ ముడుపుల వ్యవహారంలో అప్పటి ఆర్థిక మంత్రిగా చిదంబరం ఉన్నారు. ఆయన్ను కూడా తాము కలిశామని అప్పటి ఐఎన్ఎక్స్ డైరెక్టర్లు ఇంద్రాణీ ముఖర్జీ, ఆమె భర్త పీటర్ ముఖర్జీ ..సీబీఐ, ఈడీ విచారణలో వెల్లడించారు. తన కుమారుడి వ్యాపారానికి సహకరించాలనీ ..విదేశీ నిధులు అందజేయండని తమను ఆయన కోరారని వారు బయటపెట్టారు. ఢిల్లీలోని పార్క్ హయత్ హోటల్‌లో కార్తీకి 7 లక్షల డాలర్లు అంటే సుమారు 4.5 కోట్ల రూపా యలు ఇచ్చినట్లు తెలిపారు. ఐఎన్ఎక్స్ మాజీ డైరెక్టర్ల వాగ్మూలం ఆధారంగా ఇప్పుడు సీబీఐ తదుపరి కార్యాచరణకు పావులు కదుపుతోంది.

ఆధునీకరణతోనే ఆర్థికాభివృద్ధి

ఆర్మీ చీఫ్ రావత్



న్యూఢిల్లీ: భారత దేశ ఆర్థికాభివృద్ధి సాయుధ దళాల ఆధునీకరణతో ముడి పడి ఉందని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ పేర్కొన్నారు. దేశ భద్రతకు ఆర్థికాభివృద్ధి కీలకమైన అంశమని అన్నారు. సైనికదళాలకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులను రావత్ సమర్థించారు. దేశంలోకి విదేశీ నిధుల ప్రవాహంతోపాటు దేశ సరిహద్దులో భద్రతకు సంబంధించి సంబంధం ఉందని గురువారం ఇక్కడ జరిగిన ప్రత్యేక సెమినార్‌లో రావత్ నొక్కి చెప్పారు. దేశంలోకి పెట్టుబడులను ఆహ్వానించేందుకుగాను పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని మరింత పెంచవలసిన అవసరంఉందన్నారు. దేశ ప్రయోజనాలరీత్యా భద్రత పటిష్టంగా ఉండాలంటే సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టంచేయడంతోపాటు అంతర్గత భద్రత పట్ల తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి కావలసిన బడ్జెట్ అవసరాన్ని గుర్తు చేసారు. సాయుధ దళాల బడ్జెట్ కేటాయింపు గురించి అడిగిన ప్రశ్నకు పై విధంగా సమాధానం చెప్పారు. రక్షణ బడ్జెట్ గురించి ప్రస్తావిస్తూ, జనరల్ రావత్ సైన్యం యొక్క అంతర్గత అధ్యయనాన్ని ఉదాహరించారు. వార్షిక బడ్జెట్‌లో 35-37 శాతం దేశానికోసం ప్రాణాలను ఫణంగా పెడుతున్న సైన్యానికి కేటాయిస్తున్నారని తెలిపారు. దేశంలో ప్రజల సౌకర్యార్థం మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, మౌలికసదుపాయాలను అభివృద్ధి చేస్తారు. సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ప్రభుత్వ అందు బాటులో లేని విద్య, ఆరోగ్యవసతులను సాయుధ దళాలే అందిస్తున్నాయన్నారు. వివిధ రకాల ఐక్యరాజ్యసమితి మిషన్లకోసం భారతీయ దళాలను పంపే ఖర్చు గురించి ఆర్మీ చీఫ్ ఉదహరించారు. ఆర్మీ దళాలపై ఖర్చు పెడుతున్నప్పటికీ, ఐక్యరాజ్యసమితి నుండి తిరిగి వచ్చే చెల్లింపులు కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాకు చేరతాయని వివరించారు.

హత్యకేసులో జవానుకు జీవితఖైదు

ముజఫర్‌నగర్ : దుకాణదారుడి హత్య కేసులో ఆర్మీ జవానుకు జీవితఖైదును విధిస్తూ ఉత్తరప్రదేశ్ ముజఫర్‌నగర్ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. బుధవారం సాయంత్రం సెషన్స్ జడ్జి పూనమ్ రాజపుట్ 2010లో ఆర్థిక కారణాలతో దుకాణ యజమానిని హతమార్చిన జవాన్ యోగేష్ కుమార్‌కు జీవిత ఖైదు, రూ. 2 వేలు జరిమానా విధించారని ప్రాసిక్యూషన్ న్యాయవాది తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరికి కూడా జీవిత ఖైదు తీర్పునిచ్చారని తెలిపారు. ఈ ముగ్గురూ కలిసి దుకాణదారుడు తేజ్‌పాల్‌ను కాల్చి చంపినట్టు చెప్పారు.

జమ్మూలో ఉగ్రవాదులు, భద్రతాదళాల మధ్య ఎన్‌కౌంటర్

శ్రీనగర్ : జమ్మూ, కాశ్మీర్‌లో బందిపోరా జిల్లాలో హజిన్ ప్రాంతంలో భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్టు అందిన సమాచారం మేరకు భద్రతాదళాలు ఆ గ్రామంలో మోహరించి గాలింపు చర్యలు చేపట్టాయని చెప్పారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు భద్రతాదళాలపై కాల్పులకు పాల్పడ్డాయని, తర్వాత ఇరువర్గాల మధ్య హోరాహోరీగా కాల్పులు జరిగినట్టు తెలిపారు.

ఆయుధాల ఫ్యాక్టరీలో పేలుడు : ఒకరికి గాయాలు

ఉదగమండలం : తమిళనాడులోని ఉదగమండలంలో అరువంగడులోని ఆయుధాల కర్మాగారంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 25 ఏళ్ల కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ కర్మాగారం లోపల టాఫ్లోన్ కేంద్రంలో పేలుడు సంభవించిందని, పేలుడు ధాటికి 15 అడుగుల లోతున గొయ్యి ఏర్పడిందని చెప్పారు. గాయపడిన కార్మికుడిని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు సాగుతుందని చెప్పారు.

సీఎస్‌పై దాడి కేసులో ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలకు సమన్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలకు విచారణ నిమిత్తం ఢిల్లీ సమన్లు జారీ చేశారు. గత నెలలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై దాడికి పాల్పడినట్టు ఆప్ ఎమ్మెల్యేలు నితిన్ త్యాగి, రాజేష్ రిషిలపై ఆరోపణలు వచ్చాయి. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు సివిల్ లైన్స్ పోలీసుస్టేషన్‌లో హాజరవ్వాలని ఆదేశించినట్లు అధికారి తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు అమానుల్లా ఖాన్, ప్రకాష్ జర్వాల్‌లు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

కాశ్మీరులో హిమపాతానికి ఒకరి మృతి

శ్రీనగర్ : జమ్మూ, కాశ్మీర్‌లోని బందిపోరా జిల్లాలో సంభవించిన హిమపాతానికి తీవ్రంగా గాయపడిన 25 ఏళ్ల వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. జిల్లాలో తులైల్‌లో హసంగం-మలంగంలో బుధవారం సంభవించిన హిమపాతానికి గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అలాగే గత నెలలో కుప్వారా జిల్లాలో మంచులో సమాధి అయిన ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

మహారాష్ట్రలో మహిళల కోసం హెల్ప్‌లైన్ ప్రారంభం

న్యూఢిల్లీ : మహిళల కోసం ప్రత్యేక కౌన్సిలింగ్ హెల్ప్‌లైన్‌ను మహారాష్ట్ర మహిళా కమిషన్ (ఎంఎస్‌సీడబ్ల్యూ) మార్చి 8 నుంచి ప్రారంభిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి ప్రారంభమయ్యే ఈ హెల్ప్‌లైన్ మహిళల మానసిక సమస్యల నుంచి ఉపశమనం కలిగించేందుకు సేవలందిస్తుందని ఎంఎస్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయ రహత్కార్ తెలిపారు. ప్రారంభోత్సవం నాడు హెల్ప్‌లైన్ నెంబరును ప్రకటిస్తామని చెప్పారు. దేశంలో ఇటువంటి సేవలను అందిస్తున్న మొట్టమొదటి హెల్ప్‌లైన్ ఇదేనని తెలిపారు.

ఒడియా భజన గాయకుడు మృతి

భువనేశ్వర్ : ప్రముఖ ఒడియా భజన గాయకుడు అరబింద ముదులి (56) గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న ఆయన ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన అనంతరం అక్కడ మృతిచెందినట్టు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన భక్తి పాటలతో ఒడిశా, మిగతా రాష్ట్రాల్లోనూ ఎంతోమంది శ్రోతలను ఆకట్టుకున్నారు. 1961 సెప్టెంబరు 1న కోర్ధా జిల్లాలో ఆయన జన్మించారు. జగన్నాథ స్వామిపై భజన పాటలు పాడటంలో ఆయన పేరుగాంచారు.

కర్ణాటకలో కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ అధినేతగా మిస్త్రీ

న్యూఢిల్లీ : కర్ణాటకలో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ స్టీరింగ్ కమిటీ అధినేతగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్ మిస్త్రీ నియామకం ఖరారైంది. స్టీనింగ్ ప్యానెల్‌కు అధినేతగా మిస్త్రీ నియమకానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గురువారం ఆమోదం తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ శాఖ చీఫ్ జి.పరమేశ్వరలతో కూడిన ఈ ప్యానెల్ కమిటీలో ఎంపీలు తమరద్వాజ్ సాహు, గౌరవ్ గగోయ్‌లు సభ్యులుగా ఉంటున్నారు.

జయేంద్ర మహాసమాధి కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత

కాంచీపురం : గుండెపోటుతో మృతిచెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జయేంద్ర సరస్వతి మహాసమాధి కార్యక్రమంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మహాసమాధి కార్యక్రమాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన వేలాదిమంది భక్తులను అధికారులు నిలిపివేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. బృందవనం ప్రవేశ క్రతువు ప్రధాన ద్వారం చిన్నదిగా ఉండటంతో అక్కడ తోపులాట చోటుచేసుకుంది. ఈ కార్యక్రమం చివరి దశలో మొత్తం మూడు ద్వారాలను అధికారులు మూసివేశారు.

కేంద్రం, ఆప్ ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ : ఏడు పాఠశాలల మూసివేతకు రాష్ట్ర విద్యా వ్యవస్థ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని దాఖలైన పిటిషన్‌పై బదులివ్వాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని, ఆప్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తాత్కాలిక చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సి హరిశంకర్‌లు విద్యాశాఖకు నోటీసులు జారీ చేశారు. దీనికి సంబంధించిన తదుపరి విచారణ జూలై 27కు వాయిదా వేశారు. కాగా తమ ఆదేశాలను ఉపసంహరించుకుంటున్నట్టు విచారణ సందర్భంలో ఢిల్లీ ప్రభుత్వ కౌన్సిల్ కోర్టుకు తెలిపారు.

జయేంద్రకు ముస్లింల నివాళి

కాంచీపురం: కాంచీపురంలో జుమ్మా మసీదుకు చెందిన ముస్లింల బృందం బుధవారం కంచి పీఠానికి వచ్చి జయేంద్ర సరస్వతికి సంతాపం ప్రకటించారు. ఉత్తరాధికారి విజయేంద్ర సరస్వతిని కలిసి సానుభూతి తెలిపారు. మసీదు ఇమామ్ జే మహ్మద్ మాట్లాడుతూ, చంద్రశేఖరేంద్ర సరస్వతి పీఠాధిపతిగా ఉన్నప్పటి నుంచి కంచి మఠంతో తమకు సుహృద్భావ సంబంధాలున్నాయని చెప్పారు. పీఠం పరిసరాల్లో మసీదు ఉండడాన్ని పలువురు వ్యతిరేకిస్తే ఆయన తమకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.

చర్చి ఫాదర్ దారుణహత్య

తిరువనంతపురం : కేరళలోని ప్రముఖ క్రైస్తవ యాత్రా స్థలం మళయట్టూరులో దారుణం జరిగింది. కొచ్చి సమీపంలో ఉన్న ఈ పుణ్య స్థలంలో గురువారం చర్చి ఫాదర్ దారుణంగా హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడు నెలల క్రితం తొలగింపునకు గురైన చర్చి అధికారి జానీ ఈ దారుణానికి పాల్పడ్డాడు. మళయట్టూరులోని కురిసుముడి యాత్రా కేంద్రం రెక్టార్ ఫాదర్ జేవియర్ తెలక్కట్ (52)పై జానీ దాడి చేసి, హత్య చేశాడు. అనంతరం నిందితుడు సమీపంలోని అడవుల్లోకి పారిపోయాడు.

ముస్లింలు సహకరిస్తున్నారు : రవిశంకర్

లక్నో : అయోధ్య రామాలయం సమస్యకు త్వరలోనే శాంతియుత పరిష్కారం లభించవచ్చునని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు రవిశంకర్ ఆశాభావం వ్యక్తంచేశారు. గురువారం ఆయన ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బీ) మాజీ సభ్యుడు మౌలానా సల్మాన్ నద్వీతో చర్చలు జరిపారు. వీరి సమావేశం హజ్రత్ గంజ్ ప్రాంతంలోని కాంగ్రెస్ నేత లవ్ భగవ నివాసంలో జరిగింది.సమావేశం అనంతరం రవిశంకర్ మాట్లాడుతూ, అన్ని పక్షాల నుంచి తమకు మంచి స్పందన వస్తోందన్నారు.ముస్లింలు చాలా సహకరిస్తున్నారని చెప్పారు.



తలనీలాల ఆదాయం రూ.2.38 కోట్లు

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులు సమర్పించిన తలనీలాల ద్వారా టీటీడీకి రూ. 2.38 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రతి నెలా మొదటి గురువారంలో భాగంగా తలనీలాల ఈ-వేలం టీటీడీ తిరుమల జేఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో జరిగింది. మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, తెల్లవెంట్రుకలకు వేలం నిర్వహించారు. మొత్తం 3,500 కిలోల తలనీలాలు అమ్ముడుపోయాయి. మొదటి రకం కిలో రూ.22,494, రెండవ రకం కిలో రూ.17,223, మూడవరకం కిలో రూ.2,833, నాల్గవ రకం కిలో రూ.1,195, ఐదవ రకం, తెల్ల వెంట్రుకలు అమ్ముడుపోలేదని అధికారులు తెలిపారు.



ఎయిమ్స్ పనులను వేగవంతం చేద్దాం

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(ఎయిమ్స్) నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ ఆదేశించారు. గుంటూరు కలెక్టరేట్‌లో గురువారం ఎయిమ్స్ భవన నిర్మాణాల అనుమతులు, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మౌలిక సదుపాయాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కోన శశిధర్ మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ వరకు ప్రధాన రహదారి పనులను వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈను ఆదేశించారు. ఫేజ్ టూలో చేపట్టనున్న భవన నిర్మాణాల అనుమతులను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎయిమ్స్‌కు అవసరమైన నీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇదే స్థలంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్‌కలెక్టర్-2 విజయచందర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ మాధవి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళా నేతపై దాడి చేస్తారా

విశాలాంధ్ర - మంగళగిరి : తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకురాలు, దళిత నేత దర్శి వనజాక్షిపై దాడి కేసులో నిందితుడు పోలవరపు హరిబాబును 48 గంటల్లో అరెస్ట్ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల క్రితం టీడీపీకి చెందిన హరిబాబు దళిత మహిళానేత వనజాక్షిని దుర్భాషలాడుతూ దాడి చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం శివాజీ మంగళగిరి పట్టణంలోని బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దోషి హరిబాబుకు ఆశ్రయం కల్పించిన వారిపైనా కేసు నమోదు చేయాలన్నారు. బాధితురాలు కుటుంబానికి ప్రభుత్వం తరఫున పరిహారం ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ దళిత విభాగం నాయకులు కుక్కమళ్ల స్వామి అన్నారు. వనజాక్షిపై దాడికి తాను క్షమాపణ చెబుతున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి ప్రకటించారు. హరిబాబును ఇప్పటికే పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పట్టణ సీఐ హరికృష్ణ, తహశీల్దార్ వసంతబాబు పాల్గొన్నారు.

గన్నవరం - కడప మధ్య ట్రూ జెట్ విమాన సర్వీసు



విశాలాంధ్ర - గన్నవరం : రాజధాని అమరావతి ప్రాంతంలోని గన్నవరం విమానాశ్రయం నుంచి కడప పట్టణానికి ఉడాన్ పథకం కింద గురువారం ఉదయం నూతనంగా ట్రూ జెట్ విమాన సర్వీసును విమానాశ్రయ అధికారులు ప్రారంభించారు. గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ మధుసూదనరావు, ట్రూజెట్ స్టేషన్ మేనేజర్ కిరణ్‌రాజు, సేల్స్ అండ్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీహర్షలు విమానాశ్రయ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కడప ప్రయాణికులకు డైరెక్టర్ మధుసూదనరావు బోర్డింగ్ పాస్ అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ ఈ ట్రూజెట్ విమాన సర్వీసుతో కడప ప్రజలు రాజధానికి వేగంగా చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రాంతీయ విమాన సేవలను అందిస్తున్న ట్రూజెట్ కడపకు గతంలో సర్వీసులను ప్రారంభించామన్నారు. ఈ సర్వీసును ప్రయాణికులు వినియోగించుకోవాలని మధుసూదనరావు సూచించారు.

కేంద్ర పథకాల అమల్లో విజయనగరం ముందంజ



విశాలాంధ్ర బ్యూరో- విజయనగరం : కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, సమాజ వికాసం కోసం ప్రవేశపెట్టిన పథకాల అమలులో విజయనగరం జిల్లా ముందంజలో నిలుస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా కేంద్రం 54 పథకాలను అమలు చేస్తోంది. జిల్లాలో ఇవి 34 వరకు అమలవుతున్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, దివ్యాంగుల సంక్షేమం, ఉపాధి, విద్యుత్ సరఫరా, మహిళా శిశు సంక్షేమం, జలవనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, భూరికార్డుల డిజిటలైజేషన్, పట్టణాభివృద్ధి తదితర పథకాలు కీలకం. వీటి అమలుతీరును ఎప్పటికప్పుడు దిశ పేరుతో సమీక్ష నిర్వహిస్తుంటారు. పార్లమెంటు సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పడే దిశ కమిటీ అమలుపై అధికారులకు సలహాలు, సూచనలు చేస్తుంది. కేంద్రమంత్రి పి.అశోక్ గజపతిరాజు అధ్యక్షతన గురువారం ఇక్కడ జరిగిన అధికారుల సమీక్షలో ఆయా పథకాల అమలులో రాష్ట్రంలోనే విజయనగరం జిల్లా అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడైంది.

కందులన్నీ కొనండయ్యా..

- ఎకరాకు నాలుగు క్వింటాళ్లే కొనుగోలు చేయాలన్న ప్రభుత్వ నిబంధనపై రైతుల ఆగ్రహం
- ప్రభుత్వ అనుమతి మేరకే కొంటామంటున్న మార్క్‌ఫెడ్ అధికారులు

విశాలాంధ్ర - కర్నూలు అర్బన్ : కంది పంటకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలుకు చర్యలు చేపట్టినప్పటికీ నిబంధనల్లో కొన్ని ఆంక్షలు రైతులకు శాపంగా మారాయి. ఒక్కో రైతుకు సంబంధించి ఎకరాకు 4 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మొత్తం పంటను కొనుగోలు చేయాలని కర్నూలు జిల్లా రైతులు పాలకులను వేడుకుంటున్నారు. జిల్లాలో కందిపంట కొనుగోలు కోసం 16 కేంద్రాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. కర్నూలు, ఆత్మకూరు, డోన్, బేతంచెర్ల, నందికొట్కూరు, గడివేముల కేంద్రాల్లో కందుల కొనుగోళ్ల సాగుతున్నా మిగతా కేంద్రాల్లో ఇంకా ప్రారంభం కాలేదు. జిల్లాలో గత ఏడాది 64,605 హెక్టార్లలో కందిపంట సాగుచేయగా, ఈ ఏడాది 62,176 హెక్టార్లలో ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేశారు. ఎకరాకు 5 నుండి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మద్దతు ధర లేకపోవడంతో రైతుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం క్వింటా కందులను రూ.5,450 చొప్పున కొనుగోలుకు నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.3,500 నుండి 4 వేల రూపాయలు వరకు మాత్రమే ఉంది. ప్రభుత్వం మాత్రం ఒక ఎకరాకు 4 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో మిగిలిన పంటను ఎలా విక్రయించుకోవాలని రైతులు కుమిలిపోతున్నారు.



టోకెన్ల కోసం పడిగాపులు

మార్కెట్‌లో రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు, ఈక్రాప్ సిస్టమ్ ద్వారా వ్యవసాయ అధికారి ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంది. ఇవన్నీ ఇస్తే మార్కెట్‌లో రైతులకు టోకెన్ ఇవ్వడం జరుగుతుంది. వీరి వద్ద మాత్రమే అధికారులు పంటను కొనుగోలు చేస్తున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో కర్నూలు, గూడూరు, సి బెళగల్, కోడుమూరు, కల్లూరు మండలాల రైతుల నుండి కొనుగోళ్లు చేస్తున్నారు. టోకెన్ల కోసం అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. 10 రోజుల నుంచి వ్యవసాయ అధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫారాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డులో టోకెన్‌కు రూ.150 నుండి రూ.500 చొప్పున తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం అనుమతిస్తే మిగిలిన పంట కొంటాం
సుబ్రహ్మణ్యం, మార్క్‌ఫెడ్ ఎండీ

కర్నూలు జిల్లాలో మొత్తం లక్షా 10 వేల టన్నుల కందుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మార్చి 31వ తేదీ వరకు కొనుగోళ్లు చేస్తాం. ఇప్పటి వరకు 20 వేల టన్నుల వరకు కొనుగోలు చేశాం. మిగిలిన పంటను ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే కొనుగోలు చేస్తాం.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం



వ్యవసాయ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాల కోసం 10 రోజులుగా మార్కెట్‌యార్డు చుట్టు తిరుగుతున్నా ఇక్కడ ఇవ్వడం మీ మండలంలోనే టోకెన్లు ఇస్తారని అధికారులు చెప్తున్నారు. కరువు కష్టాల్లో పండించిన పంటను అమ్ముకోవడానికి కాళ్లు అరిగేలా తిప్పుతున్నారు. రైతులకు ఎక్కడికి పోయినా కష్టాలు తప్పడం లేదు.

నరసింహులు, రైతు, కందవాళ్ళి, సి బెళగల్ మండలం

టోకెన్లు అమ్ముతున్నారు



రైతులం ఏమి మాట్లాడినా తప్పు అంటారు. కల్లూరు మండలం రేగడూరులో 6.45 సెంట్లలో కందిసాగు చేశాం. 32 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆ పంట అమ్ముకోవడం కోసం వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం చుట్టు నాలుగు రోజులుగా తిరుగుతున్నా. దళారులకు టోకెన్లు అమ్ముకుంటున్నారు.

ఎం శివమ్మ, మహిళా రైతు, రేమడూరు, కల్లూరు మండలం

పంట మొత్తం కొనుగోలు చేయండి



ప్రభుత్వం ఎకరాకు కేవలం 5 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే బాగుండేది. ఒక్కో రైతు నుంచి 4 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన పంటను తక్కువ ధరకు బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకోవాల్సిందే. దీంతో నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వమే రైతులు పండించిన పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

గొల్ల శివన్న, రైతు నిడ్జూరు, కర్నూలు మండలం

రైలులో మత్తు పదార్థమిచ్చి దోచేశారు

- యశ్వంత్‌పూర్ - లక్నో ఎక్స్‌ప్రెస్‌లో చోరీ
- అపస్మారక స్థితిలోకి ప్రయాణికులు
- గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలింపు

విశాలాంధ్ర - గూడూరు : యశ్వంత్‌పూర్ - లక్నో ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం కొందరు దుండగులు ప్రయాణికులకు మత్తుమందు కలిపిన ఆహారమిచ్చి చోరీకి తెగబడ్డారు. ప్రయాణికులు అపస్మారక స్థితికి చేరుకోవడంతో ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, నగదును అపహరించి పారిపోయారు. అపస్మారక స్థితిలోకి చేరుకుంటున్న ప్రయాణికులను గమనించిన టీటీ ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నెల్లూరు జిల్లా గూడూరు రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. రైల్వే సీఐ కథనం మేరకు కర్నాటక రాష్ట్రం యశ్వంత్‌పూర్ నుంచి బుధవారం ఉదయం యశ్వంత్‌పూర్-లక్నో ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. ఇంజన్ వెనుక జనరల్ బోగీలో మహారాష్ట్రకు చెందిన సందీప్ కౌర్, విశాల్‌కుమార్ ఘడే, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కిరణ్, కమలేష్ సింగ్, రాజేష్‌కుమార్, అఖిలేష్‌కుమార్, వినోద్‌కుమార్, సంజయ్, వికాస్, విజయశంకర్ ప్రయాణిస్తున్నారు.



వీరంతా యశ్వంత్‌పూర్‌లో రకరకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సొంత ఊళ్లకు వెళ్లేందుకు బయలుదేరారు. వీరు రైలు ఎక్కిన అర గంట వ్యవధిలో మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అదే బోగీలోకి వచ్చారు. సహ ప్రయాణికులతో మాటామంతీ కలిపి వారి వద్దనున్న బిస్కెట్లను ఇచ్చారు. ప్రయాణికులు నిరాకరించడంతో ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు తన పుట్టిన రోజు అని చెప్పడంతో తీసుకున్నారు. బిస్కెట్లతో పాటు మాజా డ్రింక్ కూడా సేవించారు. సేవించిన పది నిమిషాల వ్యవధిలోనే వారందరూ నిద్రలోకి చేరుకున్నారు. కాపుకాసిన దుండగులు వారి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, నగదు తీసుకుని పారిపోయారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు వీరు నిద్ర వీడకపోవడంతో ఇతర ప్రయాణికులకు అనుమానం వచ్చింది. నిద్ర లేపే ప్రయత్నం చేసినప్పటికీ వారిలో కదలిక కానరాలేదు. అప్పటికే రైలు రేణిగుంట చేరుకుంది. దీంతో ప్రయాణికులు ఆ రైల్వే జంక్షన్‌లో అధికారులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 10 గంటలకు గూడూరు చేరుకోవడంతో జీఆర్‌పీ ఎస్ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి బోగీలోకి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో చేరుకున్న 11మంది ప్రయాణికులను రైలు నుంచి కిందకు దింపి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు రాత్రంతా చికిత్స అందించడంతో గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రయాణికులు స్పృహలోకి వచ్చారు. రైల్వే సీఐ దశరథరామయ్య స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఏరియా ఆస్పత్రిలో బాధితులను గూడూరు డీఎస్పీ రాంబాబు తదితరులు పరామర్శించారు. కేసు దర్యాప్తునకు సీఐ ఆళ్వేశ్వరరావు, రైల్వే సీఐ దశరథరామయ్య నేతృత్వంలో ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధితులు ఇచ్చిన వివరాలతో ఊహా చిత్రాలను తయారు చేస్తున్నామన్నారు. కేసును యశ్వంత్‌పూర్‌కు బదిలీ చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ బాలకృష్ణ ప్రకటించారు.



అద్దంకి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుపై ఏసీబీ దాడి

మధ్యవర్తుల వద్ద రూ.57,830 నగదు స్వాధీనం

విశాలాంధ్ర - అద్దంకి : ప్రకాశం జిల్లా అద్దంకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై గురువారం ఒంగోలు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఏర్పాటు చేసుకున్న ఐదుగురు మధ్యవర్తుల వద్ద రూ.57,830 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ తోట ప్రభాకర్ మాట్లాడుతూ అద్దంకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెద్ద ఎత్తున లంచాలు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. కొంతకాలంగా కార్యాలయంపై నిఘా పెట్టిన నేపథ్యంలో కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ స్వయంగా అంజయ్య, శ్రీనివాసరావు అనే ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను పెట్టుకొని వారి ద్వారా రోజు డాక్యుమెంట్ రైటర్ల వద్ద లంచాలు తీసుకుంటున్నారన్నారు. గతంలో డాక్యుమెంట్ రైటర్లే రిజిస్ట్రారుకు లంచాలు ఇచ్చేవారని, ప్రస్తుతం రిజిస్ట్రార్ ప్రైవేటు వ్యక్తుల ద్వారా వసూలు చేస్తున్నారన్నారు. గురువారం కార్యాలయంలో తనిఖీ చేయగా అంజయ్య, శ్రీనివాసరావు వద్ద నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధవారం రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారి వద్ద డాక్యుమెంట్ రైటర్లు వసూలు చేసి మధ్యవర్తులకు అప్పగించారన్నారు. బుధవారం 16 డాక్యుమెంట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారిలో ఎవరెవరి వద్ద ఎంత వసూలు చేశారనే విషయాలపై స్టేట్‌మెంట్ ఇస్తే అధికారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐ టి.ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ దొరికిన సర్వేయర్

నెల్లూరుబ్యూరో : నెల్లూరు రూరల్ మండల సర్వేయర్ ఆదినారాయణ రూ. 10 వేల లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని సర్వే నంబర్ 246లో 0.55 ఎకరాల స్థలాన్ని సర్వే చేయాలని సంక్రాంతి కల్యాణ్ యాదవ్ పలుమార్లు కోరారు. లంచాన్ని కూడా చెల్లించారు. సర్వే చేయకపోగా లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ఏసీబీ డీఎస్పీ పరమేశ్వరరెడ్డి పర్యవేక్షణలో గురువారం సాయంత్రం నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో కల్యాణ్ నుంచి సర్వేయర్ రూ. 10 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. సర్వేయర్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలున్నాయి. నగదును సీజ్ చేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది హడలెత్తిపోయారు.

రూ. 7.50 లక్షల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : అక్రమంగా గుట్కాలు సరఫరా చేస్తున్న షాపుపై దాడులు చేసి, రూ. 7.50 లక్షల విలువైన గుట్కాలు స్వాధీనం చేసుకొని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసినట్లు కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి కర్నూలుజిల్లా కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. బాలాజీ జనరల్ స్టోర్‌లో మనోహర్ గుట్కాలను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం దాడులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో అతని ఇంటిలో వివిధ కంపెనీలకు చెందిన 85 బస్తాల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. గుట్కాలను కర్నాటక రాష్ట్రం బళ్లారి నుండి తెచ్చి గ్రామాలలోని షాపులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీటి మార్కెట్ ధర రూ. 7.50 లక్షలు ఉంటుందన్నారు. సదరు వ్యక్తిని అరెస్టుచేసి స్టాకును నంద్యాల ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించినట్లు వారు తెలిపారు. మనోహర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహశీల్దార్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ జయన్న, సిబ్బంది మహేశ్వరరాజు, శివకుమారు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని జంట

విశాలాంధ్ర - గరివిడి : భర్త గుండెపోటుతో మరణించిన 12 గంటల వ్యవధిలోనే భార్య కూడా గుండెపోటుతో కన్నుమూసిన ఘటన విజయనగరం జిల్లా గరివిడి మండలం తోణ్ణాడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొంటి గంగరాజు (62), భార్య దాలమ్మ (58)కు నలుగురు కుమారులు. ముగ్గురికి పెళ్లి చేశారు. మరో కుమారుకు పెళ్లి చేయాల్సి ఉంది. గంగరాజు అంగన్‌వాడీలో పనిచేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గంగరాజు గుండె పోటుతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహానికి బుధవారం సాయంత్రం దహన సంస్కారాలు ముగిసిన తర్వాత భార్య దాలమ్మ ఒక్కసారిగా కుప్పకూలింది. భర్త ఇక లేడన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోయిన దాలమ్మ కూడా రాత్రి 12 గంటల సమయంలో గుండెపోటుతో మృతిచెందింది. జిల్లా పరిషత్ చైర్మన్ కృష్ణమూర్తి, తదితరులు కుమారులను పరామర్శించారు. సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

మిర్చి రైతుల తిరుగుబాటు

- 'ఈ-నామ్'కు వ్యతిరేకంగా నినాదాలు
- గుంటూరు మిర్చియార్డు వద్ద ఉద్రిక్తత
- ప్రధాన రహదారిపై నిలిచిన ట్రాఫిక్
- నిలిచిపోయిన మిర్చి కొనుగోళ్లు

విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : 'ఈ-నామ్' విధానాన్ని వ్యతిరేకిస్తూ గుంటూరు మిర్చి యార్డులో గురువారం రైతులు ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. దీంతో వ్యాపారులు మిర్చి కొనుగోళ్లు నిలిపివేశారు. సరకును యార్డుకు తీసుకొచ్చిన రోజుల గడుస్తున్నా కొనుగోళ్లు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మిర్చియార్డు వద్ద రహదారి పై రైతులు బైఠాయించారు. దీంతో చిలకలూరిపేట వెళ్ళే రహదారిపై వాహనాలు రాకపోకలు నిలిచి పోయాయి. పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ-నామ్ విధానం ద్వారా వ్యాపారులు కొనుగోళ్లు కు ముందుకు రావడం లేదని, దీంతో సరకు నిల్వలు పెరిగిపోవడంతో ధరలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా మూడు రోజులు సెలవు దినాలు రావడం, వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేయడంతో ధరలు మరింత పతనమయ్యే పరిస్థితి ఉన్నందున పాతవిధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉండటం, సాగు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత ధర గిట్టుబాటు కానందున క్వింటాలుకు కనీసం రూ.10 వేలు పైన ఉండేలా మద్దతు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు రైతుల వద్దకు చేరుకుని పాత పద్ధతిలోనే మిర్చి కొనుగోళ్లు చేయాలని వ్యాపారులకు సూచించడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఈ-నామ్‌పై వ్యాపారుల విముఖత

ఈ-నామ్ పద్ధతిలో మిర్చి కొనుగోలు చేసిన వెంటనే రైతులకు వ్యాపారులు డబ్బు చెల్లించాల్సి ఉంది. ఈ విధానాన్ని వ్యాపారులు వ్యతిరేకిస్తున్నారు. ఈ-నామ్ అమలు అయితే రైతుల నుంచి కమీషన్ 2 శాతం మాత్రమే తీసుకోవాల్సి వస్తుందని వ్యాపారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు వ్యాపారులతో సమావేశం నిర్వహించి ప్రతిపాదిత కొంత గడువు తీసుకుని అమలు చేస్తామని వ్యాపారులకు హామీ ఇస్తున్నారు. ఒప్పందం తేదీ దగ్గర పడినప్పుడల్లా కొత్త సమస్యలను అధికారుల ముందుకు తీసుకొస్తూ వాయిదా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 600 మంది వ్యాపారులు లైసెన్సులు పునరుద్ధరించుకోవాల్సి ఉంది. ఈ-నామ్ పద్ధతిలో రైతులకు ఆన్‌లైన్ చెల్లింపులు చేయకపోతే లైసెన్సులు పునరుద్ధరించవద్దని మిర్చి యార్డు అధికారులను మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనందకుమార్ సూచించారు.

ఇది పోరాట విజయం

- ఐక్యపోరాటాలు, ఉద్యమాలతో సాధించుకున్నాం..
- ముప్పాళ్లకు గౌరవాభివందనాలు
- సీఎం సహా అధికారులకు కృతజ్ఞతలు
- మృతి చెందిన అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల కుటుంబ సభ్యులు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అగ్రిగోల్డ్ సంస్థ చేసిన దారుణ మోసం వల్ల ఆత్మహత్యలు, అసహజ మరణాలపాలైన వారికి ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించడం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పోరాట విజయమని మృతుల కుటుంబీకులు స్పష్టం చేశారు. మూడేళ్లుగా విరామం లేకుండా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాధరెడ్డి, తిరుపతిరావు నేతృత్వంలో ఆందోళనలు, ఉద్యమాలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, బస్సు యాత్ర, నిరాహారదీక్షలు చేసిన ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం స్పందించిందన్నారు. అసోసియేషన్ పిలుపు మేరకు నిర్వహించే కార్యక్రమాలకు ప్రజాసహకారం పెద్ద ఎత్తున లభించిందన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందచేసే రూ. 5 లక్షల పరిహారం తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పిల్లలకు చదువులు, వివాహాలు చేసేందుకు వినియోగిస్తామన్నారు. అగ్రి సంస్థ కారణంగా ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురైన కుటుంబాలకు గురువారం వెలగపూడిలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బాధిత కుటుంబాలు విజయవాడ పూర్ణానందంపేటలోని తాడికొండ శ్రీరాములు కల్యాణమండపంలో బస చేశారు. ఆయా జిల్లాల నుంచి పోలీసు అధికారుల పర్యవేక్షణలో బాధిత కుటుంబీకులు రైళ్లు, బస్సులతోపాటు పోలీసు వాహనాల్లో విజయవాడ చేరుకున్న వీరికి పోలీసులే భోజన సదుపాయాన్ని కల్పించారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు విశ్వనాధరెడ్డి, తిరుపతిరావుతోపాటు బాధ్యులు బాధిత కుటుంబాలకు సహకరించారు.

అధైర్య పడకండి: మంత్రి ప్రత్తిపాటి

ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురైన బాధిత కుటుంబాలు అధైర్యపడకుండా ఉండాలని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరపున వెలగపూడి తీసుకెళ్లేందుకు వచ్చిన ఆయన కల్యాణమండపంలో బాధిత కుటుంబాలతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 185 మంది మరణిస్తే తొలి విడతగా వంద మందికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తోందన్నారు. రాబోయే బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించి మిగిలిన వారికి పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారిని ప్రత్యేక వాహనాల్లో వెలగపూడి తీసుకెళ్లారు. మంత్రి వెంట అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితర నేతలు ఉన్నారు.

రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన బాధిత కుటుంబ సభ్యుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

అమ్మాయి పెళ్లి చేస్తా...

జీహెచ్ నజమున్నీసా, ఆత్మకూరు, కర్నూలుజిల్లా



కార్పెంటర్‌గా చేసే నా భర్త అబ్దుల్ కలాం (50) అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా చేస్తూ బంధుమిత్రులతో 23 లక్షల వరకూ డిపాజిట్ చేయించారు. కంపెనీ మోసం చేయడంతో డిపాజిటర్ల వత్తిడికి తట్టుకోలేక 2016 ఆగస్టు 26న వెలుగోడు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మాకు నలుగురూ ఆడపిల్లలే. ముగ్గురికి వివాహమైంది. చివరమ్మాయికి ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో పెళ్లి చేస్తాను.

చిన్నతనంలోనే తండ్రి మరణం..

కె సురేఖ, కె సుప్రజ రామరాజుపల్లె, కడపజిల్లా



చిన్నతనంలోనే తండ్రి జయరామిరెడ్డి మరణించడంతో తల్లి రమాదేవి (40) చిల్లరకొట్టు ద్వారా మమ్మల్ని సాకింది. మేము ముగ్గురం ఆడపిల్లలమే. మా భవిష్యత్తు కోసం ప్రతి రూపాయి కూడబెట్టి అగ్రిగోల్డ్‌లో రూ. 43వేలను డిపాజిట్ చేసింది. సంస్థ దివాళా తీసిందని తెలియడంతో మనస్తాపానికి గురై విషపు గుళికలు తిని 2017 అక్టోబరు 19న ఆత్మహత్య చేసుకుంది. చెల్లెలు సునంద చదువు, పెళ్లి కోసం పరిహారాన్ని వినియోగిస్తాము.

చేతికొచ్చిన కొడుకు దూరం..

ఎం వన్నూరు సాబ్, నిడపనకల్, అనంతపురంజిల్లా



చేతికొచ్చిన కొడుకు రఫీఖ్ (25) ఆసరాగా నిలుస్తాడనుకున్న సమయంలో అగ్రిగోల్డ్ కారణంగా దూరమయ్యాడు. ఇంకా వివాహం కూడా కాలేదు. టైలర్‌గా చేస్తూ అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా చేరాడు. చుట్టుపక్కలవారి ద్వారా ఆ సంస్థలో 20 లక్షల వరకూ కట్టించాడు. తీరా సంస్థ మోసం చేయడంతో కస్టమర్ల వత్తిడిని భరించలేక విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

వేధింపులు తాళలేక రైలు కిందపడి..

కంచర్ల నాగకృష్ణారావు, రాజమండ్రి



అగ్రిగోల్డ్ మోసం వల్ల కస్టమర్ల వేధింపులను తట్టుకోలేక నా కుమారుడు రామవెంకట దుర్గాప్రసాద్ (35) 2017 నవంబరులో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏజెంట్‌గా అగ్రిగోల్డ్‌లో అనేక మంది తో డిపాజిట్లు కట్టించారు. కస్టమర్లు వేధింపులు ఎక్కువ కావడంతో వత్తిడికి గురయ్యారు. ప్రసాద్‌కు నలుగురు సంతానం. వారి చదువులు, పెళ్లిలకు ఈ మొత్తాన్ని ఉపయోగిస్తాం.

పిల్లల చదువుకు ఉపయోగిస్తాం..



షేక్ రమీజాబేగం, ఆత్మకూరు, నెల్లూరుజిల్లా

నా కుమార్తె షేక్ యాసిన్ (27) కూలి పనిచేసేది. భర్త 8 ఏళ్ల క్రితమే వదిలి వేరుగా ఉంటున్నాడు. తన పిల్లల భవిష్యత్తు కోసం అగ్రిగోల్డ్‌లో రూ. 2.5 లక్షల డిపాజిట్ చేసింది. సంస్థ మోసం చేయడంతో దిగులుతో మంచంపట్టి మూడేళ్ల క్రితం మృతి చెందింది. అమె ఇద్దరు ఆడపిల్లల చదువు,పెళ్లిలకు ఈ మొత్తాన్ని వినియోగిస్తాము.

ఒత్తిళ్లతో ఆగిన గుండె...

బి వెంకట రమణ, మునగపాడు, ప్రకాశంజిల్లా



దుస్తుల వ్యాపారం చేస్తున్న భర్త వెంకటేశ్వరరావు (40) అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా కస్టమర్ల నుంచి రూ. 30 లక్షల వరకూ కట్టించారు. కస్టమర్ల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు రావడంతో గుండెపోటుతో మరణించారు. మాకు ముగ్గురు సంతానం. పెద్దమ్మాయికి పెళ్ల యింది. అబ్బాయి, చిన్నమ్మాయిని చదివించి, పెళ్లి చేసేందుకు ఈ పరిహారాన్ని వినియోగిస్తాము.

కస్టమర్ల వేధింపులతో ఉరివేసుకుంది...

పొట్నూరి శ్రీనివాసరావు, కళింగపట్నం, శ్రీకాకుళంజిల్లా



కస్టమర్ల వేధింపులు, వత్తిళ్లు భరించలేక భార్య జ్యోతి 2016 సెప్టెంబరు 26న ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకుంది. మాకు ఇద్దరు సంతానం. మేమిద్ద రమూ కలసి అగ్రిగోల్డ్‌లో ఏజెం ట్లుగా చేస్తూ మొత్తం రూ. 25 లక్షల వరకూ డిపాజిట్లు కట్టించి మోసపోయాం. ప్రభుత్వం అంద చేసే ఎక్స్‌గ్రేషి యాను ఇద్దరు పిల్లల చదువుకోసం ఖర్చు చేస్తాను.

డబ్బు రాదని తెలిసి...

వీరవల్లి తారక దుర్గారావు, వేల్పూరు గ్రామం, పశ్చిమగోదావరిజిల్లా



మానానమ్మ వీరవల్లి పాపాయమ్మ తాను డిపాజిట్ చేసిన రూ. 20వేలు రాదని తెలిసి 2015 ఏప్రిల్ 28న గుండె పోటుతో మరణించింది. కష్టించి కూడబెట్టకున్న డబ్బు రాదని తెలియడంతో మంచం పట్టింది. అగ్రిగోల్డ్ చేసిన మోసాన్నే ప్రతిక్షణం తలచుకుంటూ ఉండేది.

చుట్టలు చుట్టి దాచిన డబ్బులు రావని...

చుక్కా లక్ష్మి, భవానీపురం విజయవాడ, కృష్ణాజిల్లా



నేను అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా చేస్తూ తల్లి అచ్చియ్యమ్మతో కూడా రూ. 10వేలు డిపాజిట్ చేయించాను. తాను చుట్టలు చుట్టి సంపాదించిన సొమ్మును మరింత ఎక్కువ అవుతుందనే ఉద్దేశంతో నాకిచ్చింది. సంస్థ మోసం చేయడంతో ఇరుగుపొరుగు వారు నన్ను అనరాని మాటలు అంటున్నారు. తన సొమ్ము రాదని మనస్తాపంతో మరణించింది. ప్రభుత్వం పరిహారం చెల్లించే విధంగా కృషి చేసిన అసోసియేషన్ కార్యవర్గానికి కృతజ్ఞతలు.

భర్త మరణంతో కూలీ చేస్తున్నా..

ఎస్ షాజాదీ, దామలచెరువు, పాకాల మండలం, చిత్తూరుజిల్లా



భర్త ఎస్ మౌలా అగ్రిగోల్డ్‌లో ఏజెంట్‌గా చేస్తూ అనేకమందితో డిపాజిట్లు చేయించారు. కస్టమర్ల వత్తిడి పెరగడంతో గుండెపోటుతో మరణించారు. మాకు ఇద్దరు సంతానం. ప్రస్తుతం కూలిపని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాను. ప్రభుత్వం అందచేసిన పరిహారంతో పిల్లల్ని చదివించి, అమ్మాయికి వివాహం చేస్తాను.

కూతురి పెళ్లి ఆగడంతో...

వనపర్తి శ్రీప్రియ, సాతులూరు, గుంటూరుజిల్లా



కూతురి పెళ్లి ఆగిపోవడంతో భర్త వెంకటరత్నం (45) గుండె పోటుతో మరణించారు. మాకు ఇద్దరు సంతానం. పెద్దమ్మాయి పెళ్లి కోసం రూ. 50వేలను డిపాజిట్ చేసాం. సంస్థ ఆమొత్తాన్ని తిరిగివ్వకపోవడంతో పెళ్లి ఆగి పోయింది. చేసిన అప్పులు తీర్చి మిగిలిన సొమ్మును బ్యాంకులో ఉంచి అవసరాలకు వినియోగిస్తాను.

అప్పులు తీరుస్తాం..

ఎం.సూర్యకాంతం, కొండలక్ష్మీపురం, విజయనగరంజిల్లా



నాభర్త విశ్వనాధం (40) అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా చేస్తూ పలువురి వద్ద నుంచి డిపాజిట్లను సేకరించి సంస్థలో చేర్పించారు. సంస్థ మోసం, కస్టమర్ల ఒత్తిళ్లు పెరిగి గుండెపోటుకు గురై దూరమయ్యారు. మాకు ఇద్దరు సంతానం. కొన్ని అప్పులు న్నాయి. వాటిని తీర్చి మిగిలిన మొత్తంతో పిల్లల్ని చదివిస్తాను.

ఒత్తిడితో గుండెపోటు...



ఆడారి లక్ష్మీపార్వతి, వెంకుపాలెం, విశాఖ జిల్లా.

నా భర్త నాగప్పారావు (45) అగ్రిగోల్డ్ ఏజెంట్. 2015 అక్టోబరు 15న గుండెపోటుతో మరణిం చారు. మాకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్దమ్మాయిని దత్తతకు ఇచ్చాము. రెండో అమ్మాయి మా అమ్మవద్ద ఉంటోంది. చిన్న కూతుర్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నా. ప్రభుత్వం ఇచ్చే పరిహారంలో అప్పు తీర్చి మిగిలిన దానితో చిన్నమ్మాయిని చదివించి, పెళ్లి చేస్తా.

బడ్జెట్‌లో వెలిగొండకు నిధులు కేటాయించాలని

సీపీఐ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా కలెక్టరేట్ ముట్టడి

- రామాయపట్నం పోర్టు నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాయాలంటూ డిమాండు
- పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణతో సహా 30మంది నాయకులు, కార్యకర్తలు అరెస్టు



విశాలాంధ్ర - ఒంగోలు : ప్రకాశం జిల్లా అభివృద్ధి కోసం పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలని, రామాయపట్నం పోర్టునిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖరాయాలని కోరుతూ గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. ఈ ముట్టడి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి సీపీఐ కార్యకర్తలు వాహనాలలో కలెక్టరేట్ వద్దకు చేరుకుని ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌డీ సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ, జిల్లా అభివృద్దే లక్ష్యంగా 48 సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలోని కొంత, కర్నూల్ జిల్లాలోని కొంత, గుంటూరు జిల్లాలోని కొంత వెనుక బడిన ప్రాంతాలు తీసి ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. అయితే అప్పటి నుండి జిల్లా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నతీరుగా అభివృద్ధిలో వెనుకబడి వుందన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు పూలసుబ్బయ్య, గుజ్జుల యలమందారెడ్డి, పాపిరెడ్డితో పాటుగా అనేక మంది నాయకులు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణమే ప్రత్యామ్నాయంగా సూచించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల విడుదల విషయంలో పక్షపాతం వ్యవహించారన్నారు. ఆయన విడుదల చేసిన నిధులు కనీసం కరెంటు బిల్లులు కట్టేందుకు కూడా సరిపోలేదన్నారు. దీనిని బట్టే ప్రాజెక్టు నిర్మాణం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్ధమవుతుందన్నారు. అలాగే రామాయపట్నం పోర్టు కూడ నిర్మాణానికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు యాజమాన్యంతో ఉన్న స్వార్ధపూరిత ఒడంబడికల కారణంగా రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వమే మోకాలడ్డి జిల్లా అభివృద్ధికి ఆటంకపరస్తుందని విమర్శించారు. పోర్టు నిర్మాణం జరిగితే జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెంది వేలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయ న్నారు. జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చి కరవు నిధులు కేటాయించి, ఉపాధి పనులు మెరుగుపరచాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు హనుమారెడ్డి, మార్కాపురం ఏరియా సీపీఐ నాయకులు అందె నాసరయ్య, తదితరులు మాట్లాడారు.

నాయకుల అరెస్టు

కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా సీపీఐ జిల్లా నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

ఈ ముట్టడి కార్యక్రమం సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన పలువురు కార్యకర్తలు కలెక్టరేట్ రెండు గేట్ల వద్ద బైఠాయించారు. దీంతో కలెక్టరేట్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.దీంతో పోలీసులు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, నాయకులు సర్దార్, హనుమారెడ్డి, పీవీఆర్ చౌదరి, ఎం వెంకయ్య, అందె నాసరయ్య, చంద్రశేఖర్, ఉప్పుటూరిప్రకాశం, కృష్ణగౌడ్, లెనిన్ కుమారి నంద, విజయ, మస్తానమ్మ, నల్లూరి మురళిలతో పాటుగా నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేసి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు, ఈ సందర్భంగా సీపీఐ నాయకులకు పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో కొంతమంది నాయకులకు, కార్యకర్తలకు స్వల్పగాయాలయ్యాయి.

మద్దతు ధరకు కందులు కొనుగోలు

విశాలాంధ్ర-అమరావతి : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటా కందుల ధర రూ.5,450ల రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో కందులు కొనుగోలు విషయమై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా కందుల ధర రూ.4,200లుగా ఉండగా కేంద్రం క్వింటా 5,450లుగా నిర్ణయించినందున మార్కెట్ ధరకంటే రూ.1000లు పైగా అధికంగా ఉన్నందున రైతులు వారు పండించిన కంది పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకునేందుకు కృషి చేయాలని సిఎస్ సూచించారు. కంది పండించిన రైతులందరూ వారి పంటను సక్రమంగా మద్దతు ధరకు విక్రయించుకునే విధంగా కొనుగోలు కేంద్రాల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. రైతుల నుండి మద్దతు ధరకు కొనుగోలు చేసిన కందిని పౌరసరఫరాలు, సంక్షేమ శాఖలు, విద్యాశాఖలు నిర్దేశిత అక్విజిషన్ ధరల ప్రకారం తీసుకుని మిల్లింగ్ చేయించి కందిపప్పుగా వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం ప్రకటిచిన మద్దతు ధరవల్ల సుమారు లక్ష మంది రైతులకు 140కోట్ల రూ.లు అదనంగా ఆదాయం సమకూరుతుందని సిఎస్ పేర్కొన్నారు. కేంద్రం మరింత కందిని మద్దతు ధరకు కొనుగోలు చేసేలా అనుమతి ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తరుపున లేఖ వ్రాయాలని తాను సంబంధిత శాఖ కార్యదర్శితో మాట్లాడతానని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎండి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 2017-18 ఖరీఫ్‌లో 2లక్షల 64వేల హెక్టార్లలో కంది సాగు చేయగా 2లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని వివరించారు. లక్ష మెట్రిక్ టన్నుల కందిని మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిందిగా కేంద్రానికి ప్రతి పాదనలు పంపగా కేంద్రం 45వేల 200 మెట్రిక్ టన్నులకు అనుమతి వచ్చింద న్నారు. ఆ ప్రకారం రాష్ట్రంలో 7జిల్లాల్లో గల 78 కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు రైతుల నుండి కందిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి కంది పండించిన రైతులందరికీ ప్రత్యేకంగా కూపన్లు జారీ చేశామని, ఆ కూపన్లను చూపి ఆయా కేంద్రాల్లో వారి కందిపంటను మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని చెప్పారు.



'ఆధార్' కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ అయిన మీ సేవా కేంద్రాలు, ఏపీ ఆన్‌లైన్, కార్వే, సీఎంఎస్, రామ్ ఇన్ఫో, శ్రీవేణి సంస్థలు మాత్రం ఈఎస్‌డీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. నగరాలు, పట్టణాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ ఇబ్బందులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మీ సేవా, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులు ఆధార్‌లో తప్పులు సరిదిద్దటం, మార్పులు, చేర్పులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మీ సేవా, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలలో సుమారు 400 రకాల సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆయా కేంద్రాల నిర్వాహకులు ఆధార్ మినహా ఎక్కువ ఆదాయం లభించే ఇతర సేవలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎక్కడకు వెళ్లినా ఆధార్‌లో మార్పులకు వారం ఆగాలనే సమాధానమే వస్తోంది. దీంతో ప్రజలు ఆధార్‌లో లింక్ ఉన్న సేవలను పొందలేని పరిస్థితి నెలకొంది. ఇదిలావుండగా, ఆయా కేంద్రాలలో ఆధార్ సేవలు అందటంలేదని ఈఎస్‌డీకి ఫిర్యాదులు వెళ్లినా సరైన స్పందన లభించటంలేదనే విమర్శలు లేకపోలేదు. అసలు ఆధార్ సేవలను ఈఎస్‌డీ పర్యవేక్షిస్తుందనే విషయం కూడా సాధారణ ప్రజలకు తెలియదు. దీంతో ఆధార్ కేంద్రాలపై ఎక్కడ ఫిర్యాదు ఇవ్వాలో కూడా తెలియదంటే అతిశయోక్తి కాదు.

పథకాలన్నింటికీ ఆధార్ డేటాబేస్

రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ డేటా బేస్‌ను ఆధారం చేసుకునే పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పలు పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు అన్ని శాఖల ఉన్నతాధికారులు ఆధార్ డేటాబేస్‌తో సరిపోల్చుకుంటున్నారు. ఆధార్ నంబర్ లేకపోతే ప్రజలకు సంక్షేమ పథకాలను అందించటంలేదు. ఎన్‌రోల్‌మెంట్ సమస్య పెద్దగా లేకపోయినప్పటికీ, తప్పులు సరి చేయటం, మార్పులు, చేర్పులు పెద్ద సమస్యగా తయారైంది. చివరకు ఆధార్‌తో సెల్ నంబర్‌ను లింక్ చేసుకోవటం ఒక ప్రహసనంగా మారిందని ఈ వ్యవరాలను పర్యవేక్షించే అధికారులే అంగీకరిస్తున్నారు. రాష్ట్రంలో ఈఎస్‌డీ గుర్తింపు కలిగిన రెండు వేలు ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు, 5 వేల మీ సేవా కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ సేవలను అందిస్తుండగా, పట్టణాలు, నగరాలలో 400 కార్వే సెంటర్లు, 250 రామ్ ఇన్ఫో కేంద్రాలు, మరో 2,500 సీఎంఎస్, 400 శ్రీవేణి కేంద్రాలలో సేవలు అందుబాటులో ఉన్నాయి. కాని ఎక్కడకు వెళ్లినా ఆధార్ సేవలు అభించటంలేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పులు సరి చేయాలన్నా, మార్పులు చేయాలన్నా, సెల్ నంబర్ లింక్ చేయాలన్నా, చివరకు చిన్న పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌కుసైతం వారం నుంచి పక్షం రోజుల సమయం తీసుకోవటం గమనార్హం.

వెంటాడుతున్న పరికరాల కొరత

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీ సేవా, ఏపీ ఆన్‌లైన్‌తోపాటు కార్వే, సీఎంఎస్ తదితర సంస్థలలో ఆధార్‌కు సంబంధించిన పరికరాల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా బయోమెట్రిక్ పరికరాలు అందుబాటులో లేకపోవటంతో, పలు కేంద్రాల నిర్వాహకులు ఆధార్ సేవలను అందించటంలేదు. రాష్ట్రంలో పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాలన్న తేడా లేకుండా ఈ సమస్య ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆధార్ సంస్థ నుంచే ఆయా కేంద్రాలకు పరికరాలు సరఫరా కావాల్సి ఉంది. బయోమెట్రిక్, ఇతర కిట్స్ ఉన్న నిర్వాహకులుసైతం ఆధార్ సేవలను అందించేందుకు నిరాకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటి నిర్వహణ పూర్తిగా యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ఆధీనంలో ఉంది. దీంతో జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ఈ సమస్య విషయంలో ఏమీ చేయలేనిస్థితిలో ఉన్నారు. చివరకు రేషన్ డిపోలలో రేషన్ తీసుకోవాలంటే వేలి ముద్రలు పడటం లేదు. అలాంటి వారికి రేషన్ ఇవ్వాలన్నా పెద్ద ఇబ్బందిగానే ఉందని పలువురు వాపోతున్నారు.

నెల రోజుల్లో అన్ని పరిష్కరిస్తాం : ఈఎస్‌డీ డైరెక్టర్ సుందర్

ఆధార్ సేవలలో ఎదురవుతున్న ఇబ్బందులను నెల రోజులలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఈఎస్‌డీ డైరెక్టర్ డాక్టర్ బీ సుందర్ చెప్పారు. ఆధార్ సేవలలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆయన 'విశాలాంధ్ర'తో మాట్లాడుతూ, ఈఎస్‌డీ అధీకృత సెంటర్లలో మాత్రమే ఆధార్‌లోని తప్పులను సరి చేయటం, సెల్ నంబర్ లింక్‌తో పాటు చిరునామా మార్పులకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఏపీ ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాల్లో, పట్టణాలు, నగరాలలో కార్వే, రామ్ ఇన్ఫో, సీఎంఎస్, శ్రీవేణి ఏజెన్సీల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా ఆధార్ సేవలు అందించేందుకు నిరాకరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆధార్ సర్వర్‌లో ఇబ్బందులు తలెత్తితే మినహా నిరంతరాయంగా సేవలు అందించాల్సిందేనన్నారు. కొన్ని కేంద్రాలలో ఆధార్ కాకుండా ఇతర సేవలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయని, త్వరలో అన్నింటినీ పరిష్కరిస్తామన్నారు.

18న ప్రభుత్వ వైద్యుల 'చలో అసెంబ్లీ'

- సమస్యల పరిష్కారం కోసం 5 నుంచి దశలవారీగా నిరసన
- 16న పోస్టుమార్టంల నిలిపివేత
- ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధం
- ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ: తమ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపరచాలని వివిధ రూపాల్లో నాలుగేళ్లుగా విన్నవిస్తున్నా ప్రయోజనం లేకపోవడంతో ఈనెల 5వ తేదీ నుంచి 15 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన తెలపాలని నిర్ణయించుకున్నామని ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.భరత్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.శ్యామ్‌సుందర్ తెలిపారు. నగరంలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ నెల 5వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయని, అందువల్ల అదే రోజు నుంచి తాము వివిధ రూపాల్లో నిరసన తెలపాలని కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, బోధనాస్పత్రులతో పాటు అన్ని ప్రభుత్వాస్పత్రుల పరిధిలో నిరసన తెలుపుతామన్నారు. తమ నిరసన ప్రదర్శనల్లో చివరిగా ఈ నెల 18వ తేదీన 'చలో అసెంబ్లీ' కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. తాము నిరసన తెలిపే 15 రోజుల్లోపు ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని ప్రకటించారు. నిరసన ప్రక్రియ కార్యాచరణలో భాగంగా ఈ నెల 5వ తేదీన అన్ని మతాలకు చెందిన ప్రార్థనాలయాలకు వెళ్లి వైద్యులకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించేలా ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కళ్లు తెరిపించాలని ప్రార్థనలు చేస్తామని చెప్పారు. ఏడో తేదీన తమ దిష్టిబొమ్మలను తామే తయారుచేసుకుని(ప్రభుత్వ వైద్యుల దిష్టిబొమ్మలు) రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల మెయిన్ గేట్లకు వేలాడదీసుకుని నిరసన తెలుపుతూ,తమ దుస్థితిని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. 9వ తేదీన పార్టీలతో సంబంధం లేకుండా రాజకీయ నాయకులకు తమ సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందజేస్తామన్నారు. అనంతరం 12వ తేదీన వైద్యం కోసం వచ్చే రోగులకు ఒక నిమిషం పాటు సమస్యల గురించి వివరిస్తామని తెలిపారు.అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే 14వ తేదీన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి వైద్యులకు జరుగుతున్న అన్యాయాలను సుమోటోగా స్వీకరించి ప్రభుత్వానికి తగిన సూచనలు చేయాలని వినతిపత్రం అందజేస్తామని, 15న మానవహక్కుల కమిషన్‌ను కలిసి తమ ఇబ్బందులపై వినతిపత్రం అందిస్తామని వివరించారు. అదేవిధంగా 16వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు పోస్టుమార్టంలు నిలిపివేస్తారని చెప్పారు. చివరిగా 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్యులతో కలిసి 'చలో అసెంబ్లీ' కార్యక్రమం నిర్వహిస్తామని, అయినా ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందన రాకపోతే అదే రోజు నిరవధిక సమ్మె నోటీసు అందజేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా బాక్సర్లపై యాసిడ్ దాడి

మీరట్ (ఉత్తరప్రదేశ్) : స్థానిక లాల్ కుర్తి ఏరియాలో ఇద్దరు మహిళా బాక్సర్లపై యాసిడ్ దాడి జరిగింది. వీరు సాధన చేసేందుకు కైలాష్ ప్రకాష్ స్టేడియం వైపు వెళుతుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు వారిపై యాసిడ్ పోసి పరారయ్యారు. చేతులపై కాలిన గాయాలైన బాక్సర్లను ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. గతంలో నిందితులు, బాధిత బాక్సర్ల మధ్య ఉన్న గొడవలే ఈ ఘటనకు దారితీసినట్లు భావిస్తున్నట్లు మీరట్ నగర ఎస్పీ మాన్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ కేసు నిందితుల్లో ఒక బాలికను అరెస్టు చేశామని, దర్యాప్తు కొనసాగుతున్నట్లు వివరించారు.

న్యాయవాదుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తమ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు ఆందోళన బాటపట్టారు. హైకోర్టు నుంచి పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. హైకోర్టు ఆరో గేటు నుంచి ప్రారంభమైన న్యాయవాదుల ర్యాలీ మదీనా మీదుగా గుల్జార్‌హౌజ్ వరకు చేరుకుంది. అక్కడ ప్రధాన రహదారిపై బైటాయించిన న్యాయవాదులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన న్యాయవాదులు ఉమ్మడి హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. మరో 15 రోజుల్లోగా తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం కూడా తమ ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని న్యాయవాదులు తెలిపారు.

స్విమ్మర్‌పై మూడేళ్ల నిషేధం

ఢిల్లీ:
పారా స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై భారత ఒలింపిక్ కమిటీ వేటు వేసింది. దీంతో అతడు మూడేళ్లపాటు ఏ టోర్నీల్లో పాల్గొనేందుకు వీలు లేదు.



అర్జెంటీనాలో జరిగిన ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన ఏకైక భారతీయ ఆటగాడు ప్రశాంత్. దేశానికి ఎన్నో పతకాలు తీసుకొచ్చిన ప్రశాంత్ 2016లో రియో పారాఒలింపిక్స్‌కు వెళ్లిన స్విమ్మింగ్ జట్టుకు కోచ్‌గా కూడా పని చేశాడు. ఇంతటి సీనియర్ ఆటగాడిపై భారత ఒలింపిక్ సంఘం వేటు వేయడానికి ప్రధాన కారణం అతని చేతలే. ఔను.. మహిళా స్విమ్మర్లు స్విమ్మింగ్ చేస్తుంటే ప్రశాంత్ వీడియోలు తీశాడు. విచారణలో ఇది నిజమని తేలడంతో ఒలింపిక్ సంఘం ఈ కఠిన నిర్ణయం తీసుకోవల్సి వచ్చింది. 2011లో అర్జున, 2015లో మేజర్ ధ్యాన్‌చంద్, 2014లో భీమ్ అవార్డులతో పాటు 2009, 2011లో స్విమ్మర్ ఆఫ్ ద ఇయర్‌గాను ప్రశాంత్ నిలిచాడు.

నన్ను ఎవ్వరితో పోల్చవద్దు

చెన్నై:
తనను టీమిండియా రెగ్యులర్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాతో పోల్చడంపై తమిళ నాడు ఆల్ రౌండర్ విజయ్ శంకర్ స్పందించాడు. త్వరలో శ్రీలంకలో జరిగే ముక్కోణపు సిరీస్‌లో పాల్గొనే జట్టులో హార్దిక్ స్థానంలో విజయ్ శంకర్‌ను ఎంపిక చేశారు. దాంతో హార్దిక్ పాండ్యాకు ప్రత్యామ్నాయం విజయ్ శంకర్ అంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై మాట్లాడిన విజయ్.. 'నాకు ఎవరితోనూ పోలిక వద్దే వద్దు. నన్ను వేరే వాళ్లతో పోల్చడాన్ని నేను కోరుకోవడం లేదు. నాకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించడమే లక్ష్యం.



పోలికకు ఎటువంటి ప్రాముఖ్యత ఇవ్వను. మనల్ని ఎవరితోనైనా పోల్చితే గ్రౌండ్‌లో ఆడే సమయంలో భారీ అంచనాలు ఏర్పడతాయి. మనం కామ్‌గా ఉండి మాత్రమే ఏమిటనేది నిరూపించుకోవాలి. ప్రతీ క్రికెటర్ ఒక ప్రత్యేకత చూపించాలనే తాపత్రాయపడతారు. ఒక క్రికెటర్‌గా మేము కూడా ప్రతీదాన్ని పరిశీలించుకుంటాం. ప్రతీ ఒక్కరి నుంచి ఏదొకటి నేర్చుకుని ముందుగా సాగుతాం. ఇక్కడ పోలిక అనేది ఉండదు' అని విజయ్ శంకర్ పేర్కొన్నాడు. మార్చి 6వ తేదీ నుంచి శ్రీలంకలో జరిగే ట్రై సిరీస్‌లో భాగంగా ఇటీవల భారత క్రికెట్ జట్టు ప్రకటించిన 15 మంది సభ్యుల బృందంలో ఆల్ రౌండర్ విజయ్ శంకర్ చోటు దక్కించుకున్నాడు.

15 ఏళ్ల తర్వాత 'తొలి మ్యాచ్'!

సిడ్నీ:
ఆస్ట్రేలియా అండర్ 19 మహిళా క్రికెట్ జట్టు సుదీర్ఘ విరామం తర్వాత తొలి మ్యాచ్ ఆడటానికి సన్నద్ధమవుతోంది. మరో రెండు నెలల్లో దక్షిణాఫ్రికా పర్యటనకు రాబోతున్న ఆసీస్ అండర్ 19 మహిళా జట్టు.. సఫారీ, ఇంగ్లండ్ జట్లతో ట్రై సిరీస్‌లో తలపడనుంది.దాంతో 15 ఏళ్ల విరామానికి ఆసీస్ అండర్ 19 మహిళా జట్టు ఫుల్‌స్టాప్ పెట్టనుంది. చివరిసారి 2003లో



స్వదేశంలో ఇంగ్లండ్‌తో తలపడగా, ఆపై ఇంతకాలాని 'తొలి అంతర్జాతీయ మ్యాచ్'ను ఆడటానికి ఆసీస్ అండర్ 19 మహిళా జట్టు సన్నద్ధమైంది. మరొకవైపు ఆసీస్ అండర్ 19 మహిళలకు ఇదే తొలి విదేశీ పర్యటన కావడం ఇక్కడ విశేషం. ఇందులో 50 ఓవర్ల ట్రై సిరీస్‌తో పాటు, రెండు టీ 20 మ్యాచ్‌ల్లో ఆసీస్ జట్టు పాల్గొనుంది. ఈ మేరకు 14 మంది మహిళా క్రికెటర్లతో కూడిన ఆసీస్ జట్టును ప్రకటించారు. ఆసీస్ అండర్ 19 మహిళా వన్డే క్రికెట్ కెప్టెన్‌గా 16 ఏళ్ల రాచెల్ ట్రెనామన్‌ను ఎంపిక చేయగా, టీ 20 జట్టుకు సారథిగా సస్కియా హార్లీని నియమించారు.

డీఎస్పీగా హర్మన్‌ప్రీత్

ఛండీగర్:
భారత మహిళల క్రికెట్ జట్టు టీ20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, డిప్యూటీ సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీసుగా గురువారం బాధ్యతలు చేపట్టారు. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమ రీందర్ సింగ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) సురేష్ అరోరాలు హర్మన్ ప్రీత్ కౌర్ యూనిఫాంకు స్టార్లను పిన్ చేసి నూతన బాధ్య తలు అప్పజెప్పారు. ''యంగ్ క్రికెటర్ హర్మన్ ప్రీత్‌కు ఈ బాధ్యతలు అప్పజెప్పడంలో పాల్గొ నడం ఎంతో గర్వకారణం. హర్మన్ ప్రీత్ పం జాబ్ పోలీసు విభాగంలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. హర్మన్ ప్రీత్ మాకు ఎంతో గర్వకారకంగా నిలిచింది. ఆమె ఇలానే కొనసాగిస్తుందని నేను నమ్ముతున్నా. నా శుభాకాంక్షలు ఆమెతో ఎప్పటికీ ఉంటాయి'' అని అమరీందర్ సింగ్ ట్వీట్ చేశారు. గతేడాది జరిగిన ఐసీసీ మహిళల ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు రావడంతో హర్మన్‌ప్రీత్ కీలక పాత్ర పోషించింది. దీంతో హర్మన్ ప్రీత్ కౌర్‌కు పంజాబ్ ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగం ఇస్తున్నట్లు గత జులైలో ప్రకటించింది. పోలీసు ఉద్యోగం అంటే బాగుంటుందని కాబట్టి డీఎస్పీ పోస్టుని తీసుకునేందుకు గాను హర్మన్ ప్రీత్ తాను చేస్తున్న రైల్వే ఉద్యో గానికి రాజీనామా చేసింది. అయితే పశ్చిమ రైల్వేతో ఐదేళ్ల ఒప్పందం కుదుర్చు కోవడంతో రిలీవ్ చేసేందుకు అధి కారులు నిరాకరించారు. అయినా వెళ్లాలను కుంటే ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఐదేళ్ల వేతనం రూ.27 లక్షలు చెల్లించాల్సిం దేనని తేల్చి చెప్పారు. ఈ వ్యవహారంలో పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ జోక్యం చేసుకుని, రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాస్తూ హర్మన్ సమస్యను వేరే కోణంలో చూడాలని, ఆమె రాజీ నామాను ఆమోదించాలని కోరారు. సీఎం లేఖతో దిగివచ్చిన రైల్వే, హర్మన్ ప్రీత్‌తో కుదుర్చుకున్న బాండ్‌ను రద్దు చేసింది. దీంతో ఆమె నేడు డీఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించింది.



పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో కోహ్లి!

'ఆడాలి' అనేది పాక్ అభిమానుల కోరిక

ఢిల్లీ:
భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి.. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఆడటం ఏమిటి అనే కదా మీ సందేహం. మీకు అలాంటి అనుమానాలు ఏమీ అక్కర్లేదు. కోహ్లి ప్రస్తుతం క్రికెట్‌కు దూరంగా ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాడు. మరి అలాంటిది పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కోహ్లి అని ఎందుకన్నామంటే.. పీఎస్ఎల్‌లో విరాట్ కోహ్లి ఆడాలని పాక్ అభిమానులు కోరుతున్నారు. మ్యాచ్ జరిగే సమయంలో 'పీఎస్ఎల్‌లో కోహ్లిని చూడాలనుకుంటున్నాం' అని అభిమానులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారాయి. పీఎస్ఎల్-3లో మ్యాచ్‌లు ప్రస్తుతం యూఏఈలో జరుగుతోన్న సంగతి తెలిసిందే. ప్రేక్షకాదరణ లేక స్టేడియాలు వెలవెలపోతున్న ఫొటోలు గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కోహ్లి ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్నాడు. సఫారీ పర్యటనను విజయవంతగా ముగించుకుని వచ్చిన కోహ్లి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. శ్రీలంక-భారత్-బంగ్లాదేశ్ మధ్య జరిగే ముక్కోణపు టీ20 సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకున్నాడు. దీంతో రోహిత్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అందాయి. ఈ నెల 6 నుంచి టీ20 టోర్నీ ప్రారంభంకానుంది.





ముక్కోణపు టోర్నీకి షకీబ్ దూరం

ఢిల్లీ:
భారత్-శ్రీలంక-బంగ్లాదేశ్‌ల మధ్య మార్చి 6నుంచి ప్రారంభంకానున్న ముక్కోణపు టీ20 సిరీస్‌కు కీలక ఆటగాళ్లందరూ దూరం అవుతున్నారు. భవిష్యత్తులో కీలక టోర్నీలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ కోహ్లి, ధోనీ, పాండ్య, భువనేశ్వర్ తదితర ఆటగాళ్లకు విశ్రాంతినివ్వగా, గాయాల కారణంగా శ్రీలంక, బంగ్లాదేశ్ ఆటగాళ్లు దూరం కానున్నారు. తాజాగా బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హాసన్ కూడా ముక్కోణపు టోర్నీకి దూరం అయ్యాడు. దీంతో జట్టు బాధ్యతలను మరో ఆటగాడికి అప్పగించనుంది బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ). గాయానికి చికిత్స కోసం థాయ్‌లాండ్ వెళ్లిన షకీబ్ శుక్రవారం తిరిగి స్వదేశానికి చేరుకోనున్నాడు. మరో వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారట. దీంతో అతడు ముక్కోణపు సిరీస్‌కు దూరమవుతున్నట్లు బీసీబీ వర్గాలు తెలిపాయి. రేపు సన్నాహక శిబిరం ముగించుకుని 4న బంగ్లా జట్టు లంకకు బయల్దేరనుంది. టోర్నీలో బంగ్లా జట్టు తన తొలి మ్యాచ్‌లో భారత్‌ను ఢీకొననుంది. టోర్నీలోని మొదటి మ్యాచ్ భారత్-శ్రీలంకల మధ్య మార్చి 6న జరగనుంది. టోర్నీలో పాల్గొనే మూడు జట్ల నుంచి కీలక ఆటగాళ్లు దూరం కావడంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నంబర్‌వన్నే నా లక్ష్యం

మారేడుపల్లి:
ప్రపంచ నంబర్‌వన్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ఎదగాలనేది తన లక్ష్యమని హైదరాబాద్ స్టార్ ప్లేయర్ పీవీ సింధు వెల్లడించింది. చిన్నతనంలో భారత్‌కు ఆడాలనేది తన కల అని, ప్రస్తుతం ప్రపంచాన్ని జయించడమే తన ధ్యేయమని పేర్కొంది. జాన్సన్ అండ్ జాన్సన్ శానిటరీ నాప్కిన్ బ్రాండ్ స్టేఫ్రీ సంస్థ ఆక్సిలియం హైస్కూల్‌లో 'డ్రీమ్స్ ఆఫ్ ప్రోగ్రెస్' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆక్సిలియం స్కూల్ విద్యార్థి అయిన సింధు ఈ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోంది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో చర్చాగోష్టిలో పాల్గొని పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. నెలసరి అనేది శరీర సహజ ధర్మమని... అమ్మాయిలు ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో కెరీర్‌లో ముందడుగు వేయాలని సూచించింది. మహిళలు తమ శక్తిపై నమ్మకముంచాలని పేర్కొంది. తన తల్లి విజయ తనకు స్ఫూర్తిప్రదాత అని చెప్పింది. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా విజయం అందుకోలేమని... పొరపాట్ల నుంచి గుణపాఠాలు నేర్చుకొని ముందుకు సాగడమే ఇందుకు పరిష్కారమని సూచించింది. ఇతరులను గౌరవించడం, క్రమశిక్షణ అనే విలువల్ని ఈ పాఠశాలలోనే నేర్చుకున్నానన్న సింధు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని పేర్కొంది. విజయానికి నిరంతర కృషి ఒక్కటే మార్గమని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది.



ధోనీ ఉంటే బాగుండేది: గంగూలీ

ముంబై:
భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ 2003 ప్రపంచకప్ ఆడిన భారత జట్టులో సభ్యుడిగా ఉండే బాగుండేదని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు మాజీ సారథి సౌరభ్ గంగూలీ. 'ఏ సెంచరీ ఈజ్ నాట్ ఇనఫ్' ఆత్మకథలో గంగూలీ ఈ విషయాన్ని ప్రస్తావించాడు. 'ఒత్తిడిని తట్టుకుని, మ్యాచ్‌లో స్థిరంగా రాణించే ఆటగాడి కోసం చాలా ఏళ్లు వెతికాను. ఆ లక్షణాలన్ని నాకు ధోనీలో కనిపించాయి. నేను అతన్ని 2004లో చూశాను. అదే 2003లోనే ధోనీ నా దృష్టికి వచ్చి ఉంటే ప్రపంచకప్ ఆడిన భారత జట్టులో సభ్యుడ్ని చేసే వాడిని. 2003 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడాం. ఒకవేళ ధోనీ ఉండి ఉంటే ఫలితం మరోలా ఉండేదేమో మరి. మేము ప్రపంచకప్ ఆడుతున్న సమయంలో ధోనీ భారత రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా పని చేస్తున్నాడు. ధోనీ ఎంతో ప్రతిభ గల ఆటగాడు. దీన్ని అతడు జట్టులోకి వచ్చిన మొదట్లోనే నిరూపించుకున్నాడు. ఈ రోజు నాకు ధోనీ విషయంలో చాలా సంతృప్తిగా ఉంది. నా నమ్మకాన్ని నిజం చేశాడు. టెస్టుల్లో భారత జట్టును నంబర్‌వన్‌గా నిలబెట్టాడు' అని గంగూలీ పేర్కొన్నాడు. ధోనీని ఎలాగైన జట్టులోకి తీసుకురావాలన్న గంగూలీ కోరిక 2004లో తీరింది. బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో ధోనీ చోటు దక్కించుకున్నాడు. గంగూలీ నాయకత్వంలోనే ధోనీ అరంగేట్రం చేశాడు. 2008లో ధోనీ సారథిగా ఉన్న సమయంలో గంగూలీ రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.



న్యాయం కోసం సమరమే

విశాలాంధ్ర బ్యూరో - గుంటూరు:
పార్లమెంట్ సమావేశాల్లో ఏపీకి న్యాయం జరగకపోతే ప్రధాని మోడీ హఠావో ఏపీ బచావో నినాదంతో ముందుకు వెళదామని, విద్యార్థులు, యావత్తు తెలుగు జాతి సుదీర్ఘ పోరాటాలకు సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. గుంటూరులో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. దీనిలో 16 రాజకీయ పార్టీల ప్రతినిధులు, 45 ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథులను వేదికపైకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మార్చి 5వ తేదీ నుంచి ఢిల్లీలో చేపట్టే నిరసన దీక్షలకు పెద్దఎత్తున తరలిరావాలని వక్తలు పిలుపునిచ్చారు.

5న ఢిల్లీ దీక్షలకు పెద్దఎత్తున తరలి రావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగకపోతే ప్రధాని మోడీ హఠావో ఏపీ బచావో నినాదంతో ముందుకు వెళదామని ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి కన్వీనర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. నిజంగా బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో బీజేపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు తక్షణమే రాజీనామాలు చేయాలన్నారు. మార్చి 5వ తేదీ నుంచి ఢిల్లీలో చేపట్టే నిరసన దీక్షలకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలలో ఉన్న అంశాలన్నింటినీ విస్మరించి వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు.

కేంద్ర, రాష్ట్రాలు మోసం చేశాయి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు



రాష్ట్రానికి కేటాయిస్తామన్న విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ వంటివి అన్నింటినీ కేంద్రం తుంగలో తొక్కిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు విమర్శించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం నాలుగేళ్లపాటు ఏపీ ప్రజలను తీవ్రంగా మోసం చేశాయన్నారు. ప్రత్యేక హోదా కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేస్తామన్న సీఎం చంద్రబాబు ఇప్పుడు ఎందుకు మాట మార్చుతున్నారని ధ్వజమెత్తారు. ఐదుకోట్ల మంది ప్రజల ప్రయోజనాలను తెలుగుదేశం పార్టీ తమ ప్రయోజనాల కోసం బీజేపీ వద్ద తాకట్టు పెట్టిందని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం సుదీర్ఘ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

ప్రజలు ఆమరణ దీక్షలకు సిద్ధం కావాలి

ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్



పార్లమెంట్ సమావేశాల్లో ఏపీకి న్యాయం జరగకపోతే సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆమరణ దీక్షలకు సిద్ధం కావాలని ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మార్చి 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలన్నారు. ఢిల్లీలో మార్చి 5 నుంచి వివిధ నిరసనలు, పార్లమెంట్ ముట్టడి వంటివి జరుగుతాయన్నారు. దేశంలో ఉన్న మొత్తం తెలుగుజాతి 13 కోట్ల మంది ఢిల్లీలో గర్జన చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల విద్యార్థులు పోరాటాలు చేయాలన్నారు. మార్చి 15 నుంచి తీవ్రమైన పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు.

బడ్జెట్ సవరణలతో ఏపీకీ న్యాయం చేయాలి

- ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి



పార్లమెంట్ సమావేశాల్లో బడ్జెట్‌లో సవరణలు తీసు కొచ్చి ఏపీకి న్యాయం చేయాలని, కాంగ్రెస్ పార్టీ కూడా కోత తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తుం దని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. పార్ల మెంట్‌లో 184వ నిబంధనపై ఓటింగ్ ప్రవేశపెట్టాలన్నారు. పార్లమెంట్‌లో 14 పార్టీలు ఏపీ ప్రత్యేక హోదాకు మద్దతు ఇస్తున్నాయన్నారు. మార్చి 5వ తేదీ నుంచి 7 వరకు ఆత్మగౌరవ దీక్షలు, మార్చి 8న పార్లమెంట్ ముట్టడి నిర్వహిస్తామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరించినందున ఏపీలో టీడీపీ, బీజేపీ పార్టీలను రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఏపీకి పట్టిన దరిద్రం రాష్ట్ర గవర్నర్

సినీ నటుడు శివాజీ



ఏపీకి పట్టిన దరిద్రం రాష్ట్ర గవర్నర్ అని సినీ నటుడు శివాజీ విమర్శిం చారు. గవర్నర్ అనేక రాజకీ యాలు చేస్తూ మోసం చేస్తున్నారని ధ్వజ మెత్తారు. రాష్ట్రంలో 25 మంది ఎంపీలు ఉండి కూడా ఏమీ సాధించలేక పోయామన్నారు. ప్రత్యేక హోదా విషయంలో టీడీపీ, వైసీపీలు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ స్వచ్ఛందంగా పోరాటాలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కోశాధికారి రాఘవయ్య, ఉత్తరాంధ్ర చర్చా వేదిక అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామారావు, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.లక్ష్మణ్‌రావు, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకుడు సాంబశివరావు, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకుడు రామ్‌దేవ్, ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడు బషీర్‌అహ్మద్, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకుడు రామారావు, ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాంజనేయులు, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, వివిధ పార్టీల నాయకులు మక్కెన మల్లికార్జునరావు, పాశం రామారావు, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, పీవీ మల్లికార్జునరావు, గౌతంరెడ్డి, గద్దె చలమయ్య, కోట మాల్యాద్రి, షేక్‌మస్తాన్‌వలీ, వాసు, విద్యాసాగర్, వైవీ, శాంతకుమార్, లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, కృష్ణయ్య, రమాదేవి, వరప్రసాద్, తాడికొండ నరసింహారావు, తూమాటి శివయ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.








సదస్సులో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, కొణతాల రామకృష్ణ, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కె.ఎస్.లక్ష్మణరావు తదితరులు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.